ముహూర్తం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్ర మాసం, తిథి: శుద్ధ విదియ సా 6.05 వరకు అనంతరం తదియ; నక్షత్రం: రేవతి రా. 8.28 వరకు, అనంతరం అశ్వని; అమృతకాలం: సా. 6.05 నుండి 7.40 వరకు; వర్జ్యం: ఉ 8.12 నుండి 9.59 వరకు తె 5.30 నుండి..; దుర్ముహూర్తం: మ. 12.24 నుండి 1.12 వరకు మ. 2.48 నుండి 3.38 వరకు ; రాహుకాలం: ఉ. 7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ. 10.30 నుండి 12.30 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 . సంచిక: 337 .సోమవారం 19 మార్చి 2018 .హైదరాబాద్ * పేజీలు:12+12 .వెల:5.00. Published from:Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌కు విళంబినామ సంవత్సర పంచాంగం అందజేస్తున్న వేదపండితులు

దేవభూమి తెలంగాణ

- అభివృద్ధి, సంక్షేమంలో దేశానికి మనమే రోల్ మోడల్
- అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి ఘనత మనదే
- విళంబినామ సంవత్సరంలో అన్నీ శుభాలే
- ఉగాది వేడుకల్లో సీఎం కేసీఆర్
- ప్రజలంతా చిరునవ్వుతో బతకాలని ఆకాంక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంపద సృష్టించే సర్వ వనరులు కలిగివున్న తెలంగాణ భవిష్యత్తు వేద పండితులు చెప్పిన ప్రకారం అద్భుతంగా ఉంటుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అన్నారు. ఇప్పటికే గడిచిన మూడేళ్ళలో అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలిచామని ధీమా వ్యక్తం చేశారు. విళంబినామ సంవత్సరంలో అన్నీ శుభాలే జరుగుతాయని, రాష్ట్రం మరింత సుసంపన్నం అవుతుందని ఆకాంక్షించారు. దైవాన్ని ప్రార్థిస్తూ, పెద్దల సలహాలు పాటిస్తూ ముందడుగు వేయడమే తన లక్ష్యమని చెప్పారు. తెలుగు సంవత్సర ఆరంభం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రగతి భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేద పండితుడు బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవనాన్ని శ్రద్ధగా విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా రైతులు సుభిక్షంగా ఉండాలన్నదే తన తపన అని అన్నారు. కర్కాటక రాశి వారికి విళంబిమాన సంవత్సరంలో ప్రత్యేక స్థానం ఉంటుందని, తెలంగాణ రాష్ట్రానిదీ, నాదీ అదే రాశి కావడంతో రాష్ట్ర ప్రతిష్ట, సంపద మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అద్భుతమైన ప్రగతితో అగ్రగామిగా దూసుకు పోతున్న తెలంగాణ నిజంగా దేవభూమి అని, ఈ రాష్ట్ర దేవ రాష్ట్రమని వ్యాఖ్యానించారు. ఇక్కడ జరిగినన్ని పూజలు, యాగాలు దేశంలో మరెక్కడా జరుగలేదన్నారు. ఏ ఒక్క సామాజికవర్గాన్ని చిన్నచూపు చూడకుండా ఆలయాలు, మసీదులు, చర్చీలను సమానంగా 2వ పేజీలో...

యువభారత్‌కు సరికొత్త
విజన్ చూపిస్తా!

- అంతా మోడీ మాయ
- అభివృద్ధి ఏదీ, ఎక్కడ
- బీజేపీ ఒక సంస్థ గళమే
- కాంగ్రెస్‌ది జాతి గళం
- ప్రధాని మోడీపై ప్రజలకు నమ్మకం పోయింది
- ప్లీనరీ ముగింపు సభలో అధ్యక్షుడు రాహుల్‌గాంధీ



- కాంగ్రెస్ వేదిక యువతకోసమే
- దేశ ఆర్థిక పరిస్థితి మోడీ సర్కార్ వైఫల్యానికి అద్దం పడుతోంది
- మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్
- పెద్ద నోట్ల రద్దు ఓ బూటకం
- చిదంబరం విమర్శనాస్త్రం
- ప్లీనరీలో గొంతెత్తి చాటిన తెలంగాణ కాంగ్రెస్ నేతలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: భారతదేశానికి సరికొత్త విజన్ చూపిస్తానని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ప్రపంచంలో అమెరికా విజన్, లేదా చైనా విజన్ పేరు చెబుతున్నారని, తాను సరికొత్త భారత్ విజన్ చూపిస్తానని వ్యాఖ్యానించారు. ప్లీనరీ సమావేశాల ముగింపు ఉపన్యాసమిస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై విమర్శలతో తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ''వేల సంవత్సరాల క్రితం కౌరవులు, పాండవుల మధ్య కురుక్షేత్ర సంగ్రామం జరిగింది. ఆర్ఎస్ఎస్, బీజేపీలు అధికారం కోసం కౌరవుల్లా యుద్ధం చేస్తున్నాయి. నిజాయితీ, సత్యం కోసం పాండవుల్లా కాంగ్రెస్ పార్టీ పోరాడుతోంది'' అని వ్యాఖ్యానించారు. బీజేపీ జాతీయాధ్యక్షుడు ఓ హత్యకేసులో నిందితుడని గుర్తు చేశారు. దేశం మొత్తం కాంగ్రెస్ పార్టీపై ఎన్నో ఆశలు పెట్టుకుందని అన్నారు. కాంగ్రెస్ ఎప్పుడూ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లా ప్రవర్తించలేదని వెల్లడించారు. భారతీయ జనతా పార్టీ ఒక సంస్థ గళమైతే.. కాంగ్రెస్ పార్టీ యావత్ జాతిగళం అని అభివర్ణించారు. ప్రస్తుత ప్రభుత్వం అంచనాలకు అనుగుణంగా పనిచేయడం లేదని విమర్శించారు. దేశంలో ఎక్కడికెళ్లినా యువత నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతోందని అన్నారు. ఎక్కడ చూసినా చైనాలో తయారైన వస్తువులే కనిపిస్తున్నాయని, దేశ యువతకు ఉపాధి ఎక్కడుందని ప్రశ్నించారు. రూ.33వేల కోట్లు దోచుకున్న ఘరానా మోసగాళ్లను బీజేపీ సర్కారు కాపాడుతోందని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. దేశంలో మోడీ మాయ తప్ప ఏమీ కనిపించట్లేదని తెలిపారు. వాస్తవాన్ని దాచడం కోసం ప్రధాని ప్రజల దృష్టి మళ్లిస్తున్నారని విమర్శించారు. స్వచ్ఛభారత్, యోగా దివస్, సర్జికల్ స్ట్రైక్ ఇందులో భాగమేనని అన్నారు. ఓవైపు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే, మరోవైపు ఇండియా గేటు ముందు యోగా చేస్తున్నారని ప్రధాని మోడీపై సూటిగా విమర్శలు సంధించారు. ''తమిళనాడు వెళ్లి భాష నేర్చుకోమంటున్నారు. ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లి మీరు తినేది నచ్చలేదంటున్నారు. మహిళల్ని బట్టలు సరిగా వేసుకోవడం లేదంటున్నారు. మన ప్రధాని మోడీలాగే నీరవ్ మోడీ పేరుంది. ఓ మోడీ రూ.20వేల కోట్లు మింగేశాడు. గుజరాత్ ఎన్నికల్లో గుడికి వెళ్తే రాజకీయం చేశారు. నేడు గుడి, మసీదు, గురుద్వార, చర్చికి 10వ పేజీలో...

ఆస్తి హక్కు సరే... పొందాలంటే ఆర్థిక భారం?
రుసుం తగ్గిస్తే మేలు!

- మహారాష్ట్ర తరహాలో ఓ పథకం తేవాలి
- రిజిస్ట్రేషన్ విలువ నామమాత్రం చేయాలి



(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

తెలుగు రాష్ట్రాల్లో మహిళలకు కూడా ఆర్థిక భరోసా కల్పించేందుకు అనేకపథకాల్ని ప్రభుత్వాలు అమలుచేస్తున్నాయి. తొలిసారిగా ఎన్‌టీ రామారావే మహిళలకు ఆస్తిలో సమానహక్కు కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ అమలుచేయడం మొదలెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వమిచ్చే ఇల్లు, ఇతర ప్రయోజనాల్ని మహిళల పేరిటే జారీ చేస్తున్నారు. తద్వారా పుట్టింటితో పాటు మెట్టినింట కూడా మహిళలకు తగిన గౌరవ మర్యాదలు దక్కుతాయని, ఆమె మాటకు విలువ పెరుగుతుందని ప్రభుత్వం భావించింది. అత్తారింట మహిళకు గౌరవప్రదమైన జీవితం లభిస్తుందని అంచనా లేసింది. మహిళలకు ఆస్తి హక్కుపై ఎన్ని చట్టాలు చేసినా వారికి ఆర్థిక భద్రత మాత్రం లభించడం లేదు. ఇందుకు చట్టాల్లోని లోపాలే కారణం. పుట్టింటి ఆస్తిపై హక్కు కోసం ఏ మహిళ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన దాఖలాల్లేవు. అలాగని ప్రతిమహిళకు పుట్టింటి ఆస్తిలో సమానవాటా దక్కుతున్నట్లు కాదు. ప్రభుత్వమిచ్చే స్థలాలు, ఇళ్ళు మహిళల పేరిటే పట్టాలు ఉంటున్నా వాటిని బదలాయించడం, వాటిపై అప్పు తేవడం లేదా విక్రయించే హక్కు ప్రభుత్వం కల్పించడం లేదు. ఇలా ఆస్తిహక్కు పేరుకే తప్ప మహిళకు వాస్తవ దృక్పథంలో అందుబాటులోకి రావడంలేదు.

తల్లిదండ్రులు బతికుండగానే ఆడపిల్లకు వాటా పంచి అప్పగించాలి. అది కూడా చట్టప్రకారం రిజిస్ట్రేషన్ చేయాలి. ఇలాంటి రిజిస్ట్రేషన్లకు రుసుంను ప్రభుత్వం అనూహ్యంగా పెంచేసింది. మార్కెట్ ధరకంటే కూడా ఇప్పుడు ఇళ్ళ స్థలాలకు ప్రభుత్వ ధరే అధికంగా ఉంటోంది. నిర్దేశిత రిజిస్ట్రేషన్ ధరకు 3వ పేజీలో...



బంగ్లాపై భారత్
థ్రిల్లింగ్ విక్టరీ

- ముక్కోణపు టీ-20 క్రికెట్ టోర్నీలో 4 వికెట్లతో గెలుపు
- చివరి బంతికి సిక్సర్‌కొట్టి గెలిపించిన దినేష్ కార్తీక్
- నిదహాస్ ట్రోఫీ కైవసం

వివరాలు 12లో...



చెరువులో మునిగి
ఐదుగురి దుర్మరణం

'విళంబి'లో విషాదం

మెదక్ జిల్లా కన్నారంలో ఘటన

కౌడిపల్లి, ప్రభన్యూస్ : శుభకార్యానికి వచ్చి చెరువులో జెసీబీ గుంతలో పడి ఓ కుటుంబం మృత్యువాత పడ్డ దురదృష్టకర సంఘటన జరిగింది. విళంబి నామ సంవత్సరం మొదటిరోజే విషాదాన్ని నింపిన ఈ సంఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కన్నారం గ్రామంలో జరిగింది. ఈ విషాద సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలావున్నాయి. కౌడిపల్లి మండలం కన్నారం గ్రామంలో జరిగే పెళ్ళి కార్యక్రమానికి అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ అసన్‌హాలీ 9వ పేజీలో...

ఉద్యోగుల్లేక రవాణా రంగం కుదేలు
చోదకులేరీ?

- జీడీపీలో 11 శాతం వాటా రవాణాదే
- డ్రైవింగ్‌పై ఆసక్తి చూపని యువత
- 51 లక్షల మందికి పైగా కొరత
- ఏటా పెరిగిపోతున్న నిరుద్యోగం
- శిక్షణనిస్తే మరో అతిపెద్ద ఉపాధి కల్పనా రంగంగా మారే అవకాశం
- ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని మార్కెట్ వర్గాల సూచన



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

దేశంలో ఎన్నిరకాల వనరులు అందుబాటులోకొచ్చినా నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ప్రధా నరంగాలేవీ పెద్దసంఖ్యలో ఉద్యోగాల్ని సృష్టించలేక పోతున్నా యి. అత్యున్నత నైపుణ్యం కలిగిన విద్యార్థులకు మాత్రమే ఐటీ రంగ ఉద్యోగాలు దక్కుతున్నాయి. తగిన విద్యార్హతల్లేని సాదా సీదా యువకుల్లో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఇదిలా ఉంటే స్థూల జాతీయోత్పత్తిలో 11శాతం వరకు భాగ స్వామ్యం వహిస్తున్న రవాణా రంగం ఇప్పుడు ఉద్యోగుల్లేక కుదేలయ్యే పరిస్థితి దాపురించింది. గతేడాది దేశవ్యాప్తంగా రూ. 20 లక్షల కోట్లకు విస్తరించిన రవాణా రంగం డ్రైవర్లకొరతతో సతమతమయ్యే పరిస్థితి నెలకొంది.

ఏటా కొత్తగా 1.30కోట్ల మంది యువత ఉద్యోగాల వేటలో దిగుతున్నారు. వీరిలో మూడు నుంచి నాలుగు లక్షల మందికి మాత్రమే ఉద్యోగాలు దక్కుతున్నాయి. మిగిలిన యువకులంతా నిరుద్యోగుల జాబితాలో చేరిపోతున్నారు. ఇదిలా ఉంటే దేశంలో రవాణారంగంలో కీలకమైన డ్రైవర్ల కొరత ఆ రంగాన్ని పట్టి పీడిస్తోంది. ప్రభుత్వాలు రవాణరంగ విస్తృతికి అవసరమైన పటిష్టరహదార్ల నిర్మాణంపై దృష్టి పెడుతున్నాయి. ఏటేటా జాతీయ రహదార్ల నిర్మాణ విస్తీర్ణాన్ని పెంచుతున్నాయి. కానీ రవాణా రంగంలో కీలకమైన 3వ పేజీలో...

బీసీ రెసిడెన్సియల్ కాలేజీల్లో
సూపర్ 100

- ఎంపీసీ, బైపీసీలో 800 మంది విద్యార్థులకు శిక్షణ
- జూన్ 1నుంచి ప్రారంభం
- ప్రతిభావంతులకు ప్రత్యేకం

5లో



మళ్లీ భూముల
విక్రయం..!

- రూ.300 కోట్లు సమీకరణే లక్ష్యం
- టీఎస్ఐఐసీ వెబ్‌సైట్‌లో బహిరంగ వేలం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు భారీ ఎత్తున నిధులు అవసరం అవుతుండటంతో వాటి సమీకరణకు ప్రభుత్వ భూములను మరోసారి వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విధివిధానాలను సిద్ధం చేసే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమై ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలతో 9వ పేజీలో...



- మారుతున్న సమీకరణలు
- టీడీపీ ఎంపీలకు విప్ జారీ
- అవిశ్వాసానికి రంగం సిద్ధం
- కొత్త ఎత్తులతో రాజకీయ వ్యూహం
- ప్రత్యేక హోదాకు మద్దతుకైతే ఓకే
- అవిశ్వాసంపై అక్కడే నిర్ణయం
- తెరాస అధిష్టానం

అందరి దృష్టి ఢిల్లీ పైనే

3

పంచాంగంలో టికెట్ల చర్చ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉగాది పంచాంగం వచ్చే ఎన్నికల్లో టికెట్ల అంశాన్ని చర్చకు తెచ్చింది. కుంభరాశి వారికి వచ్చే ఎన్నికల్లో టికెట్లు ధోకా ఉండదని, మిగతా రాశుల వారు కొంత కష్టపడాలంటూ ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కెసిఆర్ సాక్షిగా పంచాంగశ్రవణకర్త బాచంపల్లి సంతోష్‌కుమార్ శర్మ చేసిన వ్యాఖ్యలు టిఆర్ఎస్‌లో చర్చకు దారితీశాయి. సీఎం కెసిఆర్ దీనిపై స్పందించి ప్రజల్లో ఉన్న వారికే టికెట్లు దక్కుతాయని.. హైదరాబాద్‌లో ఉండొద్దని ఎమ్మెల్యేలకు సున్నితపు హెచ్చరికలు పంపారు. ప్రజల్లో ఉన్నవారికి టికెట్లు దక్కడంతో పాటు విజయమూ లభిస్తుందని మరోమారు స్పష్టం చేశారు. టిఆర్ఎస్ఎల్పీ సమావేశం జరిగినప్పుడల్లా ప్రజల్లో ఉండండి.. హైదరాబాద్‌లో ఉన్నవేడు కండి అంటూ హెచ్చరించే సిఎం కీలకమైన ఎన్నికల ఏడాది ఆరంభంలో మరోసారి పార్టీ ఎమ్మెల్యేలకు అదే సంకేతాలు పంపారు. ప్రజల్లో ఉన్నవారికే టికెట్లన్న సిఎం తేల్చేశారు. టిఆర్ఎస్ పార్టీకి ప్రస్తుతం 90మంది ఎమ్మెల్యేలు శాసనసభలో ఉండగా, వచ్చే ఎన్నికల్లో 20మందికి 30మందికి టికెట్లు నిరాకరించవచ్చన్న చర్చ చాలా కాలంగా జరుగుతోంది. ఈ క్రమంలో పార్టీ నిర్వహిస్తున్న సర్వేల ద్వారా కొందరు ఎమ్మెల్యేలు తమ పని తీరును మెరుగుపరుచుకుంటుండగా, మరి కొంద రు సిఎం హెచ్చరించినా.. సర్వే నివేదికలు అందిం చినా తీరు మాత్రం మార్చుకోవడం లేదు. ఇలాంటి వారం దరికీ పంచాంగ శ్రవణం సాక్షిగా సిఎం నవ్వు తూనే సుతిమెత్తని హెచ్చరికలు చేశారని పార్టీవర్గాలు భావిస్తున్నాయి.

మంత్రులకు గండం..

గత పంచాగంలో చెప్పినట్లు విద్యా, వైద్యశాఖల మంత్రులు ఇబ్బందులు ఎదుర్కోగా.. ఈ సారి దేవాదాయ ధర్మాదాయ శాఖ తీవ్ర అప్రతిష్ట పాలవు తుందని.. ఆరోపణలు ఎదుర్కొంటుందని పంచాంగ శ్రవణంలో పేర్కొన్నారు. అతి త్వరలోనే ఐదు నుండి 8మంది మంత్రులకు ఇబ్బందులు తప్పవని పేర్కొన డం ద్వారా సచివుల్లో కొత్త గుబులు రేకెత్తిం చారు. పశువులకు నష్టం జరిగే అవకాశం ఉంది కాబట్టి ఆ శాఖ అప్రమత్తంగా ఉండాలని కూడా సూచనలు చేయగా.. దీనిపై చర్చ జరిగింది. మంత్రులు, ఎమ్మెల్యేల టికెట్లు.. పదవుల విష యంలో పంచాంగం సందర్భంగా రాశుల గమనాన్ని పేర్కొం టూ చేసిన వ్యాఖ్యలు టిఆర్ఎస్‌లో చర్చనీయాంశమయ్యాయి.

రవీంద్ర భారతిలో ఘనంగా ఉగాది కవి సమ్మేళనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉగాది దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ ఆదివారం రవీంద్రభారతిలో కవి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ సమ్మేళనంలో సుమారు వంద కవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి కవితా గానాన్ని వినిపించారు. తెలంగాణ రాష్ట్రంలోని పల్లెటూర్ల వింతలు, విశేషాలు, నదులు, నీటి చుక్క ప్రాధాన్యత, తల్లిదండ్రుల ఔన్నత్యం, పల్లె అందాలు, గలగల పారే సెలయేర్లు, పసిడి పంటలు, మానవతా విలువలు, కుటుంబ గౌరవం, తెలంగాణ భాషా, సంస్కృతి గొప్పదనం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి అభివృద్ధి పనుల విశిష్టను వివరిస్తూ పలువురు కవులు తమ కవిత్వాన్ని వినిపించారు.

(మొదటిపేజీ తరువాయి)

చూస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. భవిష్యత్తులోనూ ఈ ప్రాధాన్యత, ప్రోత్సాహకాలు కొనసాగుతామని పేర్కొన్నారు. మంచి, చెడు, కష్టం, సుఖం కలగలిసినదే జీవితమని సందేశమిచ్చారు. ఆదాయ వ్యయాలు, రాజపూజ్యం అవమానం అన్నీ సానుకూలంగా ఉన్నాయనీ, ఇది శుభ పరిణామాలకు సంకేత మని అన్నారు. తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రంగా విరాజిల్లు తోంద న్నారు. పాడి పంటలతో సుసంపన్నంగా తెలంగాణ తుల తూగుతుం దని ఈ ఏడాది పంచాంగం చెబుతుండడం శుభసూచిక మని అన్నారు. అన్ని పండగలను రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా నిర్వహిస్తోం దన్నారు.

పంచాంగం అనేది గొప్ప సైన్స్

తరతరాలుగా మానవాళికి దశ, దిశ చూపుతున్న పంచాంగం గొప్ప సైన్స్ అని సీఎం పేర్కొన్నారు. యాభై ఏళ్ళ తర్వాత కూడా ఖగోళంలో ఏం జరుగుతుందో కూడా చెప్పే అద్భుతమైన పరిజ్ఞానమే ఈ పంచాంగానికి ఉందన్నారు. దేశంలో పూజారులకు, అర్చకులకు జీతాలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని ప్రకటించారు. అభివృద్ధి, సంక్షేమం ఏ రంగంలో చూసినా దేశానికి రోల్ మోడల్ మన రాష్ట్రమేనని భవిష్యత్తుపై కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. పూర్వ కాలంలోనే గ్రహాలకు సంబంధించి ఖచ్చితమైన సమయాన్ని లెక్క

ప్రజల్లో ఉంటే టిక్కెట్లు ఖాయం

ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించే క్రమంలో, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావడంలో ఎమ్మెల్యేలు మరింత కీలక పాత్ర పోషించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. నిత్యం ప్రజలతో ఉండి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు పనిచేసే వారికంతా టిక్కెట్లు ఖాయమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఉండ కుండా గ్రామాల్లో తిరిగే వారందరికీ గెలుపు వరిస్తుందన్నారు. కొన్ని రాశుల వారికి ఎమ్మెల్యే టిక్కెట్లు కష్టమని పండితులు చెబు తున్నారని, ఆయా రాశుల వాళ్ళు జాగ్రత్తగా ఉండాలని కేసీఆర్ సూచించారు.

దేవభూమి తెలంగాణ



ప్రగతిభవన్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

గట్టేవారని, పురాణాలు, ఇతిహాసాల ద్వారా అద్భుతమైన పరిజ్ఞానం మనకు సంక్రమించిందన్నారు. పంచాంగ రచన అనేది శాస్త్రీయ రచననీ, ఇందులో మూలసిద్ధాంతం ఎప్పుడూ స్థిరంగానే ఉంటుందని చెప్పారు. పండితులు చెప్పిన ప్రకారం ఈ ఏడాది రాష్ట్రంలో దుర్భిక్షం ప్రభావం కూడా తగ్గుతుందన్నారు.

దేశ నిర్మాణంలో ప్రత్యేక పాత్ర

తనను తాను అభివృద్ధి చేసుకుంటూ దేశ నిర్మాణం లోనూ తెలంగాణ ప్రత్యేక పాత్రను పోషిస్తోందని సీఎం కేసీఆర్ తెలిపారు. ఇక్కడ అమలవుతున్న అనేక పథకాలు పొరుగు రాష్ట్రాలకు, కేంద్రానికి ఆదర్శంగా మారుతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. డీజీపీ మహేందర్‌రెడ్డి పర్యవేక్షణలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని, జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసులు ప్రశంసలు అందుకుంటున్నారని. ఇది శుభ పరిణామమని పేర్కొన్నారు. ప్రస్తుతం మనం స్వయం సమృద్ధిగా ఉన్నామని, లేనివారికి చేయూత ఇవ్వడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు.

- తెలంగాణ రాష్ట్ర ఆదాయం 8, వ్యయం 2
- పాలనాధిపతికి రాజపూజ్యం 7, అవమానం 3
- సూర్యగ్రహబలంతో సీఎం కేసీఆర్‌కుమంచి భవిష్యత్తు
- దేశ రాజకీయాల్లో చక్రం తిప్పగలిగే నేతగాప్రత్యేక గుర్తింపు
- పంచాంగ శ్రవణంలో సంతోష్‌కుమార్ శర్మ

ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, నగర మేయర్ బొంతు రామ్మోహన్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రగతిభవన్‌లో పంచాంగ శ్రవణం చేసిన సిద్ధాంతి బాచంపల్లి సంతోష్‌కుమార్ శర్మ పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. అతిత్వరలోనే 5 నుంచి 8 మంది మంత్రులకు ఇబ్బందులు తప్పవని చెప్పారు. మళ్ళీ వారికి పదవులు లభించడం కష్టమేనని పేర్కొన్నారు. రాజకీయంగా కొన్ని రాశుల వారికి పరిస్థితులు ప్రతికూలంగా కనిపిస్తున్నాయని, కొందరు ఎమ్మెల్యేలకు టిక్కెట్లు దక్కవని హెచ్చరించారు.

ప్రభుత్వంలో 8 మంది మంత్రులకు ముప్పు

దేవాదాయ శాఖలో అవినీతి ఆస్కారం ఉంటున్నారు. పశువులకు నష్టం జరిగే ప్రమాదం పొంచి ఉన్నందున పశు సంవర్థకశాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్టోబర్‌లో వానలు, డిసెంబర్‌లో వరదలు వస్తాయని శర్మ చెప్పారు. సూర్యగ్రహ బలంతో సీఎం కేసీఆర్‌కు మంచి భవిష్యత్తు ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశ రాజకీయాల్లో చక్రం తిప్పగలిగిన నేతగా ప్రత్యేక గుర్తింపు వస్తుందని వెల్లడించారు.

కోల్‌కతా నుండి కొత్త రాజకీయం

- మమతా బెనర్జీతో నేడు సీఎం కేసీఆర్ భేటీ
- ప్రత్యేక విమానంలో పయనం
- సీఎం వెంట కేకే, జితేందర్‌రెడ్డి, రాజీవ్ శర్మ, ఐఎఎస్‌లు
- జాతీయ రాజకీయ వర్గాల్లో ఆసక్తి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కోల్‌కతా కేంద్రంగా జాతీయ రాజకీయాల్లో టిఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు తొలి అడుగువేస్తున్నారు. సోమవారం ఉదయం 11.30గంటలకు బేగంపేట విమానాశ్రయం నుండి ప్రత్యేకవిమానంలో కోల్‌కతా బయలుదేరి వెళుతున్న సిఎం కెసిఆర్.. దేశంలోని ప్రాంతీయశక్తుల్లో కీలకంగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీతో భేటీ కానున్నారు. మధ్యాహ్నం నాలుగు గంటలకు ఈ భేటీ జరగనుంది. రెండు గంటల పాటు ఇరువురు ముఖ్యమంత్రులు దేశరాజకీయాల్లో ప్రాంతీయశక్తుల పాత్ర, భవిష్యత్ పరిణామాలపై చర్చించనున్నారు. గతంలో ఏర్పడ్డ తృతీయఫ్రంట్ తరహాలో కాకుండా.. భిన్నంగా వెళ్ళాలన్న తన ఆలోచనలను, దేశాన్ని సమూలంగా మార్చేందుకు.. ఏకీకృతం చేసేందుకు ఉన్న అవకాశాలను, అంశాలను.. బిజెపి, కాంగ్రెస్ లకు భిన్నంగా తాను రూపొందిం చుకున్న ఎజెండాను తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ ముందు సిఎం ఆవిష్కరించే అవకాశం కనబడు తోంది. దేశంలోని ప్రాంతీయపార్టీలను ఏకతాటిపైకి తేగల సామర్థ్యమున్న మమతాబెనర్జీ కెసిఆర్ తృతీయ ప్రత్యామ్నాయం ప్రకటించగానే.. ఫోన్‌చేసి అభినందించారు. ఈ నేపథ్యంలో మమత అండతో ముందడుగు వేయాలని, జాతీయ రాజకీయ పరిణా మాలను.. ప్రస్తుతం వేగంగా వస్తున్న మార్పులను అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా అడుగులు వేయాలని కెసిఆర్ భావిస్తున్నారు. మమతతో భేటీ సందర్భంగా ఇప్పటిదాకా ఏర్పడ్డ కూటములు, తాజా రాజకీయపరిస్థితుల్లో కూటములకు గల అవకాశాలపై చర్చించబోతున్నారు. జాతీయ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలని, దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాలని భావిస్తున్న కెసిఆర్.. మమతాబెనర్జీతో భేటీ తర్వాత ఎలాంటి కార్యాచరణ తీసుకుంటారోనన్న ఆసక్తి నెలకొంది. టిడిపి, వైసిపిలు కేంద్రప్రభుత్వంపై ప్రతిపాదించిన అవిశ్వాసం మీద కూడా నేతలు చర్చించే అవకాశం ఉంది. టిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీనేత కె.కేశవరావు గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున పశ్చిమబెంగాల్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించగా, మమతతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్, టిఆర్ఎస్‌ల మధ్య మైత్రి బలపడడంలో కెకె సంబంధాలు కూడా దోహదపడ్డాయన్న ప్రచారం రాజకీయవర్గాల్లో ఉండగా, ముఖ్యమంత్రి వెంట కెకె కూడా కోల్‌కతా వెళ్ళనున్నారు. దేశంలో బలమైన మహిళానేతకావడం, బిజెపికి బలమైన వ్యతిరేకిగా ఉండడంతో తొలిసమావేశం మమతతోనే జరపాలని కెసిఆర్ నిర్ణయించారు. కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉన్నా.. స్వతంత్రంగా వ్యవహరిస్తున్న మమతా బెనర్జీని ఫెడరల్ ఫ్రంట్ వైపు ఆకర్షించాలని కెసిఆర్ భావిస్తున్నారు. మమతాబెనర్జీతో రెండుగంటలు పాటు సమావేశం కానున్న ముఖ్యమంత్రి కెసిర్ సోమవారం రాత్రి కోల్‌కతా నుండి బయలుదేరి హైద్రాబాద్ చేరుకుంటారు.



సిఎం వెంట ఎవరెవరు?

ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రత్యేక విమానంలో కోల్‌కతా వెళుతుండగా, ఆయనతో పాటు పార్లమెంటరీపార్టీ నేత కె.కేశవరావు, లోక్‌సభ పక్ష నేత జితేందర్‌రెడ్డి హాజరు కానున్నారు. వీరితో పాటు ప్రభుత్వ సలహా దారు రాజీవ్‌శర్మ, మరో ముగ్గురు ఐఎఎస్ అధికారులు సిఎం వెంట వెళ్ళనున్నారు. జాతీయ రాజకీయ పరిణా మాలు వేడివేడిగా మారిన నేపథ్యం లో.. తెలం గాణ ముఖ్య మంత్రి చేస్తున్న ప్రత్యామ్నా య జాతీయ ఫ్రంట్ యత్నాలపై దేశరాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మమతాబెనర్జీతో సిఎం భేటీ అనంతరం ఈ ఫ్రంట్ రూపుపై.. ప్రత్యా మ్నాయ రాజకీయ నిర్మాణంపై స్పష్టత వస్తుందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. ఆకస్మికంగా నిర్ణయాలు తీసుకుని.. హడావుడి అడుగులు వేయ కుండా వ్యూహాత్మకంగా పటిష్టంగా ప్రత్యా మ్నాయ రాజకీయవ్యవస్థను నిర్మించాలని కెసిఆర్ భావిస్తున్నారు. ఈ క్రమంలో కోల్‌కతాలో వేస్తున్న తొలి అడుగు.. కెసిఆర్ జాతీయ ప్రయాణంలో కీలక మలుపు కానుంది. టిడిపి, వైసిపిలు ప్రతిపాదిస్తున్న అవిశ్వాసంపై చర్చ జరిగి ఓటింగ్ వరకు పరిస్థితి వస్తే ఏం చేయా లన్నదానిపై కూడా మమతతో భేటీ సందర్భంగా కెసిఆర్ చర్చించి నిర్ణయం తీసుకున్నారు.

ఉగ్రవాద సంస్థలపై మరిన్ని చర్యలు అవసరం

పాక్‌కు అమెరికా హెచ్చరిక

వాషింగ్టన్: తాలిబన్ ఇతర ఉగ్రవాద సంస్థల నిర్మూలనకు మరిన్ని చర్యలు తీసుకోవాల్సిందేనని పాకిస్తాన్‌ను అమెరికా గట్టిగా హెచ్చరించింది. ముఖ్యం గా పాక్ భూ భాగం నుంచి ఉగ్రవాదులు చేస్తున్న సరి హద్దు చొరబాట్లు, దాడులను అరికట్టేం దుకు కఠిన చర్యలు చేపట్టాలని ట్రంప్ పాలకవర్గం స్పష్టం చేసింది. ఈ విషయంలో ఇస్లామాబాద్ ప్రభుత్వం విఫలమైతే తగు చర్యలకు అమెరికా సిద్ధంగా ఉందన్న విషయాన్ని గుర్తించుకోవాలని సూచించింది. అమెరి కా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్, పాక్ ప్రధాని షాహిద్ అబ్బాసి భేటీ సందర్భంగా ఈ మేరకు అగ్రరాజ్యం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పాక్ దినపత్రిక డాన్ ప్రచురించింది. అమెరికాలోని తన సోదరిని చూసేందుకు వ్యక్తగత పర్యటన నిమిత్తం వెళ్లిన అబ్బాసీ, ప్రత్యేక అనుమతి తో మైక్‌పెన్స్‌ను కలిశారు. వీరిద్దరి మధ్య 30 నిము షాలు చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా తాలిబన్, హక్కా నెట్‌వర్క్, ఇతర తీవ్రవాద సంస్థలపై తక్షణ చర్యలకు పెన్స్ ఒత్తిడి తీసుకొ చ్చినట్లు తెలుస్తోంది. వీరిద్దరి భేటీ వివరాలను ట్రంప్ పాలకవర్గం వాషింగ్టన్ జర్నలిస్టు లకు వివరించిం ది. పాకిస్తాన్ అవలంబిస్తున్న ఆఫ్ఘన్ పాలసీ పట్ల అసంతృప్తితో ఉన్నట్లు చెప్పింది. ద.ఆసియా పాలసీ ప్రకటించి ఆరు మాసాలై నా,పాక్ సరైన చర్యలు తీసుకోవడం లో పాక్ వైఫల్యాన్ని ఈ సందర్భంగా ఎండగట్టింది.

సంపద పెంచుదాం.. ప్రజలకు పంచుదాం

- తెలుగు భాషను కాపాడుకుందాం
- కేసీఆర్‌కు అభినందనలు
- ఉగాది ఉత్సవాల్లో వెంకయ్యనాయుడు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తియ్యనైన తెలుగుభాషను కాపాడేందుకు ప్రతి ఒక్క తెలుగుబిడ్డ కృషి చేయాలని ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. సంపద పెంచుదాం...ప్రజలకు పంచుదామని చెప్పారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ముచ్చింతల గ్రామంలో ఉన్న స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో జరిగిన ఉగాది ఉత్సవాల్లో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మా ట్లాడారు. ఆయన ప్రసం గం చలోక్తులతో సాగింది. తెలుగు పండుగలు సమాజ శ్రేయస్సు, ప్రకృతి తో ముడిపడి ఉన్నాయని, సంక్రాంతి పండు గను పంట కోతల సమయంలో చేసుకుం టామని, అదే విధంగా ఉగాది పండుగ ఆకులురాలి చిగుర్లు వేసే సమ యంలో నిర్వహించు కుంటామని చెప్పారు. శ్రీవిళంబినామ ఉగాది పండుగ మార్పుకు సంకేతమని, గతంలో చేసిన పొరపాట్లు చెయ్యకుండా10 మందికి మంచి చేసే పనులు చేపడ దామన్నారు. ఉగాది పండుగలో ఉపయోగించే షడ్రుచులు జీవన సత్యాలని ఒక్కోటి ఒక ఔన్నత్యాన్ని సంతరించు కున్నాయని తెలిపారు. భారత సంస్కృతీ , సంప్రదాయాలు అత్యంత ఘనమైనవని చెప్పారు. మెసపొటేమియా, ఈజిప్టు, రోమన్ సంప్రదాయాలు భారత్‌తో సమానమైన సంప్రదా యాలని , ఆ సంప్రదాయాలు అంతరించిపోతే, భారత సంప్రదాయాలు ఇంకా విరాజిల్లుతున్నాయని పేర్కొన్నారు. అత్యంత ఘనమైన సంప్రదాయాలకు మనం దూర మవుతున్నామని, బ్రిటీష్ వారసత్వంతో మరచిపోతున్నామని వెంకయ్య నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. జాతీ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేసిన రాణాప్రతాప్ సింహ్, రాణిరుద్రమదేవి, కుమ్రం భీం, అల్లూరి సీతారామ రాజులను మరచిపోయి, విదేశాలకు చెందిన వారి పేర్లు ప్రస్తావిస్తామని, వాటిని మరచిపోయి, భారతీయ ఘన వారసత్వాన్ని చాటిన వారిని గూర్చి ప్రస్తావించాలని కోరారు.

గుడ్ మార్నింగ్ వద్దు.. నమస్కారం చేద్దాం

మనం ఒకరినొకరం కలిసిన చోట గుడ్ మార్నింగ్ చెబుతా మని, ఆ ప్రస్తావనను మరచిపోయి చేతులు జోడించి నమస్కా రం చెబుదామని, థాంక్స్ స్థానంలో ధన్యవాదాలు చెప్పు కుంటే ఎంత బాగుంటుందో చూడాలని ఉప రాష్ట్రపతి సూచించారు.

ఉషను అంతకు ముందెప్పుడూ చూడలేదు..

ఈ సందర్భంగా తన పెళ్లినాటి పరిస్థితులను గూర్చి వెంకయ్యనాయుడు వివరించి అందరినీ నవ్వించారు. తనకు ఉషతో పెళ్లి కాకముందు...ఆమె మా దగ్గరి బంధువే కావచ్చు...పరస్త్రీలను చూడరాదు కదా ...అందుకే ఆమెను చూడ లేదు... ఒకరోజు మా నానమ్మ, వాళ్ల అమ్మమ్మ ఇళ్లు దగ్గరిదగ్గరే కావడంతో ఆమె అక్కడ కూర్చుంది... అక్కడ పెద్దవాళ్లతో పాటు ఆమె తెలుగు సంవత్స రాలను కంఠత పలకుతున్నా రని, అప్పుడే ఆమెను చూశానని చెప్పి నవ్వించారు. అంతేకాదు పెళ్లయ్యాక ఎంత చూసిన సమస్యే లేదని వ్యాఖ్యా నించడంతో అందరు కూడా చప్పట్లు కొట్టారు.

విళంబి నామసంవత్సరంలో మంచే జరుగుతుంది :నాగఫణి శర్మ

ఈ సందర్భంగా ప్రముఖ పంచాంగ కర్త మాడుగుల నాగఫణి శర్మ పంచాంగ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. శ్రీ విళంబినామ సంవత్సరం చాలా ఉత్తమమైనదనీ, అంతా మంచే జరుగుతుం దన్నారు. ప్రస్తుతం భూగోళమంతా భారత్‌నే ఆదర్శంగా తీసుకుంటోందని చెప్పారు. ఈ సంవత్సరంలో సూర్యుడు రాజుగా ఉన్నారని, మేధాశక్తి, బుద్ధి బలానికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు.

గత సంవత్సరం ఢిల్లీలో జరిగిన ఉత్సవాల్లో వెంకయ్యనాయుడు ఉన్నత పదవిని అధిరోహించనున్నారని చెప్పానని, అది నిజమైందని చెప్పారు. తెలుగు సంస్కృతికి ప్రతిబింబం వెంకయ్య నాయుడు అని, ఆయన మాట, కట్టు, బొట్టూ సంస్కృతిని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ కార్య క్రమంలో కేంద్ర పట్టణాభి వృద్ధి శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి, కేంద్ర పంచాయతిరాజ్ , గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, ఉప ముఖ్యమంత్రి మహ్మద్ మహమూద్ అలీ, బీజేఎల్పీ నాయకుడు జి కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎపి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, స్వర్ణభారత్ ట్రస్ట్ చైర్మన్ క్రిష్ణప్రసాద్, విజయవాడ ఛాప్టర్ చైర్మన్ ప్రభాకరరావు, పలు బ్యాంకుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను అభినందిస్తున్నా...

తెలుగు భాష పరిరక్షణ కోసం సీఎం కేసీఆర్ చేబుతున్న చర్యలను ఉప రాష్ట్రపతి అభినందించారు. మాతృభాష రోజు రోజుకు కనుమరుగవుతోందని,ఈ పరిస్థితుల్లో తెలుగులో చదువుకుంటేనే ఉద్యోగం అని ఉత్తర్వులు జారీ చేస్తే తెలుగు భాష పరిఢవిల్లుతుందని వెంకయ్యనాయుడు అన్నారు. రాజ్‌భవన్‌లో ముందస్తు ఉగాది ఉత్సవాల్లో తాను పాల్గొన్నానని, ఆ సందర్భంగా సీఎం కేసీఆర్ ఒక చిన్న పుస్తకం తనకు బహూకరించారని,తీయనైన తెలుగు ...తెలంగాణ వెలుగు అనే ఆ పుస్తకం తెలుగు భాష సాంస్కృతికి కరదీపికగా ఉపయోగపడుతుందన్నారు. అందులో తెలుగు సంవత్సరాలు, వర్ణమాల, తిథులు, వారాలు, మాసాలు , రుతువులను గూర్చి వివరించడం అభినందించదగ్గ విషయమన్నారు. కేసీఆర్ మంచి పని చేశారు. ఆయన చేసిన పని దేశంలోని మిగతా రాష్ట్రా లు కూడా పాటిస్తే మంచిదని వ్యాఖ్యానించారు. ఎపి ప్రభుత్వం కూడా తెలుగు భాష పరిరక్షణ కోసం కృషిచేస్తోందని ప్రశంసించారు. కన్నడ, మళయాలం, తమిళం ఏ భాష మాట్లాడేవారైనా కావచ్చు ...ముందుగా తమ మాతృభాషను నేర్చుకోవాలని, ఆ తర్వాతే ఇతర భాషలను ఎన్నయినా నేర్చుకోవాలని కోరారు.

విళంబిలో కాంగ్రెస్‌కు శుభమే



హైదరాబాద్,ఆంధప్రభ: విలంభి నామ సంవత్సరం కాంగ్రెస్‌పార్టీకి రాష్ట్రంలో మంచి భవిష్యత్ ఉంటుందని పంచాంగకర్త గొట్టిపాల శాస్త్రి వెల్లడించారు. తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా గాంధీభవన్‌లో ఆదివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి పూజలు నిర్వహించారు. అనంతరం ఉగాది వేడుకలను సంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొట్టిపాల తిరుమల శాస్త్రి పంచాంగ శ్రవనం చేశారు. ప్రధానంగా ఈ ఏడాది రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్‌పార్టీకి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పార్టీ అధ్యక్షుడు ఉత్తంకుమార్ రెడ్డి ప్రజల్లో మంచి ఆదరణ పొందుతారన్నారు. కాంగ్రెస్‌పార్టీ విజయాల దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి అల్లం భాస్కర్ , ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అచ్చొచ్చే సంవత్సరమిది



హైదరాబాద్, ఆంధ్రప్రభ : విలంభి నామ సంవత్సరం రైతులకు శుభం చేకూర్చేదని, ఈ ఏడాది అన్నిరకాల మేలు చేకూరుతుందని సిద్ధాంతి శశిభూషణ్ శర్మ తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం పంచాంగ శ్రవణం జరిగింది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, విత్తనాభివృద్ధి కూడా బాగా ఉంటుందన్నారు. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినా రైతులకు పెద్దగా నష్టం చేకూరదని వివరించారు. పంటలు పుష్కలంగా పండుతాయని, చెరువులన్నీ నీటితో కళకళలాడుతాయన్నారు. ఈ ఏడాది సూర్యుడు రాజ్యాధిపతి కాబట్టి వ్యవసాయదారులకు ఎలాంటి విఘ్నాలుండవన్నారు. కేంద్రంలోని అధికార పార్టీకి ఎలాంటి ఇబ్బందులు ఎదురు కావని, చిన్న చిన్న ఆటంకాలు వచ్చినా వాటి ప్రభావం ఏ మాత్రం ఉండబోదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి ఎన్. రాంచందర్‌రావు, పార్టీ నేతలు చింతా సాంబమూర్తి, కాసం వెంకటేశ్వర్లు, సుధాకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. ఉగాది పచ్చడిని నేతలు కార్యకర్తలతో కలిసి పంచుకున్నారు.



ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో ఉగాది వేడుకల్లో తెలంగాణ తెదేపా అధ్యక్షుడు ఎల్.రమణ, పెద్దిరెడ్డి, పార్టీనేతలు, కార్యకర్తలు



జగన్‌కు రాజయోగం

గుంటూరు బ్యూరో, ప్రభన్యూస్ : వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు 12 ఏళ్ళపాటు రాజయోగం ఉందని పంచాంగ శ్రవణంలో వేదపండితులు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కాకుమానులోని జగన్ శిబిరం వద్ద ఆదివారం విళంబి నామ సంవత్సర ఉగాది వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పండితులు వైఎస్ జగన్‌కు వచ్చే ఎన్నికలలో 135 సీట్లు వైసిపి కు లభిస్తాయని జోస్యం పలికారు. అక్టోబర్ 25నాటికి జగన్ కు ఉన్న జాతకపరమైన సమస్యలు తీరిపోతాయన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ కేంద్రం పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా ఎంపీలకు సంఘీభావంగా రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో మానవహారాలు నిర్వహిం చాలన్నారు. ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, మద్దతు ఇస్తున్న పార్టీలు ఈ మానవ హారాలలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

చంద్రబాబుకు టీటీడీ పండితుల ఆశీర్వచనం



అమరావతి, ఆంధ్రప్రభ : ఉగాది పర్వదినాన్ని పురస్క రించుకొని ఏపీసీఎం నారా చంద్ర బాబు నాయుడుకు తిరు మల తిరుపతి దేవస్థానానికి చెందిన వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆదివారం ఉండ వల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి వచ్చిన వేద పండితులు సీఎం చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్‌లను ఆశీర్వదించి వెంకటేశ్వరస్వామి వారి చిత్రపటంతో పాటు టిటిడి పంచాంగం, తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

ప్రత్యేక ఆకర్షణగా దేవాన్ష్..

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మల పల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన విళంబి నామ సంవత్సర ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మనవడు, మంత్రి లోకేష్ కుమారుడు దేవాన్ష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్‌తో కలిసి హాజరయ్యారు. అచ్చతెలుగు సంప్రదాయ రీతిలో పంచెకట్టుతో వచ్చిన దేవాన్ష్ ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షించాడు. తాతయ్య చంద్రబాబుతో కలిసి స్టాల్స్‌లో సందడి చేశాడు. అనంతరం దేవాన్ష్‌కు వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉగాది పచ్చడి తినిపించారు. పంచాంగ శ్రవణం పూర్తయిన అనంతరం దేవాన్ష్ తన నానమ్మ భువనేశ్వరితో కలిసి నివాసానికి తిరిగి వెళ్ళాడు.

శారదాపీఠంలో పంచాంగ శ్రవణం

విశాఖ, ప్రభ న్యూస్: జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారధాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి సమక్షంలో ఉత్తర పీఠాధిపతులు బాలస్వామి ఆధ్వర్యంలో విశాఖ శారదా పీఠంలో శ్రీ విళంబినామ సంవ త్సర ఉగాది పర్వదినం సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహించారు. పీఠం ఆస్థాన సిద్ధాంతి అయిన పంతుల రామలింగస్వామిని పంచాంగ శ్రవణం గావించారు. ఈసంవత్సరం రాశి ఫలాల గురించి వివరించారు. ఈ సం వత్సరం అన్ని రాశుల వారికి బాగుం దని చెబుతూనే దేశా నికి, రాష్ట్రానికి గ్రహాలు అనిస్తితి ఉన్న దని తెలి పా రు.కుజుడు కేతువుతో కలిసి ఉండటం వలన భారతదేశానికి కుజస్థంబన ఉన్నదని తెలిపారు. ప్రభుత్వ అధీనంలో ఉన్న ఆలయాలలో లోకకళ్యాణం కోరకు పరమేశ్వరుడుకి, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిం చాలన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం అతిరుద్ర యాగం, శ్రీ సుబ్రహ్మణ్య వాహనం, లక్ష చండీయాగం, మహాశాంతి హోమం తరచుగా నిర్వహిస్తామని తెలిపారు.

ఉద్యోగుల్లేక రవాణా రంగం కుదేలు

చోదకులేరీ?



(మొదటి పేజీ తరువాయి)

డ్రైవర్ల పోస్టుల పట్ల యువత నిరాదరణకు గల కారణాలపై అధ్యయనం చేయడంలేదు. వారినీ దిశగా ఆకర్షించే ప్రయత్నానికి ఒడిగట్టడంలేదు.

స్థూల జాతీయోత్పత్తి వృద్ధిలో రవాణారంగం కూడా కీలకపాత్ర పోషిస్తోంది. 2001-02లో ఇది కేవలం ఆరుశాతం మాత్రమే ఉండేది. 2011-12నాటికిది 11.89శాతానికి చేరుకుంది. రవాణారంగంలో రోడ్డు రవాణాయే కీలకం. 2016-17లో జరిగిన మొత్తం రవాణాలో రోడ్డు ద్వారా రవాణా 69.11 శాతం. ఆ తర్వాత స్థానాన్ని రైల్వే ద్వారా రవాణా ఆక్రమిస్తోంది. 21శాతం రవాణా రైలు ద్వారా జరుగుతుంటే పైప్‌లైన్లు, అంతర్గత జలరవాణా, విమానాల ద్వారా మిగిలిన రవాణా సాగుతోంది. అయితే రానూను రోడ్డు రవాణారంగానికి సమస్యలు పెరిగాయి. ఇందుక్కారణం తగినంత మంది డ్రైవర్లు అందుబాటులో లేకపోవడమే. యువత ఈ రంగంవైపు ఆసక్తి చూపడంలేదు. దీంతో అంచెలంచెలుగా రోడ్డురవాణా రంగం తన ప్రాధాన్యతను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని అహ్మదాబాద్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌కు చెందిన విద్యార్థులు జరిపిన అధ్యయనంలో స్పష్టమైంది. 2020నాటికి రోడ్డు, రైలు రవాణాల మధ్య నిష్పత్తి 65:35కు పెరుగుతుందని, 2031-32నాటికి రెండూ చెరో సగం పంచుకుంటాయని ఈ అధ్యయనం తేల్చింది.

దేశంలో ఇప్పుడు 68లక్షల ట్రక్కులు ఉన్నాయి. వీటిలో 68శాతం వాహనాలకు యజమానులే డ్రైవర్లుగా వ్యవహరిస్తున్నారు. 2015నాటి అధ్యయనం మేరకు దేశంలో 51లక్షల మంది డ్రైవర్ల కొరత ఉంది. వీరుకాక డ్రైవర్లుగా వ్యవహరిస్తున్న యజమానులతో పాటు ప్రస్తుతమున్న డ్రైవర్లలో 47నుంచి 49శాతం వరకు తర్ఫీదు పొందినవారు కాదు. డ్రైవర్లకు నైపుణ్యం పెంచేతర్ఫీదునిచ్చేందుకు ప్రస్తుతం నమక్కల్ అనేచోట మాత్రమే శిక్షణా కేంద్రముంది. ఇలాంటివి కనీసం 125చోట్ల ఏర్పాటు చేస్తే తప్ప ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న నిపుణులైన డ్రైవర్ల కొరతను అధిగమించే అవకాశాల్లేవని ఈ అధ్యయనం తేల్చింది.

యువతకు తగిన తర్ఫీదునివ్వడంతో పాటు డ్రైవర్లకు కనీస సదుపాయాలు కల్పిస్తే దేశంలో వ్యవసాయం, నిర్మాణరంగాల అనంతరం అతిపెద్ద ఉపాధి కల్పనా రంగంగా ఇది మారుతుందని పలు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో 1,15,435 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదార్లున్నాయి. అయితే దేశంలోని మొత్తం జాతీయ రహదార్లలో ఇవి 2.19శాతం మాత్రమే. అలాగే రాష్ట్ర రహదార్లు 3.63శాతమున్నాయి. జిల్లా , పురపాలక, పంచాయతీ రహదార్లు మిగిలిన 94.18శాతమున్నాయి. దీంతో రవాణా వాహనం జాతీయ రహదారిని వినియోగించుకునే విస్తీర్ణం అతితక్కువగా నమోదౌతోంది. గ్రామీణ రహదార్లు లోపాలమయంగా ఉండడంతో ఆశించిన సమయంలో వాహనం గమ్యానికి చేరడంలేదు. పైగా ఈ రహదార్లు డ్రైవర్ల ఆరోగ్యాల్ని, శారీరక స్థితిని దిగజార్చేస్తున్నాయి. భారత్‌లో డ్రైవర్లకు తగిన సదుపాయాల్లేవు. వారికి కనీస వేతనాలు వర్తించడంలేదు. లారీపై ఏకధాటిగా 20నుంచి 25రోజుల వరకు పని చేయాల్సి వస్తోంది. మార్గమధ్యంలో కనీసం సేదదీరే వెసులుబాటు ల్లేవు. దేశంలోని వాహనాల్లో 69నుంచి 71శాతం వరకు ఐదేళ్ళ కాలపరిమితి మించిపోయినవే. 17నుంచి 19శాతం వరకు క్షీణదశకు చేరుకున్నవే. వీటి నిర్వహణపై ప్రభుత్వ అజమాయిషీ తగినంతగా లేదు. ఇక రహదార్ల వెంబడి కనీసం మంచినీటి సౌలభ్యం కూడా లేదు. పరిశుభ్రమైన ఆహారం కూడా అందడంలేదు. ఒకప్పుడు డ్రైవర్లు హెచ్ఐవీ ఎయిడ్స్ సోకే హైరిస్క్ జాబితాలో ఉండేవారు. వీరికి తగిన ఆరోగ్య అవగాహనా కార్యక్రమాలు ఇక్కడ అమలు చేయడం లేదు. అన్నింటికి మించి 50ఏళ్ళకు పైబడ్డ తర్వాత డ్రైవర్లు వృత్తిని కొనసాగించలేరు. ఆ తర్వాత వారికి ఇక ఎలాంటి ప్రత్యామ్నాయ ఉపాధి లభించడం లేదు. ప్రభుత్వం నుంచి ఏ విధమైన ఆర్థికపర వెసులుబాటు ఉండడంలేదు. డ్రైవర్లను అసంఘటిత కార్మికవర్గంగానే ప్రభుత్వం భావిస్తోంది. అమెరికా, కొన్ని యూరోప్ దేశాల్లో డ్రైవర్లకు కనీస వేతనాలు అమలౌతున్నాయి. రోడ్ల వెంబడి డ్రైవర్లకోసం సేదదీరేందుకు 6వేల శిబిరాల్ని ప్రభుత్వాలే నిర్వహిస్తున్నాయి. ఇందులో నిద్రించేందుకు తగిన వసతులు కల్పిస్తున్నారు. పరిశుభ్రమైన ఆహారంతో పాటు ఆరోగ్య పరీక్షలు కూడా ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నారు. ఈ కారణంగానే అమెరికాలో రవాణారంగం ఏటేటా మరింత విస్తృతమౌతోంది. ఏడాదికి మూడు బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సముపార్జిస్తోంది. భారత్‌లో డ్రైవర్లు మద్యం తాగిందీ లేందీ పరీక్షిస్తారు. కానీ విదేశాల్లో తగినంత నిద్రపోయిందీ లేందీ కూడా పరిశీలిస్తున్నారు. ఈ కారణంగానే భారత్‌తో పోలిస్తే యూరోప్, అమెరికా దేశాల్లో లారీల ప్రమాదాల సంఖ్య అతితక్కువగా ఉంది. ఇక్కడ ప్రతి పది లక్షల కిలోమీటర్ల ప్రయాణానికి 13ప్రమాదాలు జరుగుతుంటే అమెరికాలో ప్రతి పది లక్షల కిలోమీటర్ల ప్రమాదాల రేటు 4.13గా ఉంది. అదే యూరోప్‌లో ఇది 3.80శాతం మాత్రమే నమోదౌతోంది. భారత్‌లో ప్రమాదాల బారిన పడ్డ డ్రైవర్లకు ఇక జీవితం లేనట్లే. మంచానబడితే మరోమార్గం కనిపించడంలేదు. కానీ యూరోప్ దేశాల్లో వాహనంతో పాటు డ్రైవర్లకు కూడా ఖచ్చితంగా జీవితబీమా చేస్తున్నారు. డ్రైవర్ ప్రమాదానికి గురైన పక్షంలో పరిస్థితిని బట్టి భారీగానే పరిహారము అందుతుంది. మంచంమీదున్నా ఆర్థిక ఇబ్బందుల్లేకుండా జీవితాన్ని గడిపే వెసులుబాటు ఏర్పడుతుంది. భారత్‌లో నిరుద్యోగ సమస్యను అరికట్టే యత్నంలో భాగంగా తీవ్ర ఉద్యోగ అవకాశాలున్న డ్రైవర్ ఉద్యోగాలపై యువతకు ఆసక్తి కలిగేలా ప్రభుత్వాలు ప్రయత్నించాలి. ఇందుకోసం ముందుగా డ్రైవర్లకు కనీస సదుపాయాలు, ఆదాయమార్గాలతో పాటు సుస్థిరభవిష్యత్‌కు మార్గదర్శ కాలు నిర్దేశించాలి. 50ఏళ్ళ పైబడ్డ అనంతరం ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలకు భరోసానివ్వాలి. డ్యూటీలో ఉండగా విశ్రాంతి తీసుకునేందుకు సొంత నిధులతో సదుపాయాలు కల్పించాలి. యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చే కేంద్రాల్ని నెలకొల్పాలి.

ఇతర ఉద్యోగాల్లాగే డ్రైవింగ్ కూడా భవిష్యత్ పట్ల భరోసా ఉంటుందన్న ధీమా కలుగజేయాలి. లేనిపక్షంలో రవాణారంగం కుదేలయ్యే ప్రమాదముంది. 2011-12 వరకు సాగిన వృద్ధివేగం ఆ తర్వాత ఈ రంగంలో మందగించింది. ఇందుకు కారణం లారీలు అందుబాటులో ఉన్నా డ్రైవర్లు లేక నెలలో 15నుంచి 20రోజులు మాత్రమే తిరగ్గలుగుతున్నాయి. అమెరికాలో ప్రతి ట్రక్‌కు విధిగా ఇద్దరు డ్రైవర్లున్నారు. వారికి మరో ఇద్దరు సహాయకులు ఉన్నారు. డ్యూటీల వారీగా ట్రక్‌ను 30రోజులు తిప్పే అవకాశాలు ఉన్నాయి. దీనివల్ల యజమానికి ఆదాయం పెరుగుతుంది. రవాణా వ్యవస్థలో ఆదాయం వృద్ధి చెందుతుంది. పరోక్షంగా అనేకమందికి ఉపాధి లభిస్తుంది. అన్నింటికి మించి ధరల పెరుగుదలను ఇది అరికట్టగలుగుతుంది. సకాలంలో మార్కెట్‌కు వస్తువుల్ని చేరవేయడంలో తోడ్పడుతుంది. భారత్‌లో డ్రైవర్ల కొరతను అధిగమించగలిగితే ఇక్కడ లారీలు కూడా నెలకు 30రోజులు తిరుగుతూ యజమానులకు లాభాల్ని, దేశానికి ఆదాయ వృద్ధిని సాధిస్తాయి. లక్షలాదిమందికి ఉపాధి లభిస్తుంది. నిత్యావసరాలు సకాలంలో మార్కెట్‌కు చేరతాయి. నిరుద్యోగ సమస్య కొంత మేరకైనా తీరుతుంది. ఈ దిశగా ప్రభుత్వాలు దృష్టిపెట్టాలని మార్కెట్ వర్గాలు సూచిస్తున్నాయి.

ఆస్తి హక్కు సరే... పొందాలంటే ఆర్థిక భారం?

రుసుం తగ్గిస్తే మేలు!

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగానే రుసుం చెల్లించక తప్పడంలేదు. ఇది తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతోంది. రుసుంతోనే అధికారులు సరిపెట్టడంలేదు. మొత్తం రిజిస్ట్రేషన్ వ్యయంలో మరో 50శాతం వరకు ముడుపులు చెల్లించాల్సిందే. లేనిపక్షంలో కొర్రిలేసి రిజిస్ట్రేషన్‌ను అధికారులే అడ్డగిస్తున్నారు. పైగా ఈ ముడుపుల మొత్తాన్ని నగదు రూపంలో చెల్లించాలి. నగదు లేక ఉన్నా చెల్లించే పరిస్థితిలేక తల్లిదండ్రులు తాము ఆశించిన రీతిలో పిల్లల పేరిట రిజిస్ట్రేషన్ బదలాయింపులు జరపలేక పోతున్నారు. వారి తదనంతరం ఆడపిల్లకు చట్టబద్ధమైన హక్కు లభించడం లేదు. ఇందుకోసం న్యాయస్థానాల్ని ఆశ్రయించడం అత్యంత వ్యయభరితంగా మారింది.మహరాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఓ పథకాన్ని అమలు చేస్తోంది. తల్లిదండ్రుల నుంచి కుమార్తెల పేరిట ఆస్తుల బదలాయింపు రిజిస్ట్రేషన్‌కు ఐదొందలు మాత్రమే వసూలు చేస్తోంది. ఇది తల్లిదండ్రులపై ఎలాంటి అదనపు భారం మోపడం లేదు. వారు ఆరోగ్యంగా ఉండగానే ఆడపిల్ల పేరిట ఆస్తిలో భాగాన్ని రాసిచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. అదే తెలుగు రాష్ట్రాలకొచ్చేసరికి రిజిస్ట్రేషన్ రుసుంకు భయపడి తక్కువ మొత్తానికే కొనుగోలు చేసినట్లు లేదా ఆస్తి విలువ తక్కువగా చూపించి రిజిస్ట్రేషన్‌కు పాల్పడితే ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ధరకు, కొనుగోలు ధరకు మధ్య వ్యత్యాసాన్ని లాభంగా పరిగణించి 30శాతం పన్ను వసూలు చేస్తున్నారు. పైగా అపరాద రుసుం విధిస్తున్నారు. మహిళకు చట్టబద్ధమైన ఆస్తిహక్కు అమల్లోకి రావాలంటే మహరాష్ట్ర తరహాలో ఇలాంటి రిజిస్ట్రేషన్లకు నామమాత్ర రుసుం విధించాలని పరిశీలకులు సూచిస్తున్నారు.కళ్యాణలక్ష్మి, ఇతర పేర్లు పెట్టి పెళ్ళి సమయంలో మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే ప్రయత్నానికి ప్రభుత్వం తెరదీసింది. వివాహం సమయంలో 40నుంచి 50వేల వరకు సామాజిక వర్గాన్ని బట్టి ఫిక్స్‌డ్ డిపాజిట్లు వేస్తోంది. ప్రస్తుతం పేదింట్లో పెళ్ళికి కూడా భోజనాలకే కనీసం లక్ష రూపాయలు ఖర్చవుతుంది. వివాహ సమయంలో ఇలాంటి కొన్ని ఖర్చులు తప్పనిసరి అయ్యాయి. ఈ నేపథ్యంలో పెళ్లి కోసం 40నుంచి 50వేలు అది కూడా నిర్ణీత వ్యవధికి ఫిక్స్‌డ్ డిపాజి ట్ వేసినంత మాత్రాన ఆ కుటుంబానికి అదనంగా ఒరిగేదేం ఉండదు. ఇది మహిళ కు అదనపు భద్రత చేకూర్చే అవకాశం ఇవ్వదు. నిజమైన భద్రత చేకూర్చాలంటే రిజిస్ట్రేషన్ విలువను నామమాత్రం చేయడమేనంటూ స్పష్టం చేస్తున్నారు.

ప్రత్యేక హోదాకు జై

- అవిశ్వాసంపై అక్కడే నిర్ణయం
- తెరాస నేతలతో సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్రప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ, వైసిపి ప్రతిపాదించిన అవిశ్వాసం విషయంలో లోక్‌సభలో పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుందామనిపార్టీ ముఖ్యులతో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా డిమాండ్‌కు ఇప్పటికే పార్లమెంట్ సాక్షిగా టిఆర్ఎస్ మద్దతు ప్రకటించగా, తాజా రాజకీయ పరిణామాలపై అందుబాటులో ఉన్న ముఖ్యనేతలతో సిఎం మాట్లాడుతున్నారు. ఆదివారం అందుబాటులో ఉన్న ఎంపీలు, ముఖ్యనేతలతో ప్రగతి భవన్‌లో దీనిపై చర్చించారు. ప్రత్యేకహోదా అంశానికి టిఆర్ఎస్ మద్దతునిస్తుందని, అవిశ్వాసానికి మద్దతు నివ్వాలా లేదా అన్నఅంశంపై ఇంకా పార్టీ నిర్ణయం తీసుకోలేదని పార్టీకి చెందిన ఎంపీలు చెబుతున్నారు. అవిశ్వాసంపై చర్చ జరిగి.. డివిజన్ జరిగే పరిస్థితి ఉంటే అప్పటి వాతావరణాన్ని బట్టి నిర్ణయం తీసుకుందామని, ఈ లోగా మరిన్ని రాజకీయ మార్పులు జరిగే అవకాశం ఉందని టిఆర్ఎస్ భావిస్తోంది. సోమవారం ఉదయం ముఖ్యమంత్రి కెసిఆర్ కోల్‌కతా వెళ్ళి మమతాబెనర్జీతో భేటీ కానుండగా, ఆమె సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఎపికి ప్రత్యేకహోదాపై జరుగుతున్న అవిశ్వాసం తెలంగాణకు సంబంధించిన వ్యవహారం కాదని, బిజెపి కూడా రాష్ట్రంలో టిఆర్ఎస్‌కు ప్రధానశత్రువు కాదని.. ఈ క్రమంలో తొందరపడి నిర్ణయం తీసుకోవడం కంటే పరిస్థితులను బట్టి వ్యవహరిద్దామని పార్టీ ముఖ్యులతో సిఎం చెప్పినట్లు తెలిసింది. పరిణామాలన్నీ బేరీజు వేసుకుని రాష్ట్రానికి, పార్టీకి మేలు జరిగే నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు.



పండుగ రోజూ ప్రాజెక్టు వద్దే

- కాళేశ్వరం పనులను పర్యవేక్షించిన మంత్రి హరీశ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆయనకు పనే పండుగ. పండుగ రోజు.. సహజంగా కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలనుకుంటున్నారు.. కానీ తనకు పనే సంతోషమంటూ రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఉగాది రోజు బ్యారేజీల వద్దే పనుల పర్యవేక్షిస్తూ తిరిగి ఆశ్చర్యపరిచారు. దటీజ్ హరీష్ అంటూ ప్రశంసలందుకున్నారు. శనివారం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మి స్తున్న అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలను సందర్శించిన హరీష్.. ప్రాజెక్టు స్థలాల వద్దే బస చేసి ఆదివారం ఉగాది పర్వదినమైనా తెల్లవారుజామునే లేచి సుంది ళ్ళబ్యా రేజీ వద్దకు వెళ్ళారు. పనులు పరిశీలించి.. అధికారులకు మార్గని ర్దేశనం చేశారు. పండుగ రోజు కూడా పనేదైవంగా ముందుకు సాగడం అభినందనీ యమ ని, ఇలాంటి పట్టుదల వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు పనులు దేశంలోనే అత్యంత వేగంగా జరిగి చరిత్ర సృష్టిస్తున్నాయని నీటిపారుదల శాఖ వర్గాలు ఆనందం వ్యక్తం చేశాయి.



అందరి దృష్టి ఢిల్లీ పైనే!


- మారుతున్న సమీకరణలు
- అందర్నీ ఏకం చేస్తున్న చంద్రబాబు
- ఎంపీలకు విప్ జారీ అవిశ్వాసానికి రంగం సిద్ధం
- తెలుగుదేశం పార్టీ కొత్త ఎత్తులతో రాజకీయ వ్యూహం

అమరావతి, ఆంధ్రప్రభ : ఇప్పుడు అందరి దృష్టి ఢిల్లీ పైనే ఉంది. కేంద్రంపై అవిశ్వాసం నేపథ్యంలో రాజకీయం చాపకింద నీరులా కొనసాగుతోంది. రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. టీడీపీ ప్రతిపాదించనున్న అవిశ్వాస తీర్మానం నోటీస్‌పై ఇప్పటికే పలు పార్టీలకు చెందిన ఎంపీలు సంతకాలు కూడా చేయడంతో రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి.ఇలా ఉంటే టీడీపీతో సహా అన్ని పార్టీలు ఆదివారం విప్‌లను కూడా జారీ చేశాయి. ఏపీకీ ప్రత్యేక హోదా డిమాండ్‌ను నీరుగార్చేందుకు బీజేపీ తెలివిగా నితీష్ కుమార్‌ను మోదీ తెరపైకి తెచ్చి,అతనిచేత బీహార్‌కు హోదా ఇవ్వాలనే డిమాండ్‌ను తెరపైకి తీసుకువచ్చారు.కాగా చంద్రబాబు నితీష్‌తో కూడా ప్రత్యేకించి,మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. అయితే బీజేపీ వెంటే జయలలిత పార్టీ వెళుతుందంటున్నారు. ఎవరు ఎటుపోతారో ..ఎటు ఉంటారో సోమవారం తేటతెల్లమయ్యే అవకాశం ఉందంటున్నారు. వైసీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై పార్టీల సమీ కరణలు జరుగుతున్న నేపథ్యంలో రాజకీయ ఎత్తుగడతో తెలుగుదేశం పార్టీ ఎన్‌డీఏ నుంచి వైదొలడమేకాకుండా సరికొత్త రాజకీయ సమీక రణలకు తెరతీసింది. తొలుత వైసీపీ ప్రతిపాదించిన అవిశ్వాసానికి మద్దు తు ఇస్తామని ప్రకటించిన టీడీపీ తర్వాత ఆ వైఖరికి స్వస్తి చెప్పి,తానే అవిశ్వాస తీర్మానం పెడతామ ని ప్రకటించి,ఆ దిశగా చర్యలు ఉపక్ర మించింది.దీంతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు యావత్ దేశం ఉత్కంఠతతో ఎదురు చూస్తుంది.ఏ క్షణం ఏం జరుగుతుందోనని ఆతృతతో ఉంది. వైసీపీకి,టీడీపీకి చెక్ పెట్టేందుకు మరో వైపు బీజేపీ అన్ని శక్తులు కూడగట్టుకుని వ్యూహాత్మక ఎత్తులు వేస్తున్నది. ఇప్పటికే కొంత సక్సెస్ అయిందంటున్నారు. సోమవారం పార్లమెం ట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై కూడా సీఎం చంద్రబాబు పార్టీ ఎంపీలతో టెలీకాన్ఫ రెన్స్ ద్వారా స్పష్టం చేశారు.సోమవారం కేంద్రంపై అవిశ్వా సాన్ని టీడీపీ మిగతా పార్టీల మద్దతుతో ప్రతిపాదించేందుకు సిద్ధమవుతున్నది. సోమవారం లోక్‌సభలో ఏం జరగబోతు న్నదనే చర్చ ఊపందుకున్నది. పరిస్థితి ఓటింగ్ దాకావెళుతుందా లేదా ఒక వేళ అదే జరిగితే ఎవరు ఎటువైపన్నది ఆసక్తిగా మారింది. దీనిపై చర్చ చేపట్టేందుకు 50 ఎంపీల మద్దతు అవసరంకాగా, ఆ సంఖ్య ఎప్పుడో దాటిందంటు న్నారు. దీనిపై ఓటింగ్‌కూడా జరిగేలా పట్టుపట్టాలని కూడా ఎంపీలను చంద్రబాబు ఇప్పటికే ఆదేశించారు. అయితే అసలు అవిశ్వాసతీర్మాణంపై లోక్‌సభ స్పీకర్ చర్చకు అనుమతిస్తారా ?లేదా అన్నదే ప్రశ్న. ఈవిషయంలో బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. సభలో సవ్యమైన పరిస్దితులు లేవంటూ నోటీస్‌ను పరిగణలోకి తీసుకోకపో వచ్చనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. సభలో 196 నిబంధన ప్రకారం సభాపతి తనకు అందిన అవిశ్వాస నోటీస్‌ను సభలో విధిగా చదవాలి. తీర్మానానికి మద్దతిస్తున్నట్లు వారిని తమ స్దానాల్లోనే లేచి నిలబడాలని చెప్పాలి.కనీసం 50 మంది సభ్యులు లేచి మద్దతిస్తే ఆ అవిశ్వాస తీర్మానాన్ని అంగీకరించాల్సి ఉంటుంది. దానిపై 10 రోజుల్లోపు చర్చకు సమయం కేటయించాల్సి ఉంటుంది.ఓటింగ్ జరపాలి.అయితేఇక్కడే చిన్న మతలబు కూడా ఉందంటున్నారు. సభ సజావుగా జరుగుతున్నప్పుడే అవిశ్వాసానికి మద్దతుగా ఉన్న వారిని లేచి నిలబడమని అన్నప్పుడు మద్దతిచ్చే వారితో పాటు గొడవ చేసే వారు కూడా లేచి నిలబడి గందరగోళం సృష్టిస్తే ఎవరు దేనికోసం లేచారో తెలియదు.ఈ పరిస్థితిని కారణంగా చూపించి,నోటీస్‌నే పరిగణలోకి తీసుకోకుండా వదిలేయవచ్చనే అనుమనాలు కూడా ఉన్నాయి.శుక్రవారం సభలో అదే జరిగిందంటున్నారు. కేంద్రం ఏదో ఒక అంశాన్ని లేవనెత్తించి గందరగోళం సృష్టించేవ్యూహాన్ని కూడా అమలు చేయాలని చూస్తుందంటున్నారు. అయితే ఏం జరుగుతుందో ఎదురుచూడాలి. ఇలా ఉంటే మిగతా పార్టీల మద్దుతు కూడగట్టే పనిలో చంద్రబాబు బిజీబిజీగా ఉన్నారు.ఇప్పటికే మిగతా పార్టీలతో మాట్లాడారు. వివిధ పార్టీల నేతలను వ్యక్తిగతంగా కలిసి ,మద్దతు కూడగట్టే ప్రయత్నం చేయాలని పార్టీ ఎంపీలను ఆదేశించారు. ఈ బాధ్యతను ఆరుగురు ఎంపీలకు అప్పగించారు. కాగా, ఎవరెన్ని రాజకీయాలు చేసినా టీడీపీ ఫ్రంట్ ఏర్పాటు చేసి తీరుతుందని టీడీపీ అంటోంది.

యూపీ ఎన్నికలలో బీజేపీఓటమితో దేశ వ్యాప్తంగా రాజకీయ సమీకరణలు ఊపందుకున్న సంగతి తెలిసిందే. 20 ఏళ్లుగా రాజకీయ ప్రత్యర్ధులుగా ఉన్న ఎస్‌పీ,బీఎస్‌పీలు ఏకమయ్యాయి. ఎస్‌పీచీఫ్ అఖిలేష్ యాదవ్‌తోను, బిఎస్‌పీ,ఎస్‌పీ పార్టీల చీఫ్‌లతోను చంద్రబాబు మంతనాలు జరిపారంటున్నారు. మాయావతితో కూడా చంద్రబాబు చర్చించారంటున్నారు. ఎన్‌సీపీనేత శరద్‌పవర్ తోను ,అన్నాడీఎంకే ,డీఎంకే నేతలతో ను చంద్రబాబు చర్చలుజరిపారంటున్నారు.ఇంకో వైపు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ కూడా వ్యక్తిగతంగా మిగతా పార్టీల నేతలను కలుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. శరద్‌పవర్‌తో రాహుల్‌గాంధీ ముంబైలో సమావేశమై చర్చించారు..ఇక తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీతోను ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన మంత్రాంగం ఫలిస్తుందంటున్నారు. కాంగ్రెస్,ఏఐఏడిఎంకే ,సీపీఎం,బీజేడీ, తృణమూల్, టీఆర్ఎస్ , ఎన్సీపీ,ఆమ్ ఆద్మీ, ఎంఐఎం, సీపీఐ తదితర పార్టీల మద్దతు కూడగట్టేందుకు చంద్రబాబు శతవిధాలాశ్ర మిస్తున్నారు. ఇటు సమైక్ష పోరుకు యత్నాలు జరుగుతుం డగా మరో వైపు నరేంద్ర వ్యూహంతో రాజకీయాలు మరింతగావేడిక్కాయి.ఈనేపథ్యంలో తెలు గుదే శం వల్ల ప్రధానికి మరింత సవాల్ గా మారిందంటున్నారు. దీంతో నరేంద్రమోదీ శివసేనతో రాజీ మంతనాలు ప్రారంభించారంటున్నారు. కాగా అవిశ్వాసంపై సరైన సమయం లో సరైన నిర్ణయం తీసుకున్నామని , మూడు పార్టీల మహా కుట్రను బయటపెట్టామన్న చర్చ ప్రజల్లో జరుగుతుందని చంద్రబాబు తెలిపారు.టీడీపీ అవిశ్వాసానికి గతంలోనే అనేక పార్టీలు మద్దతు తెలపడం, జాతీయస్థా యిలో తమపై ఉన్న విశ్వసనీయతకు నిదర్శనమం టున్నా రు.వైసీపీని ఎవ రూ నమ్మడం లేదని చంద్రబాబు అంటుంటే వైసీపీమాత్రం టీడీపీ మాట మార్చి వ్యవహరిస్తుందని విమర్శిస్తున్నది.

'ఉప ఎన్నికలు రిఫరెండం కాదు'

లక్నో: బీజేపీ కేంద్ర, రాష్ట్రప్రభుత్వ విధానాలకు, కార్యక్రమా లకు ఉప ఎన్నికల ఫలితాలు రిఫరెండంగా పరిగణించలేమని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. ఉత్తరప్రదేశ్లో ఇటీవల జరిగిన గోరక్‌పూర్, పూల్పూర్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో అధికారక బీజేపీ కీలకమైన రెండు సిట్టింగ్ స్థానాలును కోల్పోవటం నిజమే అని, అయితే ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్నామన్నారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తామన్నారు. ఈ ఉప ఎన్నికల ఫలితాలను తాను రిఫరెండంగా పరిగణించటం లేదన్నారు. సమాజ్‌వాది పార్టీ, బహుజన్ సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ, బీఎస్పీ) కలిసికట్టుగా ఏర్పడినా బీజేపీ ఓటు బ్యాంక్‌ను ఏమీ చేయలేకపోయారన్నారు. ఎస్పీ-బీఎస్పీల మధ్య రాజకీయ ఒప్పందమే జరిగింది తప్ప కూటమిగా ఏర్పడలేదన్నారు. ఉత్తర ప్రదేశ్‌ను ఈ రెండు పార్టీలు చాలా నష్టపరిచాయన్న విషయం ప్రతి ఒక్కరికీ తెలుస న్నారు. ఉప ఎన్నికల సమయంలో ప్రత్యర్థి పార్టీలపై పరుష పదజాలం ఉపయో గించటంపై విలేఖరులు ప్రశ్నించగా తాను చేసిన ఆరోపణలన్నీ యథార్థాలే అన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నాను అన్నారు.



ఆసియాలో

తెలంగాణ కీర్తి పతాకం

- ఎత్తిపోతలలో మెగా పథకం
- 134 పంపులు.. 3650 మెగావాట్లు
- శరవేగంగా పాలమూరు- రంగారెడ్డి
- వచ్చే ఏడాది చివరినాటికి సిద్ధం

హైదరాబాద్,ఆంధప్రభ: సంకల్పం గొప్పదైతే అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చని టీఆర్ఎస్ సర్కారు నిరూపిస్తోంది. నీటిపారుదల రంగంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఆసియాఖండంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం చేపట్టి తెలంగాణ కీర్తిపతాకాన్ని రెపరెపలాడించేందుకు సిద్దమవుతోంది. ఒకెలిఫ్ట్ఇరిగేషన్ పథకంలో 134 భారీ పంపులు , వాటిని నడిపేందుకు 3650మెగావాట్ల విద్యుత్ వినియోగంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఆసియా ఖండంలోనే మెగా లిఫ్ట్ఇరిగేష్‌న్ పథకంగా చరిత్ర సృష్టించబోతోంది. దక్షిణ తెలంగాణ రాష్ట్రం కృష్ణాజలాలతో పరవశించే సమయం సమీపిస్తోంది. నాగరకర్నూల్, జోగులాంబగద్వాల, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ జిల్లాలల్లో 12లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్‌నగర ప్రజలకు తాగునీటిని అందించే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు శరవేగంగా జరుగుతున్నా యి. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఈ పథకం తొలిదశ సిద్ధం కానుంది. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి ఛైర్మన్ అధ్యక్షన మీడియా ప్రతినిదుల బృదం శుక్రవారం దక్షిణ తెలంగాణ జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టుల అధ్యయన యాత్ర నిర్వహించింది. రాష్ట్ర పంచాయతీరాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ఆద్యంతం ఈ అధ్యయన యాత్రలో పాల్గొని పాలమూరు-రంగారెడ్డి, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పనుల తీరు, వాటి పూర్తికి ఎంచుకున్న లక్ష్యాలను మీడియా బృందానికి వివరిస్తూ వచ్చారు. దారి వెంట అక్కడక్కడా తెలంగాణ రాష్ట్ర దాహార్తిని తీర్చే మిషన్ భగీరథ పథకం పనుల తీరును కూడా మీడియా బృందం పరిశీలిస్తూ వచ్చింది. ఎగువన కొండపైనుంచి చూస్తే ఎక్కడో పాతళంలో చెలిమెలా కనిపించే కృష్ణానదీజలాలను సుమారు మూడు వందల మీటర్ల ఎత్తుకు పంపుల ద్వారా ఎత్తిపోసి హైదరాబాద్ మహానగరం దాక చేర్చటం అంటే తొలుత చాలమంది నమ్మశక్యం కాదన్నారు. పాలమూరు ఇక ఎన్నటికీ పిడికెడు అన్నం కోసం అంగలార్చే మెతుకుసీమగా ఉండిపోవాల్సిం దేనా అన్న ఆవేదన ఈ ప్రాంత ప్రజల్లో దశాబ్దాల తరబ డి గూడుకట్టు కుంటూ వచ్చింది. నీళ్లు నిధులు నియా మకాలు అన్న నినాదంతో అధికారంలోకి వచ్చి న సీఎం కేసీఆర్ వచ్చిరాగానే ప్రాజెక్టు లపై దృష్టి పెట్టారు. ఈ మధనం నుంచే పాలమూరు-రం గారెడ్డి ఎత్తిపోతల బృహత్తర పథకం పుట్టుకొచ్చింది. శ్రీశైలం రిజర్వా యర్‌లో వెనుక జలాల ఆధారం గా 800 అడుగుల స్దాయి దాక నీటిని భారీ పంపులద్వారా ఎత్తిపో సుకుంటూ పంటపొలాలకు అందించేలా ఈ పథకం రూపొందిచారు. రోజుకు ఒకటి న్నర టీఎంసీల నీటిని 60 వరదరో జుల్లోకృష్ణానది నుంచి ఉపయోగించుకోనున్నారు.

5జిల్లాల్లో 12లక్షల ఎకరాలకు సాగునీరు

హైదరాబాద్ నగరంతో పాటు 1428గ్రామాలకు తాగునీరు, 5జిల్లాల్లో 12లక్షల ఎకరాలకు సాగునీరు ,దీంతోపాటు పారిశ్రామిక అవసరాలు కూడా తీర్చేలా రూపొందించిన ఈ పథకం ప్రాధమిక అంచనాలమేరకు రూ.35వేల కోట్లు వ్య యం కానుంది. కొల్లాపూర్ మండలం నార్లపూర్ గ్రామం వద్ద ఫస్ట్ లిఫ్ట్ ఏర్పాటు చేసి 106 మీటర్ల ఎత్తకు కృష్ణానది నీటిని ఎత్తిపోసే పనులు , 8.5 టీఎంసీల సామర్ధ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు వేగంగా నడుస్తున్నాయి.



మెగా పంప్‌హౌస్ నిర్మాణం

5వ ప్యాకేజి పరిధిలోని ఏదుల రిజర్వాయర్ వద్ద అండర్‌గ్రౌండ్ పంప్ హౌస్ నిర్మాణం అధునాతన సాంకేతిక రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది. కొండను తవ్వుకుం టూ సొరంగ మార్గం నిర్మించుకుంటూ భూగర్భంలో భారీగా నీటినిలువ కోసం సర్జిపూల్ నిర్మా ణం, భూగర్భంలోనే ఒక్కొక్కటీ 145 మెగావాట్ల విద్యుత్ సామ ర్ధ్యంతో కూడిన 9 భారీ మోటర్లతో ఏర్పాటు చేస్తున్న మెగా పంప్‌హౌస్ నిర్మాణం టీఆర్ఎస్ సర్కా రు ప్రతిభకు అద్దం పుడుతోంది. ఈ భారీ పంప్‌హౌస్ నిర్మాణ పనుల ప్రగతిని మంత్రి జూపల్లి కృష్ణా రావు , మీడీయా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణలకు ఎంఇఐఎల్ కంపెనీ జీఎం శ్రీనాధరెడ్డి వివరిం చారు. భారీ యంత్రాలతో కొండ ను తొలిచి సొరంగాలు ఏర్పాటు చేస్తున్న తీరును చూసి మంత్రి జూపల్లి సైతం ఆశ్చర్య పోయారు. 12నెలల్లో పంప్‌హౌస్ పనులు పూర్తయ్యే అవకాశం ఉన్నట్టు ఎస్ఇ వివరించారు. జంట టన్నల్స్ నిర్మాణ పనులు కూడా శరవే గంగా సాగుతున్నా యి. నార్లాపూ ర్ రిజర్వాయర్ ,శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను ఉపయోంచుకునే అప్రోచ్ కెనాల్ , టన్నల్ పనులు కూడా పురోగతిలో ఉన్నా యి. ఏదుల వీరాంజనేయ రిజర్వా యర్ , వెంకటాద్రి రిజర్వాయర్ , కరివెన రిజర్వాయర్ పనులతోపాటు వివిధ ప్యాకేజీల పరిధిలోని ప్రధాన కాలువల తవ్వ కాల పనులు కూడా లక్ష్యం మేరకు జరుగుతున్నట్టు అధికారలు వివరించారు.



ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీగవాక్షం

ధరణి ఘోష



భూమి నిశ్శబ్దంగా ఉంది
రెండుగా చీలిపోవడానికి సిద్ధంగా ఉంది.
పొగగొట్టాల కాలుష్యంతో
మసిబారిన ఆకాశం
ఆమ్లవర్షంతో కన్నీరు కారుస్తుంది.
ధనదాహంతో భూమిలోతుల్లోని
ఖనిజాలను, చమురును
మరో దేశానికి తరలించడం,
మన ఖజానాల్లో నింపుకోవడం
చూస్తున్న పుడమితల్లి గర్భశోకంతో రోదిస్తుంది.
ఇప్పుడు మరయంత్రాల శబ్దఘోషతో
భూమాత వెంటిలేటర్‌పై ఉంది.
పట్టెడన్నం పెట్టే పొలాల నిండా
పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు భూమిని
కేన్సర్‌లా కబళిస్తున్నాయి.
ఇకపై ఆగిపోయే గుండెల కోసం
గాలి నింపుకోడానికి
షాపుల ముందర బారులు తీరాలేమో!
ప్రకృతి వైపరీత్యాలు తెలియపరిచే
మూగజీవుల అరుపుల్లా
ఇథియోపియా మరణదృశ్యాలను
మనం వీక్షించబోతున్నామా!
బెర్ముడా ట్రయాంగిల్ లో
అంతమయ్యే వస్తువుల్లా
ధరణి దగ్ధమవుతుందా!
ఇది విశ్వానికి మాత్రమే తెలిసిన సృష్టి రహస్యం.
కాసుల కోసం కాలవేగంతో పయనిస్తూ
ఇది మనకు మనమే సృష్టించుకుంటున్న కాలప్రళయం.

- పి. సీతారామరాజు
9948849607

నిన్న..నేడు..నేను!



నిన్నటిలో నుంచి నేటికి కలల ప్రయాణం!
చెదిరే కలలతో కలతల ప్రణయం
అందుకే...నిన్న..నా కది నమ్మక ద్రోహి!
ఫలితం..నేడు..నా ఆశల సమాధి!
నిన్నని చూసి నేనెంతో మురిశా
నేడది వస్తుందని గొంతెత్తి పిలిచా
నిన్నటి మాదిరే అదే సూర్యుణ్ణి చూశా
మా మంచి సూర్యుడని ముచ్చట పడ్డా
నిన్నటి నిన్నే నేడు మళ్లీ వచ్చిందనుకున్నా
అదే సూరీడు..అదే వెలుగని సంబరపడ్డా
నిన్న అనుకున్నవి నేడు చేయాలనుకున్నా
కానీ మనస్సు లేక..రాక..ఆగిపోయా!
అరె..నిన్నటి నా ఆలోచన నేడు లేదు!
నిన్నటిది నేడు నాకే పాతబడిపోయింది!
ఈ సూరీడు నిన్నటి సూరీడు కాదనిపించింది
నేడొచ్చింది నిన్నటి నిన్న కాదని ఇట్టే తెలిసింది
నిన్నటిలాంటి నేడు తప్ప అచ్చమైన నిన్న కాదది
కళ్లకి కనిపించని..భౌతికం అనిపించని తేడా అది
మనసుని మాత్రమే తట్టి చెప్పే సూక్ష్మమది
నిన్న ఆసక్తి అనిపించింది నేడు నాకే నిరాసక్తమైంది
అప్పుడే తెలిసింది...నేనూ నిన్నటి నేను కాదని!
సూరీడు ఒకడే అయినా ఏరోజు వెలుగులు ఆరోజే
నేను నేనే అయినా ఏరోజు నేను ఆరోజే
ఆలోచనలు మారి...అనుభవాలు మిగులుతాయి
నిన్నటి కర్తవ్యాన్ని నిన్నటికే సరిపుచ్చాలి
నేడు దాని అనుభవాన్ని చవిచూడాలి
నాలో నాకిది కొత్త కనువిప్పు
కాల చక్రం పరుగుల్లో అవే సూర్యాస్తమయాలైనా
అవి ఒకటి కాదని తెలుసుకుంటే అదే కాలజ్ఞానం
నిన్నకు నేటికి మధ్య అలసత్వమే పెద్ద అంతరం
ఏ రోజుకారోజు ఆరోజులోనే బతికితే అదే జీవితం!

- వయ్యుస్సారెస్
9000013367

ఆలోచనల రసధుని నాయుని కృష్ణమూర్తి

"అంతా బాగానే ఉంది కాని ఇప్పుడు ప్రపంచంలో అందరి మెదళ్ళనూ మీడియా పురుగు కాటేసిందా? ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం ఎక్కడా కనిపించడం లేదెందుకు? ఎవరికీ భుజాలమీద తలలు ఉన్నట్లు లేదే? తలలకు బదులు టివిలు, సినిమా తెరలు, కంప్యూటర్లు కనిపిస్తున్నాయెందుకు? మనుషుల మధ్య దూరమింత పెరిగిపోయిందేమిటి? ఎదురెదురుగా నిలబడి మాట్లాడుతున్నా మధ్యలో మహాసముద్రాలు కనిపిస్తున్నాయే".



"మంచి మనిషి కాలేనివాడు మంచి రచయిత కాలేడు" అనే దానికి నాయుని కృష్ణమూర్తి ఉదాహరణ. రెండింటినీ మేళవించి ఉదాత్త చరితునిగా జీవించారు. కీర్తికి ఆమడ దూరంలో ఉండే నాయుని సందేశం ఇది.

"దేనికీ విచారించకు. దేనికీ ఆనందపడకు. ఆనందం, విచారం సమ్మిశ్రితాలు. ఒక క్షణం ఒకటి ముందుంటే మరొకటి మరోక్షణం ముందుంటుంది. రెండింటినీ ఆహ్వానిస్తూ వీలయితే కలుపుకొని కషాయం చేసుకొని తాగుతూ నడవండి. మీ ఆరోగ్య జీవనానికి అదే రక్ష"- అనేక తాత్త్వికుల సారాంశం ఇదే. కథకుడిగా, సృజనానువాదకుడిగా, పాత్రికేయుడిగా, నిఘంటుకర్తగా జీవించిన నాయుని కృష్ణమూర్తి ప్రముఖ విద్యావేత్త కూడా.

చిత్తూరు జిల్లాలో చౌడేపల్లి అనే చిన్నపల్లెలో ఉమ్మడి కుటుంబంలో పుట్టి ఉమ్మడి కుటుంబంలోనే జీవించి కాలధర్మం చెందారు. పురిపండా అప్పలస్వామి, ఉషశ్రీ. బేతవోలు రామబ్రహ్మం మొదలైన వారు వాల్మీకి రామాయణాన్ని తెలుగులో రాశారు. కృష్ణమూర్తిగారు కూడా వాడుకభాషలో అచ్చులో 400పుటలు రాశారు. అలాగే పోతన భాగవతాన్ని స్వేచ్ఛానువాదంతో తెనిగించారు. నాయుని వారి "కథలు". ఈ కోతి ఈ డ్రామాకు పనికొస్తుందా", "వియోగవిభావరి" ('ఏకాంకిలు)రాశారు. యామినీ కుంతలాలు, మనసు గుర్రమురోరి, మనిషే ప్రలోభం అనే నవలలు రాసి బహుమతులు పొందారు. "ఏం లేదు" అనేది మరో కథా సంపుటి. అసలు ఈ గ్రంథాల పేర్లే విభిన్నంగా, ఆలోచనాత్మకంగా లేవూ? వ్యాసుని "జయమ్" భారతమూల కథను నవలగా రాసి విశిష్టతను చాటుకున్నారు. నాయుని వారి అంతర్మథనం మనందరి దీనూ! ఈక్రింది మాటలతో ఏకీభవించని వారుంటాను అనుకోను. నేటి టెక్నాలజీ వరప్రసాదంతో పుట్టిన యువత కూడా నాయుని వారి మాటలు పట్టించుకుంటే ఈ సమాజం బాగుపడదా? ఏమిటా మాటలంటే-

"అంతా బాగానే ఉంది కాని ఇప్పుడు ప్రపంచంలో అందరి మెదళ్ళనూ మీడియా పురుగు కాటేసిందా? ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం ఎక్కడా కనిపించడం లేదెందుకు? ఎవరికీ భుజాలమీద తలలు ఉన్నట్లు లేదే? తలలకు బదులు టివిలు, సినిమా తెరలు, కంప్యూటర్లు కనిపిస్తున్నాయెందుకు? మనుషుల మధ్య దూరమింత పెరిగిపోయిందేమిటి? ఎదురెదురుగా నిలబడి మాట్లాడుతున్నా మధ్యలో మహాసముద్రాలు కనిపిస్తున్నాయే". ఆ మాటలు ఇవి. మానవ సంబంధాలను ఇవి ఎత్తిచూపాయి.

కురువంశం అంతరించకుండా ఆదుకొన్న వ్యాసుడు తన కళ్లముందే బిడ్డల బిడ్డల యుద్ధానికి తలపడటం చూసి సహించలేకపోయాడు. వ్యాసుడి మనసు క్షోభించింది. వంశ నాశనానికి దారితీసిన పరిస్థితులను వివరిస్తూ "జయమ్" పేరుతో కావ్యరూపం కల్పించాడు వ్యాసుడు. ఇది ఇంకా విస్తృతమే లక్షశ్లోకాలతో మహాభారతమైంది. 'జయమ్'ను యథాతథంగా రాయకుండా నవలా రూపంలో రాయటానికి కారణం కృష్ణమూర్తి గారి మాటల్లో..."కొంత స్వేచ్ఛ లభిస్తుందని. ఇలా జరిగి ఉంటుంది అని ఊహించి రాయడానికి అవకాశం ఉంటుందని. మహాభారత గౌరవాన్ని కాపాడుతూ రచనను కొనసాగించాను. మహాభారతం గురించి నాయుని వారు గొప్ప ప్రకటన చేశారు-

"మహాభారత కల్పితం అయితే, కల్పనా సాహితిలో
ఈ గ్రంథం సరసన నిలిచేది ఏదీ లేదు
వాస్తవం అయితే అంతా అద్భుతమే.
ఆ కాలంలోకి ఆ పాత్రలోకి చొచ్చుకు వెళ్లగలిగితే
అద్భుతం కానిదేదీ ఉండదు.

రామాయణ,భారత, భాగవతాలు రాసినంత మాత్రాన ఈయన 'సనాతనుడు' అనుకుంటే పొరబాటు.

"మాన్యుడా! సామాన్యుడా! ప్రజాస్వామ్య చరిత్రలో హీనుడా!
శక్తినీదే, చెమట నీదే, చెమటలో చిగురెత్తిన సిరులు నీవే
మధ్యలో వాడెవ్వడు? వీడెవ్వడు?
నీ చెమటను సెంటుగా వాడే వాడెవ్వడు?" (నాటికలో)

కృష్ణమూర్తి కథలు జీవిత వైచిత్రితో కొత్త పరిచయం చేస్తాయి. "ఏం లేదు" అంటూనే జీవిత వైవిధ్యాలూ, వైరుధ్యాలు ఎన్నో ఉన్నాయని కథలు రాశారు. కఠిన సత్యాలకు కల్పనలద్ది జీవిత సత్యాలకు ఊపిరినిచ్చారు.

ఇదంతా ఒక ఎత్తు. తెలుగు భాషపై రాబోయే తరంపై గల అమితమైన మక్కువ ఒక ఎత్తు. వి.ఎన్.ఆర్.బుక్ వరల్డ్ పేరుతో మూడు నిఘంటువులు రూపొందించారు. అవి-
తెలుగు-ఇంగ్లీషు (బొమ్మల నిఘంటువు)
తెలుగు-ఇంగ్లీషు (సచిత్రి నిఘంటువు)
తెలుగు-ఇంగ్లీషు (విద్యార్థిని నిఘంటువు)

ఇవి పిల్లలకోసం అనుకుంటాంగానీ నేటి పెద్దలకీ ఉపకరిస్తాయి. "మాబడి", "పాఠశాల" పత్రికలు ప్రతి విద్యార్థి చేతినీ అలంకరిస్తూ వచ్చాయి. "తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచి ఏ భాషనైతే బిడ్డ వింటోందో ఆ భాషామాధ్యమంలో చదువు మొదలైతే ఏ ఇబ్బందీ లేదు" అన్న కృష్ణమూర్తిగారి మాటలు పాలకుల చెవులు వింటాయా? ఒక అసలైన నిరాడంబర జీవినీ, తాత్త్వికుడ్నీ సాహితీలోకం పోగొట్టుకుంది.

- ద్వా. నా. శాస్త్రి
9849293376

కొత్తచూపున్న "స్వేచ్ఛ"కవిత్వం

"సమసమాజపు బడికిపోయిన బిడ్డలు/ ఇంటికొస్తున్నారు/ బిడ్డని తల్లి గుర్తుపట్టి తెచ్చుకోవాలి/ఒక బిడ్డకి రొమ్ములు కోసి వున్నాయి/ఇంకొకరికి కళ్లు పీకేసి వున్నాయి/కాళ్ళు చేతులు/ ఆఖరికి జననాంగాలు/ఒంట్లో ఉన్న అవయవాలన్నీ/ ఛిద్రమైపోయి నాయి/ఓ యమ్మ ఎట్లా గుర్తుపడతావే"అని చదువుతున్నప్పుడు కళ్లు చెమర్చని పాఠకుడు బహుశా అరుదేమో! కొనసాగింపుగా ఇంకా ఇలా అంటారు **"బిగించిన పిడికిలొక్కటే గుర్తు/బిడ్డల ఆశయపుదారెంట/ గొంతు తెగినా పాట ఆగదు/ దేహం గాయాల జల్లెడయినా/ఎరుపుకి మెరుపు తగ్గదు"** అంటూ కవితను ముగిస్తారు. ఈ కవిత చదివి ఎవరైనా కొంత ఒత్తిడికి లోనవ్వాల్సిందే. ఇది ఏ విప్లవ కవి రాసిన కవిత్వమో అనుకుంటే పొరపాటే. ఇంత గొప్పగా కవిత్వం రాయాలంటే ఎంత జీవితాన్ని కాచివడబోసి వుండాలో కదా! ఎంత సాంద్రమైన కవిత్వం చదివి వుండాలో కదా! కానీ ఈ కవిత "స్వేచ్ఛ" స్వేచ్ఛగా రాసినది.

స్వేచ్ఛ క్రమంగా తన పరిధుల్ని ఛేదించుకుంటూ అనంత వైశాల్యాన్నీ, లోతుల్నీ, జీవన తాత్వికతని సంతరించుకుంటు తన తొలి కవితా సంపుటి "మట్టిపూల గాలి" సాహితీలోకం ముందుంచారు. ఈ కవితా సంపుటి చదువుతుంటే ఇటీవల నాకు ఎదురైన సంఘటన ఒకటి ఉదహరించటం అవసరం అనిపించింది. ఈ మధ్య విడుదలైన అఫ్సర్ కవిత్వం 'ఇంటివైపు' చదివారా అని ఒక సాహితీ మిత్రుడ్ని అడిగాను. అఫ్సరా? ఆయనెవరు? అని జవాబు. ఆ మిత్రుడు ఇప్పటిదాకా మూడు కవితా సంపుటాలు వేశారట. తమాషాకు అంటున్నారేమో అనుకున్నాను. కాదు, నిజమేనట. తను ఎవరి రచనలు చదవడట. ఎందుకు చెబుతున్నానంటే అధ్యయనం లేని రచన అలంకారప్రాయమే అని చెప్పటానికే అధ్యయనం ఉంటేనే కళాత్మకంగా ఒక వాక్యాన్ని పదిమందీ మెచ్చుకునేలా రాయగలం అనేది నిర్వివాదాంశం.అధ్యయనమూ, అనుభవము రెండూ కలిసి స్వేచ్ఛను కవిత్వ బాట పట్టించాయనవచ్చు. ఉర్దు గజల్ రచనకు ప్రేరకుడైన కవిబ్రహ్మ "వల్లి" ఇలా అంటాడు **"రాత్రి దాక్కున్నది/ ఉదయకాంతి వ్యాపించింది/ లోకులు దైవప్రార్థన చేస్తున్నారు/ ఊదారంగు ఆకాశంలో సూర్యుడు/నీటిలో కమలంలో ఉన్నాడు"** అంటారు ఒక గజల్‌లో. సూర్యాస్తమయాల్ని గొప్పగా కవిత్వీకరించిన ఎందరో కవులు మనకు తెలుసు. అవన్నీ ఒక ఎత్తయితే ఎంతో ప్రతిభావంతంగా ఈ కవయిత్రి ఉదయాస్తమయాల్ని "ద్విపాత్ర" కవితలో ఇలా చెపుతారు. **"ఓ వేకువ/బొడ్డుతాడు తెంచుకుంది/మట్టిని తాకితే/అమ్మ వాసనేస్తుంది"** స్వేచ్ఛ, వస్తువును దర్శించిన తీరు, ఎన్నుకున్న కోణం కవితను తీర్చిదిద్దిన తీరు అబ్బురపరుస్తుంది.



'మట్టిపూలగాలి' కవిత్వ సంపుటిలోని కవిత్వం మొదటిసారి చదువుతున్నప్పుడు ఒకరకమైన గాఢ అనుభూతి, రెండవసారి చదువుతుంటే ఆశ్చర్యం, అద్భుతం అనిపించింది. తను సృష్టించిన పదచిత్రాలు చూడండి. "గాలిపూల తోటలు, రంగులేని రక్తపు జలపాతాలు, కనురెప్పల స్నానపు నాట్యం, రక్తపు ముసురు వాసన" ఇలా ఎన్నెన్నో అవసరమైన చోట ప్రతీకలతో కవిత్వం పండించి, భావ తీవ్రతతో పారవశ్యస్థితిలో పండించిన కవిత్వం "మట్టిపూల గాలి". తనదైన కవిత్వ భాషలో అమ్మతనపు కవిత్వ చెమ్మను పంచి, గొప్ప తాత్విక కోణంలోంచి రాసిన కవితలు "ఒంటరి దుఃఖం, మరణంకోసం" కవితలో గొప్ప అనుభూతి వాదంతో కూడిన చైతన్య కవిత్వం ఇందులో ఉంది. ఈ సంపుటిలో ఉన్న అన్ని కవితలూ ఒకే స్థాయిలో వున్నాయని అనలేం గానీ, చాలా కవితల్లో కవయిత్రి అనూహ్యమైన పరిపక్వత ప్రదర్శించిందని చెప్పవచ్చు. అనుభవించి, పలవరించి, ఆనందించి, వెలువరించిన "మట్టిపూలగాలి" కవిత్వ సంపుటి ని అందించిన రచయిత్రి "స్వేచ్ఛ"కు అభినందనలు.

పేజీలు-104, వెల. రూ.65/- ప్రతులకు: సహచర బుక్‌మార్క్, సుందరయ్య పార్కు వద్ద, బాగ్‌లింగం పల్లి, హైదరాబాద్-500044.
ఫోన్. నెం. 9848348173

- కొమ్మవరపు
8985435515

అనంత దుఃఖపు కవిత్వం



సమాజంలోని అనేకానేక దుఃఖసందర్భాలను నేడు మనిషి ఎదుర్కొంటున్నాడు. ఇది ఒక ప్రాంతానికో లేక ఒకదేశానికో పరిమితం కాదు. అనేక సమస్యలు, విధ్వంసపు సంఘటనలు నేడు ప్రపంచాన్ని కలవరపెడుతున్నాయి. నేడు కవుల కవిత్వంలో ఇలాంటివన్నీ ఇమిడిపోయి కనిపిస్తున్నాయి. బాధ్యతతో, కనీసధర్మంగా కవులు తమ కలం గళాలను విప్పి మానవీయతను తట్టి లేపుతూ కవిత్వీకరిస్తున్నారు. అలాంటి కవుల్లో కెరె జగదీష్ ముందు వరసలో ఉన్నారు. నేల నెర్రలు విచ్చి, నీటిఛాయలకై అలమటిస్తున్న కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాకు చెందిన కవి కెరె జగదీష్. ఈ ప్రాంతం నీటికి కరువేమో గాని కవిత్వానికి ఎంతమాత్రం కాదు. ఇక్కడి కవులను కదిలిస్తే కవిత్వం కన్నీటి వరదలవుతుంది. దుఃఖం కట్టలు తెంచుకొని, ఆగ్రహంగా మారి అక్షరాలు ఆయుధాలుగా మారతాయి.

కెరె జగదీష్ మాతృభాష కన్నడమైనా అతను తెలుగు కవిత్వంలో తనదైన ఒక ముద్రతో మొదట "సముద్రమంత గాయంతో మనముందు ప్రత్యక్షమై "రాత్రి సూర్యుడు"తో తనేమిటో నిరూపించుకొని ఇప్పుడు "రాతి నిశ్శబ్దం"తో ఒక వేదనా భరిత దృశ్యాలను ఆవిష్కరించాడు. "రాతి నిశ్శబ్దం" కవితా సంపుటిలో అరవై ఒక్క కవితా ఖండికలున్నాయి. ఈ కవితల్లో స్త్రీల వేదనలు, పసిపిల్లల మరణాలు, రైతు సమస్యలు,భ్రూణ హత్యకు గురౌతున్న ఆడపిల్ల వేదన ఇలా అనేకమైన దుఃఖ సమయాలను తన గుండె కెత్తుకొని కవిత్వంగా మనముందుంచారు.

"మట్టిలో తాకట్టు పెట్టిన బతుకు/ అడకత్తెరలో పోకచెక్కయ్యింది/ కాలం అంచున నడుస్తూ/ ఆశల విత్తనాల్ని చల్లిన నాలోని/మట్టితనం..కన్నీటి సేద్యం చేస్తుంది" అంటూ రైతు వేదనను మన ముందు ఆవిష్కరిస్తారు. రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యమైన పరిస్థితులను మనకళ్ళకు కడతారు జగదీష్. ఇదే కవితలో **మట్టిపొరలు ఇరుకు దారిలో/ భుజంపై భారమైన నాగలితో/శిలువమోస్తున్న ఏసులా/ ఆకలి దేహంతో దుఃఖిస్తూ/రైతన్న అడుగులు** అని ఒక దుఃఖపూరిత దృశ్యాన్ని మనకు చూపుతారు. ఇది ఒక యదార్థ,వ్యథార్థ దృశ్యం. **సీమకరవు యాత్రలో/ పొగిలి పొగిలి దుఃఖిస్తున్న జీవిత చిత్రం/ పొరలు పొరలుగా పెచ్చులూడుతున్నాయి/ఇక్కడి బతుకుల్ని/ సజీవ చిత్రాలు మార్చే/ చిత్రకారుడేడీ?** అంటూ వేదనగా పలుకుతాడీ కవి. రాయలసీమ అనగానే ముందుగా గుర్తు వచ్చేవి రైతుల వెతలే. వీటిని దృశ్యమానం చేయకుండా ఇక్కడి కవులుండరు. సమాజం నుండి, సమాజపు వెతల నుండి కదా! కవిత్వం ఉద్భవించేది. మరి కవిగా జగదీష్ కూడా వాటి నుండి కవితలల్లుతున్నాడు. ఇవి కాలక్షేపపు కవిత్వం కాదు. ఆయన సీరియస్‌గా కవిత్వం రాశాడు. అలాగే ప్రతి ఒక్కరూ సీరియస్‌గా ఆలోచించాలి. ఒక మార్పుకై ప్రయత్నించాల్సిన అవసరమూ వుంది.

"అమ్మా...ఎందుకిలా చేశారు?/నేను ఆడపిల్లననేగా/ఇంత ఘాతుకానికి ఒడిగట్టారు...!/నీ ప్రేమ పొరల్లో/ మొలకగా ఊపిరి పోసుకున్న/ నన్ను/ చిదిమి వేయడానికి మనసెలా వచ్చిందమ్మా?" అంటూ ఒక ప్రశ్న నేటి సభ్య సమాజానికి సంధిస్తుందో పుట్టని ఆడపిల్ల. ఈ కవికి మనసు అడుగడుగునా వేల ప్రశ్నల్ని సంధిస్తుంది. సమాజం ఇలా ఎందుకుందని అమిత వేదన చెందుతాడు. అసలు మనిషి జీవితమేమిటని ఆలోచిస్తాడు. నిశ్చింతగా ఉండలేని స్థితికి చేరుకుంటాడు. మానవత్వం కనిపించని కాలాన్ని చూస్తూ సలపరింతలు పెడుతున్న గుండె గాయాలను తడుముకుంటాడు.

"నా గుండెలో దిగుతూనే వున్నాయి. ప్రశ్నలు/ శూలాలై గుండె గోడలను గాయపరుస్తూ/పగిలిన అద్దంలా/ముక్కలై ఫెళ్ళున తగులుతున్నాయి/ సమాధానంగా, ప్రశ్నల పేలుళ్ళలో/శవాలు తెగిపడుతూ/ విషాద ఛాయలు అలుముకున్నాయి. వుబ్బులుగా/గాయాల నుండి, వేదనల నుండి/ కన్నీళ్ళ నుండి, నిశ్శబ్ద శబ్దం నుండి/ మానవత్వాన్ని అనిశ్చితి కబళించింది" అంటాడు.

మనకెందుకులే అని తప్పుకుపోయే వారికి ఇవన్నీ అవసరముండదు. కానీ ఈ కవికి ప్రపంచపు దుఃఖాన్ని తనదిగా చేసుకొని విలపించడం అలవాటు అయ్యింది. అదే ఆయన్ను కవిని చేసిందేమో! లేకపోతే ఈ కవిత్వం ఎందుకొస్తుంది. ఇతను తన ఆలోచనా పరిధిని విస్తరించుకుంటూ, ప్రతిసందర్భాన్ని కవిత్వంగా మలుస్తూ కదిలిపోతున్నాడు.

2013లో హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్లను, అనంతపురం కరువును, గోవాబీచ్‌లో యువత విచ్చలవిడితనాన్ని, నేపాల్ భూకంపాన్ని, 2015లో చైనాలోని ఒక వృద్ధాశ్రమంలోని చెలరేగిన మంటల్లో మరణించిన 38 గురించి, పాకిస్తాన్‌లోని పేషావర్ సైనిక పాఠశాలలో మిలిటెంట్ల కాల్పుల గురించి ఇలా ప్రపంచ వ్యాప్తంగా జరిగే సంఘటనలు, కెరె జగదీష్‌ను కవిత్వం రాసేలా ప్రేరేపిస్తుంటాయి. అందుకే ఆయనో ప్రత్యేకత కలిగిన కవిగా మన ముందున్నారు. ఇన్ని ఆలోచించే కవికి కొంత తాత్త్వికత అబ్బడం సహజమే కదా! అందువల్లనే ఆయన కవిత్వంలో అక్కడక్కడ అది కనిపిస్తుంది. జీవిత గమ్యంలో అనుభవాల సారం నుండి ఆయనకు తాత్త్వికత అలవడి ఉంటుంది. **"మొదటి పేజీలో/ వసంతాన్ని పూసుకున్న...జీవిత పుస్తకం/చివరి పేజీలో/వసంతాన్ని రాల్చుకోవడం కాల ధర్మమే!"** అంటారొక కవితలో అలాగే మరో కవితలో **నేనెలా వచ్చానో నాకే తెలియదు/నీకేమని చెప్పేది/ ఆ రహస్యం తెలుసుకునేందుకే/నా ఆరాటం** అంటారు. తనను తాను ప్రశ్నించుకునే దశ దాకా ఈ కవి చేరుకున్నాడని అనిపిస్తుంది. ఇది తాత్త్వికతాకోణంలో ఉన్నతమైనది. ఏది అవసరమైనదో, ఏది కాదో ఈ కవి గ్రహింపుకొచ్చినట్లు చెప్పవచ్చు.

"ఈ జీవన ప్రస్థానంలో/తనలో తాను అంతర్లీనమైనప్పుడే/విశ్వమంతా/మానవత్వం ఆవిష్కృతమౌతుంది" అంటూ విశ్వమానవ ప్రేమికుడిగా ఈ కవి దర్శనమిస్తాడు. ఏదిఏమైనా ఒక మంచి కవితా సంపుటిని అందించినందుకు కెరె జగదీష్‌ను అభినందించాల్సిందే.

పేజీలు-154, వెల-120రూపాయలు, ప్రతులకు- కెరె జగదీష్, 9-3-383 (4) రాజీవ్ గాంధీ కాలనీ, రాయదుర్గం-515865, అనంతపురం జిల్లా.
సెల్. నెం. 9440708133.

- నియోగి
9553097319

సాహిత్య వార్తలు

21న యానాంలో "ప్రపంచ కవితా దినోత్సవం"

కవిసంధ్య, డా॥ఎస్. ఆర్.కె. ఆర్ట్స్ కళాశాల సంయుక్త నిర్వహణలో మార్చి 21న యానాంలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రపంచ కవుల చిత్రపటాలు, చేతి రాతల ప్రదర్శన, ఆధునిక కవిత్వంపై జాతీయ సదస్సు, కావ్యసంపుటాల ఆవిష్కరణ, కవిసంధ్య- పానుగంటి కవితల పోటీలలో బహుమతి ప్రదానం, యువకవి సమ్మేళనాలు వుంటాయి. ఈ కార్యక్రమములో మల్లాది కృష్ణారావు, ప్రిన్సిపాల్ జయరాజ్ డానియల్, వాడ్రేవు సుందర్రావు, ఖాదర్ మొహియుద్దీన్, జి.లక్ష్మీ నరసయ్య, రామతీర్థ ప్రసాదమూర్తి, యాకూబ్, మువ్వా శ్రీనివాసరావు, మధునా పంతుల, దాట్ల దేవదానం రాజు, వాడ్రేవు వీరలక్ష్మి తదితరులు పాల్గొంటారు.

తెలుగు శాఖ, డా॥ఎస్.ఆర్.కె. ప్రభుత్వ ఆర్ట్‌కళాశాలకవిసంధ్య, యానాం

స్ఫూర్తి పురస్కారాలు

ద్వానాశాస్త్రి సప్తతిపూర్తి సందర్భంగా "సాహిత్య విమర్శ" గ్రంథాలకు స్ఫూర్తి పురస్కారాలు జూన్ 15న హైదరాబాద్‌లో ఇవ్వబడతాయి. విమర్శ గ్రంథాలు ఏ ప్రక్రియకు చెందినవైనా కనీసం 200పుటలు ఉండాలి. 2016, 2017, 2018 లలో ముద్రితమై వుండాలి. మొదటి బహుమతి పదివేల రూపాయలు, రెండవ బహుమతి అయిదు వేల రూపాయలు ఇవ్వబడును. ఒక్కొక్కటి రెండు ప్రతుల చొప్పున డి.శశికాంత్,1-1-428 ఆర్బీ జోనెస్ట్, గాంధీనగర్, హైదరాబాద్-500080. చిరునామాకి పంపాలి.

- రఘురామ్
కిన్నెర ఆర్ట్‌థియేటర్స్

రచనలకు ఆహ్వానం

సాహితీగవాక్షం పేజీకి సమకాలీన సాహిత్యంపై మీ అభిప్రాయాలను, రచనలను ఆహ్వానిస్తున్నాం. మీ రచనలుsahithigavaksham@gmail. com పంపగలరు.

చిరునామా: ఎడిటర్, ఆంధ్రప్రభ, సాహితీ గవాక్షం పేజీ, రోడ్ నెం. 9, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, హైదరాబాద్-500033

దేవుడి చిరునామా



మిత్రమా!
దేవుడి చిరునామా కొరకు
కొండల్లో-కోనల్లో
గుడుల్లో -గోపురాల్లో
వెతుక్కోనక్కరల్లేదు
వొంటరిగా వున్నప్పుడు
నీ ఆత్మని ప్రశ్నించు
నీ మనవరాలి పెదాల పైని
అకలంక చిరునవ్వు నడుగు
నీ యింటి ముందున్న
ఆరోగ్య నిలయం
ఆ వేపచెట్టు నడుగు
విందు భోజనాలయాక
చెత్తకుప్పలో విసిరేసిన
విస్తర్లోని మెతుకులనడుగు
కండరాల్లోంచి జారుతున్న
శ్రమామృత బిందువుల్నడుగు
ఎక్కడా కుదరకపోతే
నీ పాదం కింది పిడికెడు మట్టినడుగు

- ఈతకోట సుబ్బారావు
8008562742

సంక్షేమం ఉరకలు

• అభివృద్ధితో సమానంగా కార్యాచరణ అమలు • అందుబాటులో రూ.33,605 కోట్లు నిధులు • రూ.50వేల కోట్ల వరకు ఖర్చు చేసే అవకాశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్షేమాన్ని పరుగులు పెట్టించాలని ప్రభుత్వం సంకల్పించింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి అభివృద్ధి పై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించడంతో సంక్షేమం సక్రమంగా అమలు కాలేదని గుర్తించింది. సంక్షేమానికి కేటాయించిన నిధులు ఖర్చు కాకపోవడమే అందుకు ఉదాహరణగా పేర్కొంటుంది. రాబోవు కాలంలో ఇంటింటికి సంక్షేమ ఫలాలు అందే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. అవసరమైన పక్షంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షించే విధంగా చర్యలు తీసుకోబోతుంది. శాసనసభ సమావేశాలు ముగిసిన వెంటనే సంక్షేమ పథకాల అమలుపైన ముఖ్యమంత్రి కెసిఆర్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్ష జరిగే అవకాశం ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమంతో పాటుగా వృత్తిదారులను అన్ని విధాలుగా ఆదుకొనేందుకు నిర్దిష్ట ప్రణాళిక అమలుకు చర్యలను ఖరారు చేయబోతున్నారు. వృత్తిదారులకు పనిముట్లు ఇవ్వాలనే ఆలోచనను పూర్తి స్థాయిలో అమలు పర్చడంతో పాటుగా దళితులకు మూడెకరాల భూ పంపిణీ కార్యక్రమాన్ని మరింత వేగంగా అమలు జరపాలని భావిస్తున్నారు. 2019లో సార్వత్రిక ఎన్నికలు జరిగే నాటికి తెలంగాణలోని ప్రతి అర్హత గలిగిన కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్దిపొందడం ప్రభుత్వ లక్ష్యం అని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఎస్సీ, ఎస్టీ మైనారిటీల సంక్షేమానికి భారీ ఎత్తున నిధులు సమకూర్చినప్పటికీ అధికారులు ఖర్చు చేయలేని పరిస్థితిని సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని ఆ వర్గాలు వెల్లడించాయి. కల్యాణలక్ష్మి షాదీముబారక్ పథకాల కింద ఇచ్చే నగదు లబ్దిని లక్ష రూపాయలకు పెంచడం, అర్హులైన పేదలందరికీ రెండు పడక గదుల ఇండ్లు నిర్మించి ఇవ్వడం, పౌరసరఫరాల ద్వారా పంపిణీ చేసే నిత్యావసరాల సంఖ్యను పెంచడం, వృత్తిదారులకు పనిముట్లు పంపిణీ చేయడం, స్వయం ఉపాధి కింద సబ్సీడీలతో కూడిన రుణాలను పెద్ద ఎత్తున ఇప్పించడం తదితర కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టబోతున్నారు. గిరిజన గూడాలు తండాలు గ్రామ పంచాయతీలుగా మారబోతున్నందున జనాభా ఆధారంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో వేగం పెంచాలని భావించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే సంక్షేమానికి 2018 -19 ఆర్థిక సంవత్సరంలో రూ. 4,454.37 కోట్లు అదనంగా ఖర్చు చేయాలని సంకల్పించారు. 2017 - 18లో మిగిలిపోయిన ఎస్సీ ఎస్టీ నిధులను కూడా ఈ సంవత్సరం ఖర్చు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ సంవత్సరం రూ. 33 వేల కోట్లు కేటాయించినప్పటికీ రూ. 50 వేల కోట్ల వరకు ఖర్చు చేసే అవకాశం ఉంది. బీసీ సంక్షేమానికి గత సంవత్సరం రూ. 5070.36 కోట్లు కేటాయించగా ఈ సంవత్సరం రూ. 849.47 కోట్లు పెంచి రూ. 5919.83 కోట్లు కేటాయించారు. అత్యంత వెనుకబడిన తరగతులను ఆదుకొనేందుకు ఈ నిధులతో అనేక కార్యక్రమాలు చేపట్టబోతున్నారు. ఎస్సీ సంక్షేమానికి గత సంవత్సరం రూ. 14,375.12 కోట్లు కేటాయించగా ఈ సంవత్సరం 2077.67 కోట్లు పెంచి 16,452.79 కోట్లు కేటాయించారు.

జిల్లా వారిగా సరికొత్త ప్రణాళికలు

ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం ఏర్పడబోతున్నందున ప్రతి ఆవాసంలో సంక్షేమం కళ్లకు కట్టినట్టు కనిపించాలని ముఖ్యమంత్రి జారీ చేసిన ఆదేశాల మేరకు సంక్షేమ అధికారులు జిల్లాల వారిగా సరికొత్త ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ప్రచారం కూడా భారీగానే ఉంటుందని పేర్కొన్నారు. సంక్షేమానికి కేంద్ర నిధులు కూడా తోడవుతున్నందున ఇంటింటికి సంక్షేమం చేర్చడం లక్ష్యంగా చర్యలు తీసుకోబోతున్నామని అధికారులు తెలిపారు. కుల వృత్తుల వారిపైన ప్రభుత్వం ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. అన్ని కుల వృత్తులకు పనిముట్లు పంపిణీ చేయాలని సంకల్పించింది. పనిముట్ల పంపిణీ కోసం అవసరమైన పక్షంలో రూ. 1000 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమైంది. ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ సారథ్యంలో ఏర్పాటు చేయబడిన కమిటీ ఇప్పటికే పలు సిఫార్సులు చేసిందని వాటిని అమలు పర్చడానికి కార్యాచరణ రూపొందించబోతున్నామని అధికారులు తెలిపారు. దళితులకు మూడెకరాలు భూ పంపిణీకి నిధులు అందుబాటులో ఉన్నందున పెరిగిన భూముల ధరలపై ప్రభుత్వం నుండి స్పష్టత తీసుకొనవలసి ఉంటుందన్నారు. ఎన్నికల నాటికి బంగారు తెలంగాణ స్ఫూర్తికి అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరువ చేసే విధంగా కార్యాచరణపై ముఖ్యమంత్రి సమాలోచనలు చేస్తున్నట్టు తెలిసింది.



కల్యాణలక్ష్మి నగదు సహాయం పెంపు

• నేడో రేపో అధికారిక ప్రకటన
• నిబంధనలు మరింత సరళతరం
• కుటుంబ వార్షికాదాయమే ప్రామాణికం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల సహాయాన్ని రూ. 1,01,116లకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. పథకం అమలుకు వార్షిక బడ్జెట్‌లో రూ. 1450.48 కోట్లు కేటాయించింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద ఇప్పటి వరకు లబ్దిదారుల సంఖ్య 2,92,465కు చేరింది. పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 1642.02 కోట్లు ఖర్చు చేసింది. పథకం పట్ల పేద కుటుంబాలు అత్యధికంగా ఆకర్షితం కావడంలో నగదు మొత్తాన్ని పెంచి, సకాలంలో సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2014 అక్టోబర్ నుండి ఈ పథకం అమలవుతుంది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింత తొలుత రూ. 51,116లు చెల్లించారు. పెళ్లి ఖర్చులకు ఈ మొత్తం ఏ మాత్రం సరిపోవడం లేదని ప్రజా ప్రతినిధులు చేసిన విజ్ఞప్తి మేరకు ఆర్థిక సహాయం మొత్తాన్ని రూ. 75,116లుగా ముఖ్యమంత్రి ప్రకటించారు. పథకం పట్ల అత్యధికులు ఆకర్షితులు కావడం, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని భావించడంతో 2018 -19 ఆర్థిక సంవత్సరం నుండి నగదు మొత్తాన్ని రూ. 1,01,116లుగా ప్రకటించి అమలు జరపాలని ముఖ్యమంత్రి నిర్ణయించుకున్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద అందచేసే ఆర్థిక సహాయాన్ని పెంచబోతున్నామని శాసనసభలో ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ అంశంపైన ప్రభుత్వం ఒకటి రెండు రోజుల్లోనే శాసనసభలో అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ వర్గాల్లోని పేదలకు ఈ పథకం వర్తింప చేస్తున్నారు. గ్రామాల్లో కుటుంబ వార్షికాదాయం రూ. 1.50 లక్షలు, పట్టణాల్లో రూ. 2 లక్షల వార్షికాదాయాన్ని ప్రామాణికంగా తీసుకొని 18 సంవత్సరాలు నిండిన తర్వాత జరిగే వివాహలకు ఈ పథకాన్ని వర్తింపచేస్తున్నారు. పెళ్లికి ముందుగాని, పెళ్లి రోజుగాని నగదు సహాయాన్ని చెక్ రూపంలో అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద సహాయం కోరుతూ ప్రభుత్వానికి అందే దరఖాస్తుల పరిశీలనను సులభతరం చేయబోతున్నారు. దరఖాస్తుదారుల ఆర్థిక పరిస్థితిని పరిశీలించడానికి వస్తున్న అధికారులు కొర్రీలు వేయకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. చిన్న చిన్న కారణాలతో దరఖాస్తులను తిరస్కరించే పరిస్థితిని అధిగమించడం జరుగుతుందని శాసనసభకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. కుటుంబ వార్షికాదాయం ప్రామాణికంగా తీసుకొని దరఖాస్తులను పరిశీలించే విధంగా మార్గదర్శకాలు జారీ చేయబోతుంది. బాలిక వయస్సుకు సంబంధించి కూడా మార్గదర్శకాలు ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. అర్హులైన పేదలకు పథకం వర్తింపచేయడంలో సమస్యలు ఉత్పన్నం కాని విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

టీఎస్ఎల్‌పీ ఆర్‌బీ ఛైర్మన్‌గా వి.వి. శ్రీనివాసరావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉగాది పర్వదినం రోజున తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ ఎల్‌పీఆర్‌బీ) ఛైర్మన్‌గా వి.వి. శ్రీనివాసరావు రాష్ట్ర పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు మునుపు హైదరాబాద్ నగర ఇంఛార్జి పోలీసు కమిషనర్‌గా వి.వి. శ్రీనివాసరావు పనిచేశారు.


బడ్జెట్‌లో మైనారిటీలకు పెద్దపీట

• ముస్లింలకు సర్కార్ భరోసా

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర జనాభాలో దాదాపు 15 శాతానికి పైగా ఉన్న ముస్లిం ఇతర మైనారిటీలకు బడ్జెట్లో ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ఈ వర్గాలకు చెందిన నేతలు ఊహించని విధంగా బడ్జెట్‌లో పెద్దపీట వేసి ప్రశంసలు అందుకుంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మైనారిటీ సంక్షేమ శాఖకు ఏకంగా రూ.2,000 కోట్లు ప్రభుత్వం ప్రతిపాదించింది. 2017 -18 లో రూ. 1,249.66 కోట్లు కేటాయించగా,ఈ సంవత్సరం ఏకంగా రూ.751.66 కోట్లు అధికంగా కేటాయించడం విశేషం. ముస్లిం, క్రిస్టియన్, భౌద్ధ, జైన మతాలకు చెందిన వారు రాష్ట్రంలో మైనారిటీలుగా పరిగణించబడుతున్నారు. ఈ వర్గాలకు చెందిన ఓట్లు ఏకపక్షంగా పడతాయన్న నమ్మకం ప్రభుత్వానికి ఉంది. వారిని ఓటు బ్యాంకుగా మార్చుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పెద్దయెత్తున కేటాయింపులు జరిపినట్లు తెలుస్తోంది. గడచిన నాలుగేళ్లలో 206 గురుకుల విద్యాలయాలను ప్రారంభించింది. వాటిలో 47,818 మంది విద్యార్థులు చదువు కుంటున్నారు. ఈ విద్యాసంస్థలపై ప్రభుత్వంరూ. 735 కోట్లు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ముస్లిం అనాధ పిల్లలకు ఆశ్రయం ఇస్తున్న అనీస్ ఉల్ గుర్బాకు 4300 గజాల స్థలాన్ని కేటాయిస్తూ రూ. 20 కోట్లు కేటాయించింది. స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి సబ్సిడీని 80 శాతానికి పెంచింది.దేశంలో మరెక్కడా లేని విధంగా ఇమామ్, మౌజామ్‌లకు నెలకు రూ.1500 గౌరవ భృతిని చెల్లిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 8,934మందికి ఈ భృతి అందుతోంది. హైదరాబాద్‌లో ఇస్లామిక్ సెంటర్ కమ్ కన్వెన్ హాల్ నిర్మాణానికి కోకాపేటలో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. రంజాన్, క్రిస్మస్ పండుగ సందర్భంగా రెండు లక్షల మంది పేదలకు దుస్తులు, చీరలను పంపిణీ చేస్తోంది. విందులను కూడా ఏర్పాటు చేస్తోంది.

బీసీ రెసిడెన్షియల్ కాలేజీల్లో సూపర్-100

• ఎంపీసీ, బైపీసీలో 800 మందికి శిక్షణ • ప్రతిభావంతులకు ప్రత్యేక శిక్షణ • జూన్ 1నుంచే ప్రారంభం



హైదరాబాద్,ఆంధ్రప్రభః క్రీమ్ ఆఫ్ ద క్రీమ్ అంటూ ప్రత్యేక శిక్షణ ఇస్తున్న కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ రెసిడెన్షియల్ కాలేజీల్లోని విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్న సెకండియర్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికను మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల సొసైటీ అధికారులు రూపొందించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను జూన్ 1 నుంచి ప్రారంభించనున్నారు.

800 మందికి ప్రత్యేక శిక్షణ

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, ద్వితీయం సంవత్సరంలో అత్యంత ప్రతిభ కనబరుస్తున్న 800 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను ఇవ్వనున్నారు. మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో బాలురు 100 మందిని, బాలికలు 100 మందిని అదేవిధంగా బైపీసీ గ్రూప్‌లోనూ 100 మంది బాలురు, మరో 100 బాలికలను ఎంపిక చేస్తారు. ఎంపిక చేయడానికి రాష్ట్రంలో ఉన్న అన్ని బీసీ రెసిడెన్షియల్ కాలేజీల్లో పోటీ పరీక్షను నిర్వహిస్తారు. అందులో అత్యంత ప్రతిభ కనబరిచిన 100 మందిని ఎంపిక చేస్తారు. ప్రస్తుతం మొదటి సంవత్సరం పూర్తి అయిన వారు ద్వితీయ సంవత్సరంలోకి వస్తారు కాబట్టి వారికి మే నెలలో పరీక్షను నిర్వహిస్తారు. ఎంపికైన వారికి జూన్ 1 నుంచి ప్రత్యేక శిక్షణను ప్రారంభిస్తారు. ఏప్రిల్‌లో నిర్వహించే మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి కాలేజీల్లో చేరిన వారికి మూడు నెలల తరువాత ఆగస్టులో పరీక్ష నిర్వహిస్తారు. వారిలో కూడా రెండు గ్రూపుల నుంచి బాలురు, బాలికలను ఎంపిక చేస్తారు.

అనుభవజ్ఞులతో శిక్షణ

ప్రత్యేకంగా ఎంపిక చేసిన వీరికి అనుభవం ఉన్న అధ్యాపకులతో ప్రత్యేక శిక్షణను ఇప్పించనున్నారు. వివిధ సబ్జెక్టులలో అనుభవం ఉన్న అధ్యాపకుల కోసం ఇప్పటి నుంచే తగిన ప్రయత్నాలను బీసీ గురుకుల సొసైటీ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. వీరికి ప్రత్యేకంగా గౌరవ వేతనంలాగా ఇవ్వనున్నారు. 800 మంది విద్యార్థిని, విద్యార్థులను పర్యవేక్షించడానికి ప్రత్యేక ఏర్పాట్లను, సిబ్బందిని కూడా ఏర్పాటు చేసుకోనున్నారు. రాష్ట్రంలో 12 బీసీ బాలుర రెసిడెన్షియల్ కాలేజీలు ఉండగా, 7 బాలికల రెసిడెన్షియల్ కాలేజీలు ఉన్నాయి. వీటి నుంచే విద్యార్థిని, విద్యార్థులను ఎంపిక చేస్తారు. బాలురకు సరూర్‌నగర్‌లో, బాలికలకు నాగోల్‌లో ప్రత్యేకంగా భవనాలను అద్దెకు తీసుకొని వీటిని నిర్వహించాలని నిర్ణయించారు. మొదటి సంవత్సరంలో 3000 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 3000 మంది విద్యార్థులు ఉంటారు. వారిలో నుంచి మొత్తంగా 800 మందిని ఎంపిక చేస్తారు.

ప్రత్యేక శిక్షణ: మల్లయ్య బట్టు

బీసీ రెసిడెన్షియల్ గురుకులాల్లో చదివే అత్యంత ప్రతిభ ఉన్న విద్యార్థులకు గతంలోనూ ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించేవారమని, ఈ ఏడాది కూడా ప్రత్యేక శిక్షణ ఉంటుందని బీసీ గురుకులాల సొసైటీ కార్యదర్శి మల్లయ్య బట్టు తెలిపారు.

ప్రత్యక్ష పద్ధతిలోనే సర్పంచ్ ఎన్నిక

• రిజర్వేషన్ రొటేషన్ పదేళ్లకోసారి • మహిళా కోటాలో భారీ పెరుగుదల • న్యాయశాఖ గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్,ఆంధప్రభ: స్థానిక సంస్థల స్వయం పాలనను మరింత పటిష్టం చేసి గ్రామీణ తెలంగాణ లక్ష్యంగా టీఆర్ఎస్ సర్కారు చేపట్టిన నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రతిపాదనల ముసాయిదా సిద్ధమైంది. రాష్ట్ర శాసన సభ బడ్జెట్ సమావేశాల్లోనే పంచాయతీరాజ్ బిల్లును సభలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఈనెల చివరివారంలో నూతన పంచాయతీరాజ్ బిల్లు సభలోకి వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. మిగిలిన అన్ని అంశాలు ఎలా ఉన్నప్పటికీ పంచాయతీరాజ్ చట్ట సవరణల బిల్లు ప్రతిపాదనల్లో గ్రామ పంచాయతీలకు జరిగే ఎన్నికల విధానమే అత్యంత కీలకం కానుంది. సర్పంచును నేరుగా ఓటర్లు ఎన్నుకునే విధానంకు స్వస్తిపలికి వార్డు మెంబర్ల ద్వారా సర్పంచును ఎన్నుకునే విధానం కొత్త పంచాయతీరాజ్ చట్టంలో తెస్తారన్న అభిప్రాయాలు గత మూడు నెలలుగా రాష్ట్రమంతటా చర్చనీయాంశంగా మారాయి. అయితే ప్రజల అభిప్రాయం పరిగనలోకి తీసుకున్న ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల విధానం ప్రజాభిప్రాయం ప్రకారమే నిర్వహించాలన్న అభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. ఇదే అంశాన్ని ఇటీవల మంత్రివర్గ సభ్యులొకరు ప్రస్తావించారు. పంచాయతీ సర్పంచు ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలోనే జరిగుతాయని నర్మగర్భితంగా పేర్కొన్నారు. విపక్షాల విమర్శలకు తావు లేని విధంగా పంచాయతీరాజ్ కొత్తచట్టం ప్రతిపాదనల బిల్లు రూపొందినట్టు చెప్పుకొచ్చారు. ఏవిధమైన న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా నూతన పంచాయతీరాజ్ బిల్లు ప్రతిపానలపై మేధోమధనం జరిపిన న్యాయ నిపుణులు బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం.



8684 పంచాయతీలు

రాష్ట్రంలో ప్రస్తుతం హైదరాబాద్ జిల్లా మినహా మిగిలిన 30 జిల్లాల్లో 8684 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే 500జనాభా ఉన్న తండాలు, గిరిజన గూడేలు , శివారు గ్రామాలకు కూడా గ్రామ పంచాయతీ గుర్తింపు ఇవ్వనున్నట్టు ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ బడ్జెట్ ప్రసంగంలో స్పష్టం చేశారు. రాష్ట్రంలో కొత్త పంచాతీల ప్రతిపాదనల నివేదిక ఇంకా తుదిరూపు దాల్చేందుకు మరికొంత సమయం పట్టే అవకాశాలు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. అయితే కొత్త పంచాయతీల ఏర్పాటుకు సంబందించిన అంశానికి , నూతన పంచాయతీరాజ్ బిల్లుకు సంబంధం లేదంటున్నారు. ఈ ఏడాది జులైలో పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉండటంతో రిజర్వేషన్ల అంశంలో కూడా ప్రభుత్వం మార్పులు ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. గ్రామ పంచాయతీ వార్డులు , సర్పంచు స్థానాలకు రిజర్వేషన్లను ప్రస్తుతం 5ఏళ్లకు ఒకసారి మార్చే విధానం అమల్లో ఉంది. దీన్ని పదేళ్లకు పొడిగిస్తూ కొత్త చట్టంలో ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. అంతే కాకుండా మహిళ ప్రతినిధుల రిజర్వేషన్లను కూడా 33శాతం నుంచి 50శాతానికి పెంచుతూ నూతన పంచాయతీరాజ్ చట్టంలో ప్రతిపాదించినట్టు సమాచారం.

ఢిల్లీలో సంప్రదాయబద్ధంగా ఉగాది వేడుకలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : శ్రీ ''విళంబి'' నామ సంవత్సర ఉగాది వేడుకలు న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో ఆదివారం అత్యంత వేడుకగా జరిగాయి. పంచాంగ శ్రవణం, అన్నమాచార్య, త్యాగరాజ క తులు, కూచిపూడి న త్య రూపకం, మురళి వేణుగానం, జానపద డోళ్లు విన్యాసం ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను అలరింప చేశాయి. షడ్రుచోపేతమైన ఉగాది పచ్చడి విశిష్టత, తెలుగు సంస్క తీ సంప్రదాయాలను మేళవింపజేస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమాలు ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రదేశ్ భాష, సాంస్క తిక సంస్థ, తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ల సమన్వయంతో ఏపీ భవన్‌లోని డా. బి. ఆర్. అంబేద్కర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఉగాది వేడుకలను రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంబించారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ హెూం మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి టి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సంస్క తి సంప్రదాయాలకు ప్రతీక తెలుగు పండగలని అభివర్ణించారు. యుగానికి ఆదిగా చైత్రమాసం, వసంత రుతువు ఆగమనం సూచికగా జరుపుకునే వేడుక ఉగాది పర్వదినం అన్నారు. వంక సిస్టర్స్ కుమారి కావ్య, శ్రావ్యలు ఆలపించిన అన్నమాచార్య, త్యాగరాజ కీర్తనలు ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి. బ్రహ్మశ్రీ గార్లపాటి ప్రభాకర శర్మ పంచాంగ పఠనం చేసి తెలుగు సంవత్సర విశిష్టత, రాశి ఫలాల ఫలితాలను వివరించారు. దేశరాజు కిరణ్మయి బ ందం ప్రదర్శించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైశిష్ట్యం, కళలు, సంస్క తులు, స్వాతంత్ర్య సంగ్రామం, పండగలు ఆచార వ్యవహారాలపై రూపొందించిన మాహాంధ్ర మహత్యం కూచిపూడి న త్య రూపకం ప్రేక్షకుల మన్ననలు పొందింది.

ఏప్రిల్ 1 నుంచి రోగ నిర్ధారణ పరీక్షలు

• పైలెట్ పాజెక్టుగా హైదరాబాద్‌లో ప్రారంభం • ఇంటింటి కంటి వైద్యంలో భాగంగా తాత్కాలిక సిబ్బంది నియామకం • పరీక్షలకు వచ్చిన ప్రతి వ్యక్తి డేటా ఆన్‌లైన్‌లో భద్రం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఏప్రిల్ 1వ తేదీ నుంచి రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొంది స్తోంది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. దీనికోసం తాత్కాలిక సిబ్బంది నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏఏ డిపార్ట్‌మెంట్ ఏయే కార్యక్రమాలను నిర్వహించాలో దానికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించు కోవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అధికా రులకు ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా శనివారం సికింద్రాబాద్‌లోని బోయిగూడలో స్థానికంగా రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు. సోమవారం బీఎస్ మక్తాలో మరోసారి ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇక్కడ పరీక్షలకు సంబంధించి రిపోర్టులను ఆన్‌లైన్‌లో రోగుల డేటా నమోదుతో పాటు ఫీడ్ చేస్తారు. దీంతో రోగి రోగాన్ని బట్టి వారికి మందులను అందజేయనున్నారు. ప్రస్తుతం ఇక్కడ నిర్వహించే రోగనిర్ధారణ పరీక్షల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వాటిని సరిదిద్దుకొని వచ్చేనెల 1వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా రాష్ట్రవ్యాప్తంగా దీనిని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.



వినియోగంలోకి సంచార వైద్య సేవలు

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మాములుగా రోజుకో ప్రాంతాన్ని గుర్తించి రక్త నమూనాలను సేకరించడంతో పాటు కాళ్ల, కీళ్ల నొప్పులు, కంటి సంబంధిత సమస్యలతో బాధపడే వారికి అద్దాలు, మందులను వైద్యులు పంపిణీ చేయనున్నారు. దీంతోపాటు రాష్ట్రంలో ప్రస్తుతం ఆర్‌బీఎస్‌కే ద్వారా అప్పుడే పుట్టిన శిశువు నుంచి 38 ఏళ్ల వయస్సు పైబడిన వారి కోసం 104 సంచార వైద్య సేవల ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఆర్‌బీఎస్‌కే బృందంలో ఇద్దరు వైద్యులు, ఒక ఎఎన్‌ఎం, ఫార్మాసిస్టు సేవలను అందించనుండగా, 104 సంచార వాహనంలో ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మాసిస్టలతో పాటు ఎఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు వైద్య సేవలను అందిస్తారని అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో ప్రతిఒక్కరికీ పరీక్షలు చేస్తారు. కిడ్నీ వ్యాధులను గుర్తించడానికి మొదటగా శాం పిల్స్‌ను సేకరిస్తారు. అనంతరం శాంపిల్స్‌ను తెలంగాణ డయాగ్నస్టిక్ పరీక్షా కేంద్రాలకు పంపిస్తారు.

కిడ్నీ వ్యాధులకు ప్రాధాన్యత

కిడ్నీ వ్యాధులను గుర్తించడానికి ఈ శాంపిల్స్ ఎక్కువగా ఉపయోగపడతాయని వైద్యులు పేర్కొంటున్నారు. పరీక్షల అనంతరం వారికి కిడ్నీ వ్యాధి ఉన్నట్లు తేలితే వెంటనే సంబంధిత వైద్యుడికి రెఫర్ చేస్తారు. అనంతరం వారి రిపోర్టులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ బాధ్యతలు తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా రక్త నమూనాలు ఇచ్చే వారి డేటాను భద్రపరచాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా అధికారులు పనిచేయనున్నారు.

త్వరలో విద్యార్థులకు రక్త, హిమోగ్లోబిన్ పరీక్షలు

6వ తరగతి నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు సైతం త్వరలోనే రక్త, హిమోగ్లోబిన్ పరీక్షలు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అన్ని జిల్లాల అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. మొదటగా దీనిని పైలెట్ ప్రాజెక్టు కింద హైదరాబాద్‌లో ప్రారంభించాలన్న ఆలోచనలో వైద్య ఆరోగ్య అధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమం డీఎంహెచ్ఓ, డీఈఓ, ఆర్‌బీఎస్‌కెలు కలిసి సంయుక్తంగా నిర్వహించనున్నాయి.



'నన్ను నాలుగు కోట్లకు ముంచారు'

బెంగళూరు: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ బెంగళూరుకు చెందిన ఒక కంపెనీపై ఫిర్యాదు నమోదు చేశారు. సదరు కంపెనీ తనను రూ.4 కోట్ల మేరకు మోసగించిందని ఫిర్యాదులో ఆరోపించారు.ఈ విషయమై సదాశివనగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నవీన్ మాట్లాడుతూ ద్రవిడ్ రెండు రోజుల క్రితం విక్రమ్ ఇన్‌వెస్ట్‌మెంట్ కంపెనీపై ఒక ఫిర్యాదు చేశారని తెలిపారు. కంపెనీ తనను రూ.4 కోట్ల మేరకు మోసగించిందని అందులో పేర్కొన్నారని ఆయన చెప్పారు. సదరు కంపెనీ అనేక మంది క్రీడాకారులను, ప్రముఖులను మోసగించిందనే వార్తలు వచ్చినప్పటికీ విక్రమ్ ఇన్‌వెస్ట్‌మెంట్‌పై ఫిర్యాదు చేసిన తొలి బాధితునిగా రాహుల్ ద్రవిడ్ నిలిచారు. కంపెనీ ద్వారా పలువురు వ్యక్తులను కోట్లాది రూపాయల మేరకు మోస గించారనే అభియోగంపై కంపెనీ యజమాని రాఘవేంద్ర శ్రీనాథ్, ఏజెంట్లు సూత్రం సురేష్ (మాజీ క్రీడా పాత్రికేయుడు), నరసింహమూర్తి, కె.సి. నాగరాజు, ప్రహ్లాద్‌ను పోలీసులు కొద్ది వారాల క్రితం అరెస్టు చేసినట్టు నవీన్ తెలిపారు. 2014 సంవత్సరంలో కంపెనీలో రూ.20 కోట్లు పెట్టు బడిగా పెట్టానని ద్రవిడ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. భారీ రాబడులు పొందవచ్చనే హామీపై తాను ఆ పని చేసినట్టు వెల్లడించారు. అయితే మూల ధన పెట్టుబడికి సంబంధించి ఇంకా రూ. 4 కోట్లను తాను పొందాల్సి ఉందని ఆయన ఆరోపించారు. రాహుల్ ద్రవిడ్ రూ.16 కోట్లు పొందారు. మిగతా రూ.4 కోట్లు రావాల్సి ఉంది. దీనికి సంబంధించి తగిన పత్రాలను ఆయన సమర్పించారు.



మిస్‌డ్ కాల్‌తో పీఎఫ్ వివరాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉద్యోగస్థులకు కేంద్ర ప్రభుత్వం మరో వెసులుబాటు కల్పించింది. కేవలం ఒక్క మిస్ట్ కాల్‌తో ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) ఖాతాలో బ్యాలెన్స్ ఎంత ఉందో తెలుసుకునే వీలు కల్పించింది. ఉద్యోగస్థులు తమ పిఎఫ్ ఖాతాలో ఎంత బ్యాలెన్స్ ఉందో సులువుగా పొందేందుకు ఈ టెక్నాలజీని ప్రవేశపెట్టినట్లు కేంద్ర కార్మిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఇపిఎఫ్) స్కీమ్‌లోని ఉద్యోగులెవరైతే యూనివర్సిటీ అకౌంట్ నంబర్ (యుఎఎన్) పోర్టల్‌లో రిజిస్టర్డై ఉంటారో వారు ఈ సేవలను వినియోగించుకోవచ్చు. ఒకరకంగా చెప్పాలంటే బ్యాంక్ బ్యాలెన్స్ వివరాలను పొందే తరహాలోనే పిఎఫ్ వివరాలను తెలుసుకునేందుకు వీలవుతుందన్న మాట. యుఎఎన్ పోర్టల్‌లో ఉద్యోగులు పొందుపరిచిన ఫోన్ నంబర్ నుంచి 011-22901406కు మిస్ట్ కాల్ ఇస్తే చాలు వెంటనే వివరాలు సంక్షిప్త సందేశం (ఎస్ఎంఎస్) ద్వారా అందుతాయి. ఈ సేవలకు ఎలాంటి చార్జీలు ఉండబోవని కార్మిక శాఖ పేర్కొంది. అదే విధంగా రిజిస్టర్ మొబైల్ నంబర్ నుంచి ఇపిఎఫ్‌ఒహెచ్‌ఒ యుఎఎన్ అని టైప్ చేసి 7738299899 నంబర్‌కు ఎస్ఎంఎస్ చేయడం ద్వారా కూడా వివరాలు పొందవచ్చు. ఇంగ్లీష్, హిందీతో పాటు మరో ఎనిమిది భారతీయ భాషల్లో బ్యాలెన్స్ వివరాలు పొందవచ్చని కార్మిక శాఖ వెల్లడించింది.

ఎండల్లో హాయ్ హాయ్..!

- ఏసీ, ఫ్యాన్లు, కూలర్లకు గిరాకీ
- విక్రయాలు పెరుగుతాయ్
- సొమ్ము చేసుకునే పనిలో కంపెనీలు
- విపణిలోకి కొత్త ఉత్పత్తులు, తాయిలాలు
- ఆన్‌లైన్‌లో జోరుగా అమ్మకాలు



న్యూఢిల్లీ: వేసవి కాలం దగ్గర పడటంతో ఏసీలు, పంకాలు, కూలర్లు తయారుచేసే కంపెనీలు రంగంలోకి దిగాయి. విపణిల్లోకి కొత్త ఉత్పత్తులు, ఆకర్షణీయమైన తాయిలాలు, విద్యుత్తు ఆదా చేసే ఉత్పత్తులు లాంటి ఎత్తుగడలతో గిరాకీని సొమ్ము చేసుకోవడానికి ఉపక్రమిస్తున్నాయి.

ఉష్ణోగ్రతకు తోడుగా విక్రయాలు

ఈ వేసవిలో వడగాడ్పులు వీస్తాయని, ఉష్ణోగ్రత సగటు కన్నా ఒక డిగ్రీ ఎక్కువ ఉంటుందనే వాతావరణ శాఖ సూచనతో విక్రయాల్లో 30 శాతం వృద్ధిని కంపెనీలు ఆశిస్తున్నాయి. అయితే భానుడి ప్రతాపానికి విక్రయాలు ఇప్పటికే ఊపందుకున్నాయని తయారీ దారులు, చిల్లరవర్తకదారులు చెబుతున్నారు.

వినియోగదారుల అవసరాలపై దృష్టి

విపణిలోకి కొత్త ఉత్పత్తులు తీసుకురావడంలో తామెంతో చురుగ్గా ఉంటామని ఉషా ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్(పంకాలు) రోహిత్ మాథుర్ తెలిపారు. వినియోగదారుల కొత్త అవసరాలను తెలుసుకోవడం లోనూ అంతే చురుగ్గా వ్యవహరిస్తామని చెప్పారు. నిలకడగా ఆర్థిక వ్యవస్థ ఊర్ధ్వముఖంలో తయారీ సూచీలు, ఉష్ణోగ్రత 1.5 నుంచి 2 డిగ్రీలు ఎక్కువ ఉండవచ్చన్న వాతావరణ శాఖ సూచనతో గిరాకీ సంబంధించి ఈ వేసవికాలం బాగుంటుందన్న ఆశాభావాన్ని మాథుర్ వ్యక్తం చేశారు.

పంకాలకు గిరాకీ

వేసవికాలంలో ఇతర గృహోపకరణాలు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకుంటాయని బజాజ్ ఎలక్ట్రికల్స్ సిఎండి శేఖర్ బజాజ్ తెలిపారు. ప్రజల ఆదాయంలో పెరుగుదలకు తోడు సమర్థమంతంగా విద్యుత్ వినియోగ ఉత్పత్తులు తక్కువ ధరకు లభిస్తున్నాయని చెప్పారు. దీంతో గతేడాదితో పోలిస్తే ఈ వేసవి కాలంలో పంకాల విక్రయంలో 20 శాతం వృద్ధి చోటు చేసుకుంటుందని తెలిపారు. 450 జిల్లాలకు విస్తరించిన తమ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్టు శేఖర్ చెప్పారు. దేశవ్యాప్తంగా 1,60,000 మంది చిల్లర వర్తకులకు కంపెనీ సేవా బృందం చురుగ్గా సేవలు అందిస్తున్నాయని తెలిపారు.

సాంకేతికతతో పరిశుభ్రమైన గాలి

ఇక ఆన్‌లైన్ విక్రయాలపై టాటా క్లిక్(సిఎల్ఐక్యూ) ప్రధాన నిర్వహణ అధికారి(సిఒఒ) వికాస్ పురోహిత్ మాట్లాడుతూ ఈ వేసవికాలంలో ఏసీలు, ఫ్రిజ్‌లు లాంటి గృహోపకరణాలకు సంబంధించి ఆన్‌లైన్ విక్రయాల్లో గణనీయమైన వృద్ధి చోటు చేసుకుంటుందని చెప్పారు. పానాసోనిక్ ఇండియా ఇన్‌వర్టర్ ఏసీల కొత్త శ్రేణిని విపణిలోకి తీసుకువచ్చింది. నానో టెక్నాలజీ పేరిట గాలి శుద్ధి వ్యవస్థను వాటిలో అమర్చింది. అది 99 శాతం పరిశుభ్రమైన గాలిని అందిస్తాయని కంపెనీ తెలిపింది.



దివాలా ముద్ర వేయొద్దు

- ఆర్‌బీఐకి విద్యుత్ కంపెనీల సంఘం లేఖ



న్యూఢిల్లీ: భారతీయ రిజర్వు బ్యాంకు విద్యుత్తుపై పార్లమెంటరీ సభా సంఘం, కీలకమైన మంత్రిత్వ శాఖలను బేఖాతరు చేస్తున్నదంటూ విద్యుదుత్పాదక కంపెనీల సంఘం పరోక్షంగా నిందించింది. దీనికి నిదర్శనంగా గత నెల 12న ఆర్‌బిఐ జారీ చేసిన ఒక సర్క్యులర్‌ను చూపింది. సదరు సర్క్యులర్ ప్రస్తుతం ఉన్న అన్ని రుణ పునర్ నిర్మాణ యంత్రాంగాలకు స్వస్తి చెప్పింది. బకాయి పడిన కంపెనీల ఆస్తులకు దివాలా కోడ్ అమలు చేయాలని తీర్మానించింది.రాష్ట్ర డిస్కమ్‌లు చెల్లింపులు జరపకపోవడం లేదా ఆలస్యంగా చెల్లింపులు జరపవడంతో తాము బకాయి పడినట్టు సంఘం పేర్కొంది. అంతేకాక కోల్ ఇండియా ఆలస్యంగా బొగ్గు సరఫరా చేయడం బకాయిల వెనుక ప్రధాన కారణాల్లో ఒకటిగా ఆర్‌బిఐకి నచ్చచెప్పడానికి ప్రయత్నించింది. ఈ మేరకు సర్క్యులర్ జారీ అయిన సరిగ్గా నెల రోజులకు అంటే మార్చి 12న ఆర్‌బిఐకి ఒక లేఖ రాసింది. కొత్త ఎన్‌పిఎ తీర్మాన నియామాల నుంచి విద్యుత్ రంగాన్ని మినహాయించేలా జోక్యం చేసుకోవాలని గవర్నర్ ఉర్జిత్ పటేల్‌ను కోరింది. రెగ్యులేటరీ జాప్యాల ఫలితంగా రూ.7,800 కోట్ల చెల్లింపులు ఆగిపోగా, రాష్ట్ర డిస్కమ్‌ల నుంచి రూ.8,300 కోట్ల అపరిష్కృత రాబడులు నిలిచిపోయాయని తెలిపింది. కోల్ ఇండియా ముందుకు అనుకున్న దాంట్లో కేవలం 60 శాతం బొగ్గు మాత్రమే సరఫరా చేస్తున్నదని ఆరోపించింది. విద్యుత్తుపై సభాసంఘం, కేంద్ర విద్యుత్తు, బొగ్గు మంత్రిత్వ శాఖ అభిప్రాయాలను తోసిరాజనింది అంటూ ఆర్‌బిఐని పరోక్షంగా నిందించింది. పార్లమెంటరీ సభా సంఘం ఆధ్వర్యంలో ఆస్తుల అంశంపై డెవలపర్లు, బ్యాంకర్లు, రెగ్యులేటర్లు, విద్యుత్, బొగ్గు మంత్రిత్వశాఖల అధికారులతో సమగ్రంగా చర్చించినట్టు సంఘం డైరెక్టర్ జనరల్ అశోక్ ఖురానా తెలిపారు. అందరి వాదనలు విన్న పార్లమెంటరీ సభా సంఘం ఆర్‌బిఐ లేదా ప్రభుత్వ పథకాల పునరుద్ధరణ వాస్తవికంగా ఉండాలే తప్ప సంకేతమాత్రంగా ఉండరాదని సిఫార్సు చేసిందని ఆర్‌బిఐకి రాసిన లేఖలో ఖురానా అన్నారు. విద్యుదాత్పదన చేస్తున్న లేదా నిర్మాణంలో ఉన్న 75,000 మెగావాట్ల ప్రాజెక్టులు తక్కువ మోతాదులో బొగ్గు లభ్యత, దీర్ఘకాలిక, మధ్యకాలిక పిపిఎల లేమి, రెగ్యులేటరీ ఉత్తర్వుల జారీలో జాప్యం, డిస్కమ్‌ల నుంచి రావాల్సిన రాబడులు నిలిచిపోయిన కారణంగా నిరర్థక ఆస్తుల(ఎన్‌పిఎలు) స్థాయికి చేరుకున్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు.

సొంత వ్యాపారాల్లో మనం వీక్

అహ్మదాబాద్: భారతదేశ జనాభాలో కేవలం ఐదు శాతం ప్రజలు మాత్రమే సొంత వ్యాపారంలో నిలదొక్కుకుంటున్నారని 2016-17 సంవత్సరానికి జిఇఎం ఇండియా నివేదిక పేర్కొంది. ప్రపంచంలో ఇది అత్యంత తక్కువ అని తెలిపింది. అలాగే దేశంలో వ్యాపారాన్ని అర్ధంతరంగా విరమించుకుంటున్నవారి శాతం ప్రపంచంలోనే అత్యధికంగా 26.4 శాతం ఉందని వెల్లడించింది. అహ్మదాబాద్‌కు చెందిన ఇడిఐ అనే సంస్థ 18 నుంచి 64 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న 3,400 మందిపై ఈ సర్వే చేపట్టింది. బ్రిక్స్ దేశాల విషయానికి వస్తే సొంత వ్యాపారాలు చేస్తున్న వారి శాతం బ్రెజిల్(17) అత్యధికం కాగా 3 శాతంతో దక్షిణాఫ్రికా అట్టడుగు స్థానంలో నిలిచింది. 8 శాతంతో చైనా కాస్త మెరుగైన స్థానాన్ని దక్కించుకుంది. భారత్, రష్యా దేశాలు చెరి 5 శాతం పొందాయి. భారత్‌లో సొంత వ్యాపారాలు అర్ధంతరంగా చాలించుకుంటున్న కేసుల్లో అధికార స్వామ్య అవరోధాల కారణంగా 1.3 శాతం, ఆర్థిక సమస్యలతో 7 శాతం, వ్యక్తిగత కారణాలతో 6.5 శాతం, లాభసాటిగా లేకపోవడంతో 16.9 శాతం, ఇతర కారణాలతో 58.4 శాతం మూతపడుతున్నాయి. దేశ జనాభాలో 11 శాతం వ్యాపారాన్ని ఇప్పుడిప్పుడే మొదలుపెట్టిన స్థితిలో ఉన్నారు. అలాంటి వారిలో 70.9 శాతం టోకు, చిల్లర వాణిజ్యంలో, 12.1 శాతం వ్యవసాయం, మైనింగ్, తయారీ, రవాణా రంగాల్లో, 9.3 శాతం మంది ఆరోగ్యం, విద్య, ప్రభుత్వం, సామాజిక సేవ రంగాలు, 4.5 శాతం ఐసిటి మరియు ఆర్థిక రంగంలో, 3.3 శాతం మంది ఇతర రంగాల్లో వ్యాపారం చేసుకుంటున్నారని సర్వే ఫలితాలు వెల్లడించాయి.



జీఎస్టీ ఇక్కట్లకు ఈ-వ్యాలెట్‌తో చెక్

న్యూఢిల్లీ: ఎగుమతిదారులకు జిఎస్టీ ఇక్కట్లను ఇ-వాలెట్ యంత్రాంగం సమర్థమంతంగా పరిష్కరిస్తుందని వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి సురేష్ ప్రభు హామీ ఇచ్చారు. జిఎస్టీ కింద పన్నుల రిఫండ్‌లో జాప్యం చోటు చేసుకుంటున్నదని ఎగుమతిదారుల ఫిర్యాదుల నేపథ్యంలో మంత్రి పై ప్రకటన చేశారు. ఇ-వాలెట్ యంత్రాంగం కింద ఎగుమతిదారుల గత రికార్డులు ప్రాతిపదికగా వారి ఖాతాలకు ఒక నోషనల్ క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ అవుతుంది. ఇన్‌పుట్‌లపై పన్ను చెల్లింపులకు ఆ క్రెడిట్‌ను వినియోగించుకోవచ్చు. దీనిపై వాణిజ్య, ఆర్థిక మంత్రిత్వ శాఖల కార్యదర్శులు కసరత్తు చేస్తున్నారని ప్రభు చెప్పారు.

ఇ-వాలెట్ ఈ సమస్యకు ఏకైక పరిష్కారమని ఆయన తెలిపారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ అంశంపై ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది అని చెప్పారు. ఇ-వాలెట్ అమల్లోకి వచ్చిన తర్వాత ఎగుమతిదారులు చెల్లింపులు చేయాల్సిన పనిలేదని, రిఫండ్‌లు కోరాల్సిన అవసరం ఉండదని మంత్రి తెలిపారు. పన్నుల రిఫండ్‌లో జాప్యం వర్కింగ్ క్యాపిటల్‌ను బ్లాక్ చేస్తున్నదని, షిప్‌మెంట్లపై ప్రభావం చూపుతున్నదని ఎగుమతిదారులు పేర్కొంటున్నారు. జిఎస్టీ అమల్లోకి వచ్చాక దాదాపు రూ.20,000 కోట్లు మేర రిఫండ్‌లో జాప్యం చోటు చేసుకుందని తెలిపారు. జిఎస్టీ రాకముందు ఎగుమతిదారులు సుంకాల నుంచి ముందస్తు మినహాయింపులు పొందేవారు. కానీ ప్రస్తుతం వారు మొదటగా చెల్లింపులు జరిపి ఆ తర్వాత రిఫండ్ కోరాల్సి వస్తున్నది.

డబ్ల్యూటీఓ భేటీకి 50 దేశాలు



న్యూఢిల్లీ: సోమవారం నుంచి ప్రారంభమయ్యే రెండు రోజుల ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటిఒ) సదస్సులో 50 దేశాలు పాల్గొంటాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 50 దేశాల ప్రతినిధులు అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించిన పలు అంశాలపై స్వేచ్ఛగా, నిర్మొహమాటంగా చర్చలు జరుపుతారని చెప్పింది. అలాంటి చర్చలు ఒక రాజకీయ మార్గదర్శనానికి దారి తీస్తుందనే ఆశాభావంతో జరుగుతాయని తెలిపింది. డిసెంబర్‌లో బ్యూనా ఎయిరెస్ డబ్ల్యూటిఒ సదస్సులో చర్చలు విఫలకావడంతో ప్రస్తుత సదస్సు సత్ ఫలితాలు అందిస్తుందని ఆశిస్తున్నట్టు వాణిజ్య శాఖ కార్యదర్శి రీటా టియోషియా ఇటీవల అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థ పరిరక్షణ, బలోపేతం అత్యంత కీలకమైనదిగా మంత్రిత్వ శాఖ ఆదివారం నాటి ప్రకటనలో పేర్కొంది. అంతేకాక డబ్ల్యూటిఒ మరీ ముఖ్యంగా దానికి చెందిన వివాదాల పరిష్కార విభాగం వ్యవస్థాపక సవాళ్ళు ఎదుర్కొంటున్నదని తెలిపింది.

పాస్‌పోర్ట్ ప్లీజ్

- కంపెనీల డైరెక్టర్లకు కేంద్రం నిబంధనలు
- ఆర్థిక నేరగాళ్ళపై సరికొత్త వల

న్యూఢిల్లీ: నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ లాంటి రుణ ఎగవేతదారులు దేశం విడిచిపోకుండా నివారించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. కేంద్ర కార్పోరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కంపెనీల్లో బోర్డు డైరెక్టర్లుగా వ్యవహరించే వారందరి పాస్‌పోర్ట్ వివరాల సేకరణకు ఒక ప్రతిపాదన చేయాలనే ఆలోచనలో ఉంది. ఒక వ్యక్తికి డైరెక్టర్ గుర్తింపు సంఖ్య(డిఐఎన్) కలిగి ఉండి పాస్‌పోర్టు లేని పక్షంలో సదరు వ్యక్తికి పాస్‌పోర్టు లేదని పేర్కొంటూ ఒక ధృవీకరణ పత్రం పొందాలనే ప్రణాళిక మంత్రిత్వ శాఖ చేస్తున్నది. డిఐఎన్ ఆశావాహులు మంత్రిత్వ శాఖ అందించే ఎనిమిది అంకెల ఐడి కోసం వారి పాస్‌పోర్ట్ వివరాల సమర్పణకు ప్రతిపాదించనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆ క్రమంలో పాస్‌పోర్టు వివరాలు పొందుపరిచేలా డిఐఎన్ దరఖాస్తును తగిన విధంగా సవరిస్తారు. అది మోసగాళ్ళు దేశం విడిచి పారిపోకుండా సకాలంలో స్పందించేందుకు అధికారులకు ఉపకరిస్తుంది. నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా, జతిన్ మెహతా లాంటి భారీ బకాయిదారులు రికవరీ యంత్రాంగాన్ని ఇరకాటంలో పడేస్తూ దేశం విడిచి పారిపోయారు.రూ.50 కోట్లకు పైబడి రుణాలు తీసుకున్న వారి పాస్‌పోర్టు వివరాలను అందజేయాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ నెల మొదట్లో బ్యాంకులను ఆదేశించింది. అలాగే రుణాలు తీసుకొని 45 రోజులు దాటిన వారి వివరాలను కోరింది. 2018 నాటి పరారైన ఆర్థిక నేరగాళ్ళ బిల్లు పిఎన్‌బి స్కామ్‌లో నీరవ్ మోడీ లాంటి పరారైనవారి ఆస్తుల స్వాధీనం, విక్రయానికి ఉద్దేశించినది. రూ.100 కోట్లు అంతకు మించి బకాయి పడి దేశాన్ని వీడినవారికి పైన పేర్కొన్న బిల్లు వర్తిస్తుంది. ప్రస్తుతం ఆ బిల్లు లోక్‌సభలో ఉంది. భారతీయ న్యాయస్థానాల ఎదుట అలాంటి నేరగాళ్ళ గైర్హాజరు తీవ్రమైన విపరిమాణాలకు దారి తీస్తుంది. అది క్రిమినల్ కేసుల్లో దర్యాప్తును అడ్డుకుంటుంది. న్యాయస్థానాల విలువైన సమయాన్ని వృథా చేస్తుంది. భారతీయ చట్టాలను అణచివేస్తుంది అని బిల్లుకు సంబంధించిన ఒక ప్రకటన పేర్కొంది.



బడ్జెట్ వెలుపలా భారీ అప్పులే

- కార్పోరేషన్ల పేరుతో ప్రత్యేక రుణ సమీకరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఎఫ్ఆర్‌బిఎం పరిధికి లోబడే రుణ సేకరణను ప్రభుత్వం చేస్తున్నప్పటికీ బడ్జెట్ వెలుపలనుంచి తెస్తున్న పూచీకత్తు రుణాలు భారీగా పెరిగిపోతున్నాయి. దీంతో ఆర్థిక పరిస్థితిపై అప్పుల భారం అంతకంతకూ పెరుగుతూపోతోంది. బడ్జెట్‌లో పేర్కొనకుండా ప్రత్యేకంగా కార్పొరేషన్లకు తెస్తున్న రుణాల్లో ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలదే సింహభాగంగా ఉంది. మిషన్ భగీరథకు రూ.16,413కోట్లు, నీటి పారుదల శాఖకు రూ. 7,031కోట్లు, గొర్రెల అభివృద్ధి సహకార సంస్థకు రూ.2050కోట్లు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.3360కోట్లు, హౌజింగ్ కార్పొరేషన్‌కు రూ.3021కోట్లు, హైదరాబాద్ జలమండలికి రూ.3399కోట్లు, టీఎస్ఐఐసీకి రూ. 735కోట్లు, టీఎస్ఆర్టీసికి రూ.740కోట్లు, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థకు రూ.600కోట్లు, ఉద్యాన అభివృద్ధి కార్పొరేషన్‌కు రూ.321కోట్లుగా ప్రభుత్వం సేకరించింది. అయితే ఇవన్నీ బడ్జెట్‌లో పేర్కొనని రుణాలే కావడం గమనార్హం.

తద్వారా ప్రభుత్వ పూచీకత్తుతో తీసుకున్న రుణాల పరిమాణం ఈ ఏడాదిలో రూ. 38,752కోట్లు చేరింది. ఇది రాష్ట్ర ఆవిర్భావం నాటికి 2014లో రూ. 16,876కోట్లుగా ఉంది. ఇది 2015నాటికి రూ. 18262 కోట్లకు చేరగా, 2016లో రూ. 27615కోట్లకు చేరింది. ఆ తర్వాత 2017 జనవరిలో ఇది రూ. 31453కోట్లుగా, 2018 నాటికి రూ. 38,752 కోట్లకు చేరుకున్నది.




బడ్జెట్‌లో పేర్కొన్నవి ఇవే...

ఇవికాకుండా ప్రత్యేకంగా బడ్జెట్‌లో పేర్కొన్న రుణాలు 2018-19 ఆర్థిక ఏడాదిలో రూ. 1,80,238.74కోట్లకు చేరుతాయని బడ్జెట్‌లో అంచనా వేశారు. రాష్ట్రస్థూల ఉత్పత్తిలో అప్పుల శాతం 20.63 శాతంనుంచి 21.39శాతానికి పెరుగుదల నమోదు చేసుకున్నాయి. 2015-16లో జీఎస్‌డీపీలో అప్పుల వాటా వాతం 16.18గా నమోదుకాగా నానాటికీ అది పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం ముగుస్తున్న ఆర్థిక ఏడాదిలో మొత్తం అప్పులు రూ. 1,51,133. 21కోట్లుగా నమోదుకాగా రానున్న ఆర్థిక ఏడాదిలో ఇది బడ్జెట్ సైజుకు సమీపంగా చేరనున్నట్లుగా ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొంది. ఇందులో ఓపెన్ మార్కెట్ రుణాలు రూ. 1,38,478కోట్లకు పెరగనున్నాయని అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వంనుంచి సేకరించనున్న అప్పులు 2017-18లో రూ. 9,010కోట్లుకాగా ఈ ఏడాది ఇవి రూ. 9409.46కోట్లకు ఎగబాకనున్నాయి. అటానమస్ సంస్థలనుంచి రూ. 13611.58కోట్లు, స్పెషల్ సెక్యూరిటీలు, ప్రావిడెంట్ ఫండ్, ఇతర మార్గాల ద్వారా రూ. 18,738 కోట్లను సమీకరించుకోనున్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటికే ప్రభుత్వ గ్యారెంటీలుగా విద్యుత్ రంగంపై రూ. 9732.51కోట్లు, ఇతర రంగాలపై రూ. 21,720. 53కోట్లను ప్రభుత్వం గ్యారెంటీలను ప్రకటించింది. ఇవి కాకుండా కార్పొరేషన్ల ద్వారా స్వంత పూచీకతుతో మరిన్ని రుణాలను బడ్జెట్‌లో పేర్కొనకుండానే సేకరించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించుకుంది.

రిజిస్ట్రేషన్ విలువ తేల్చేదెవరు..?

- 47-ఏ పై అస్పష్టత

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అక్రమాలకు నిలయంగా మారిందన్న నెపంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజలకు భారంగా మారింది. గతేడాది రిజిస్ట్రేషన్ శాఖలో జరిగిన అక్రమాల ఆధారంగా సెక్షన్ 47ఏను ప్రభుత్వం రద్దు చేసిన సంగతి విదితమే. నాటినుంచి నేటి వరకు ఒక్కటంటే ఒక్కటి కూడా ఈ చట్టం ప్రకారం ప్రభుత్వానికి దరఖాస్తు చేరలేదు...ప్రభుత్వం పరిష్కరించనూ లేదు...అంటే సవరణ తర్వాత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం ఎంత క్లిష్టంగా ఉందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలే అంటున్నాయి. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రంలో వాస్తవ విలువల ప్రకారమే రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న పరిణామాలు గత కొంత కాలంగా స్పష్టమవుతున్నాయి. మార్కెట్ విలువల సవరణ గత ఐదేళ్లుగా జరగకపోవడంతో స్థిరాస్తుల క్రయవిక్రయదారులు బ్యాంకు రుణాల కోసం ప్రభుత్వ నిర్దేశిత విలువకంటే అధిక మొత్తంతోనే రిజిస్ట్రేషన్ విలువను చూపుతున్నారు. దీంతో భారీ ఆదాయం సమకూరుతోంది. ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం కలిగిస్తున్న రిజిస్ట్రేషన్ యాక్టులోని సెక్షన్ 47ఏను రద్దు చేస్తూ ప్రభుత్వం గతేడాది కీలక నిర్ణయం తీసుకుంది. రిజిస్ట్రేషన్ యాక్టు-1908 ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1975నుంచి 1986 వరకు భూముల విలువను ప్రజలు ఎంత చెబితే దానినే గైడ్‌లైన్ వాల్యూగా అధికారులు రిజిస్ట్రేషన్ సమయంలో గుర్తించేవారు. దీనినే అప్పటి నుంచి బేసిక్ వాల్యూగా పిలుస్తున్నారు. ఆయా సందర్భాల్లో అపటి వీఆర్‌వోలు, కరణాలు ఎకరాకు ఇంత విలువ అంటూ నిర్ణయించేవారు. దీనిని రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలు ప్రామాణికంగా తీసుకునేవి. దీని విలువపై అభ్యంతరం ఉంటే రిఫర్ చేసి డాక్యుమెంట్‌ను నిలిపివేసే అధికారం జాయింట్ కలెక్టర్లకు, కలెక్టర్లకు ఉండేది. దీని ప్రకారం భూమి బేసిక్ విలువ బుక్‌లో లేకపోయినా రిజిస్ట్రేషన్ చేయడం జరిగేది. ఆ తర్వాత క్షేత్ర పరిశీలనను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేసి వాస్తవ విలువకు సరిపడా స్టాంపు డ్యూటీలో వ్యత్యాసాలు ఉంటే వసూలు చేసేవారు. ఆ తర్వాత 1986లో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను పెండింగ్‌లో పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. పూర్తి స్పష్టత వచ్చాకే డాక్యుమెంట్‌ను కొనుగోలుదారుకు తిరిగి ఇచ్చివేయాలని ఇందులో పేర్కొన్నారు. ఈ మేరకు చట్టంలో సవరణ చేశారు. అయితే ఈ నిర్ణయంపై కొందరు సుప్రీంకోర్టులో ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఉదంతంపై ప్రభుత్వ వైఖరిని సమర్థించిన సుప్రీం పెండింగ్‌లో పెట్టడమే సరైందని పేర్కొంటూ ఫిర్యాదులను తోసిపుచ్చింది. 1988-89 లో ప్రభుత్వ విలువ పెట్టకుండా రిఫరెన్స్‌లతో ఎలా చేస్తారని, ఒకవేళ సివిల్ కోర్టులకు అప్పీల్‌కు వెళ్లాల్సిన వారు తమ రుసుములను బ్యాంకులో డిపాజిట్ చేసి వెళ్లాలని నిబంధన విధించారు. ఈ నిబంధనపై కూడా కొందరు సుప్రీంకోర్టుకు వెళ్లారు. దీని పరిధిలో 47ఏ కింద విలువను నిర్ధారించే అధికారాన్ని డీఆర్(జిల్లా రిజిస్ట్రార్)లకు అప్పగించారు. దీని ప్రకారం సబ్ రిజిస్ట్రార్ సదరు డాక్యుమెంట్‌ను పెండింగ్‌లో పెడితే డీఆర్ ఫీల్డ్ విజిట్ చేసి, స్పాట్ ఇన్‌స్పెక్షన్ ద్వారా వాల్యూను నిర్ధారిస్తారు. అయితే తాజాగా ఈ సెక్షన్ ద్వారా అక్రమాలు జరుగుతున్నాయని ప్రభుత్వం గుర్తించింది. విలువల మదింపు, రిజిస్ట్రేషన్ విలువలను తక్కువ చేసి చూపడం, బుక్-1కు బదులుగా బుక్-4లో అక్రమంగా నమోదు చేయడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. దీంతో భారత స్టాంపుల చట్టం-1899లోని సెక్షన్ 47ఏను రద్దు చేయడంతోపాటుగా ఇకపై వాల్యూ నిర్ణయించే హక్కును కలెక్టర్, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్‌లకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



బాల్యానికి రక్తపోటు

• పదేళ్లలోపు వయసులోనే కాటేస్తున్న చక్కెర వ్యాధి • కంటి, మానసిక సమస్యలతోనూ ఇబ్బందులు • ఒత్తిడితోపాటు జంక్‌ఫుడ్, జీవనశైలిలే కారణం అంటున్న నిపుణులు • 2 నుంచి 18 ఏళ్లలోపువారే బాధితులు • తాజా అధ్యయనంలో నిగ్గుతేలిన వాస్తవాలు





హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: మీ ఇంట్లో పిల్లలు ఉన్నారా..అయితే వారి ఆరోగ్యం గురించి జాగ్రత్త తీసుకుంటున్నారా..లేకపోతే వారికి పరీక్షలు చేయించండి..2 సంవత్సరాల వయస్సు పిల్లల నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలు బీపీ, షుగర్, మానసిక సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నట్టు ఓ సర్వేలో తేలింది. గతంలో జాతీయ పోషకాహార సంస్థ, ఎన్ఐఎన్ సర్వేలో 25 శాతం మంది చిన్నారులు మొండివ్యాధుల బారిన పడుతున్నట్టు గుర్తించాయి. ప్రస్తుతానికి 49 శాతం మంది చిన్నారులు మొండి వ్యాధుల బారిన పడడం అందరిని ఆందోళన కలిగించే విషయమని నిపుణులు పేర్కొంటున్నారు. 40 సంవత్సరాలు వయస్సు దాటిన వారు ఈ మొండి వ్యాధుల బారిన పడుతుంటారు. వయస్సుతో పాటు వారిలోని రోగనిరోధక శక్తి తగ్గుతుండడం వలన వారు పలు సమస్యలతో ఆస్పత్రులకు వెళుతుంటారు. కానీ చిన్న వయస్సు పిల్లలు ఈ మొండి వ్యాధుల బారిన పడడం ప్రస్తుతం ఆందోళన కలిగిన విషయంగా వైద్యులు పేర్కొంటున్నారు.

1000 మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించగా...

సాధారణంగా చిన్న వయస్సు పిల్లల్లో కంటి, దంత సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. ఆ సమస్యలే తల్లీదండ్రులకు పెద్దగా కనిపిస్తాయి. అలాంటిది చిన్నపి ల్లల్లో బీపీ, షుగర్, మానసిక సమస్యలతో ఎక్కువగా బాధపడుతున్నట్టు బయటపడుతుండడంతో ఒకింత ఆశ్చర్యంతో భయపడాల్సిన పరిస్థితి నెలకొందని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని తల్లిదం డ్రులు, టీచర్లు కూడా గమనించలేని పరిస్థితుల్లో ఉన్న ట్టు ఒక సర్వేలో తేలింది. చాయిస్ ఫౌండేషన్ ప్రతినిధులు ఒక ప్రభుత్వ స్కూల్‌ను ఎంపిక చేసుకొని 1000 మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించగా అందులో 10 మందికి బీపీ, 7 మందికి షుగర్, 251 మంది పిల్ల లకు కంటి సమస్యలు, 40 మందికి వినికిడి సమస్య, 34 మంది మానసిక సమస్యలతో, 30 మంది పిల్లలు ఇతరత్రా వ్యాధులతో బాధపడుతున్నట్టు గుర్తించారు.

చదువులో ఒత్తిడి, టీవీలు, కంప్యూటర్లు

పిల్లలకు చిన్నప్పటి నుంచి చదువులో ఒత్తిడి ఉండ డంతో పాటు టీవీలు, కంప్యూటర్లు, జంక్‌ఫుడ్స్, జీవన శైలిలో మార్పుతో పాటు ఇతరత్రా కారణాల వలన పిల్లలు ఈ వ్యాధులు బారిన పడుతున్నట్టు చాయిస్ ఫౌండేషన్ ప్రతినిధులు గుర్తించారు. పరీక్షలు చేసిన పిల్లల్లో కొందరు కంటి అద్దాలను వాడుతున్నారు. ఆ అద్దాల వలన పిల్లలకు ప్రయోజనం లేదని, వాటిని మార్చితే వారి కంటికి మేలు జరుగుతుందని ఆ ప్రతి నిధులు గుర్తించారు. పాత అద్దాలను వాడడం వలన పిల్లల కంటిపై అదనపు భారం పడుతోందని పరీక్షల్లో వైద్యులు గుర్తించారు.

మొదటి దశలోనే బీపీ, షుగర్‌లు

చిన్న పిల్లలకు బీపీ, షుగర్ కూడా మొదటి దశలోనే ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. పిల్లల్లో బీపీ రావడానికి ప్రధాన కారణంగా బరువు కూడా ఉండవచ్చున్నది వారు పేర్కొంటున్నారు. ఇంత చిన్న వయస్సులో ఈ మొండి వ్యాధులు బయటపడగా అది 20 ఏళ్లు వచ్చే సరికి ప్రమాదకరంగా మారే పరిస్థితి ఉందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల బరువు చూస్తే 5 ఏళ్ల లోపు వారు 2.3 శాతం, 5 సంవత్సరాలు దాటిన వారిలో 31 శాతం పిల్లలు ఉన్న దానికంటే ఎక్కువ బరువు ఉన్నట్టు తేలింది. పరీక్షలు నిర్వహించిన 1000 మందిలో 18.6 శాతం పిల్లలు స్థూలకాయంతో బాధపడుతున్నట్టు వారు గుర్తించారు.

40 మంది పిల్లలకు వినికిడి సమస్య

చిన్నపిల్లల్లో మానసిక సమస్యలు ఎక్కువయినట్టు కూడా ఈ సర్వేలో బయటపడింది. చైల్డ్ సైకాలజీ డిజిటల్ స్క్రీనింగ్ ద్వారా 84 ప్రశ్నలను పిల్లలను అడగ్గా అందులో 34 మంది పిల్లలకు వివిధ రకాల మానసిక సమస్యలతో బాధపడుతున్నట్టు వైద్యులు గుర్తించారు. దీంతోపాటు 40 మంది పిల్లలకు వినికిడి సమస్య ఉన్నట్టు గుర్తించారు. 15 మంది కొద్దిపాటి వినికిడి సమస్యతో బాధపడుతుండగా 13 మంది కొంచెం ఎక్కువగా, 12 మందిని మోస్తారుగా ఈ సమస్య వెంటాడుతున్నట్టు వారు గుర్తించారు. 36 మంది పిల్లలు చర్మ, అలర్జీ, పోషకాహారం లోపం, ట్రాన్సిల్స్, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నట్టు తేలింది. పిల్లల చదువుకి అడ్డంకిగా మారిన ఆరోగ్య సమస్యలు వలన మున్ముందు ఇబ్బం దులు తప్పవని వైద్యులు పేర్కొంటున్నారు.

అప్పటికప్పుడే పిల్లల వ్యాధుల గుర్తింపు

చాయిస్ ఫౌండేషన్ (మై చైల్డ్ హెల్త్), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్ మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజేబులిటీ (ఎన్ఐఈపీఐడీ) మరి యు ఎల్వీ ప్రసాద్ నేత్ర ఆస్పత్రి సంయుక్తంగా ఈ పరీక్షలను నిర్వహించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి పరీక్షలు నిర్వహించడానికి ఈ సంస్థలు కొంత నిధిని సమకూర్చుకున్నాయి. దీనికోసం అధునాతన యంత్రా లను సమకూర్చుకున్నాయి. దీనివల్ల అప్పటికప్పుడే పరీక్షల ఫ లితాలను వైద్యులు వెల్లడించే విధంగా ఈ పరికరాలు పనిచేయనున్నాయి. ప్రస్తుతం ఈ సంస్థలకు ప్రభుత్వం కూడా తోడ్పాటునందించే దిశగా ఆలోచి స్తుంది. ఈ సంస్థ ప్రతినిధులు ఈ పరీక్షలను ఉచితం గానే నిర్వహిస్తున్నారు. స్పెషలిస్ట్ వైద్యుల సమక్షంలో పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ సంస్థల ఆధ్వర్యంలో 4 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించారు.

పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి


డాక్టర్ సతీష్, ఘంటా

పిల్లల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. తల్లీదండ్రులతో పాటు టీచర్లకు అవగాహన కల్పించాలన్నదే మా తపన. పిల్లలకు ఇలాంటి వ్యాధులు వస్తున్నాయి ప్రస్తుతం ఎవరూ గుర్తించలేని పరిస్థితుల్లో ఉన్నారు. సంవత్సరం పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పరీక్షలు నిర్వహించాలన్న ఉద్ధేశ్యంతోనే మేము ముందుకు వెళుతున్నాం. అందులో భాగంగానే కొన్ని ఆస్పత్రులు ముందుకు వచ్చి దీనికోసం కొంతమేర నిధులను సేకరించాం. ఎప్పటికప్పుడు ఇక్కడ జరిపే పరీక్షల వివరాలను ప్ర భుత్వానికి తెలియచేయనున్నాం. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం గురించి అనేక రకాలుగా శ్రద్ధ వహిస్తోంది. అందులో భాగంగానే తాము కూడా కొంతమేర ప్రభుత్వానికి చేయూతనందించాలన్న ఆలోచనలతోనే ఈ నిర్ణయాన్ని తీసుకున్నాం.

న్యాయాధికారి గాంధీ అరెస్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నాంపల్లి లేబర్ కోర్టు ప్రీసైడింగ్ అధికారి మల్లంపాటి గాంధీని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆయనపై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో శనివారం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏడు చోట్ల ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. శనివారం జరిపిన దాడుల్లో దస్తావేజుల విలువ ఆధారితంగా రూ.3.57 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు. విచారణ అనంతరం సికింద్రాబాద్ వారాసిగూడలో ఆయన ఇంటి వద్ద ఆదివారం వేకువజామున మూడు గంటల ప్రాంతంలో ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. వ్యక్తిగత కోపంతోనే బంధువుల్లోని కొందరు ఏసీబీ అధికారులకు సమాచారమందించారన్నారు. వారసత్వంగా వస్తున్న ఆస్తులతో తనకు సంబంధం అంటగట్టి ఫిర్యాదు చేశారని ఆయన ఆరోపించారు. తన భార్యకు వారి తల్లిదండ్రులు ఇచ్చిన బంగారాన్ని సైతం అక్రమాస్తులం టున్నా రన్నారు. మీడియాతో మాట్లాడుతున్న సమయంలో ఆయన స్పృహతప్పి పడి పోవడంతో బంధువులు ఆయనను వైద్యశాలకు తరలించేందుకు యత్నించగా ఏసీబీ అధికారులు అడ్డుకున్నారు. దీంతో ఏసీబీ అధికారులకు, గాంధీ బంధువులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గాంధీని వైద్యులు డిశ్చార్జి అనంతరం ఏసీబీ అధికారులు గాంధీని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు నేరుగా న్యాయమూర్తి నివాసానికి తీసుకెళ్లారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో గాంధీని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

మద్యం మత్తులో ప్రాణం తీసిన యువతులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మద్యం మత్తులో ముగ్గురు యువతులు ద్విచక్రవాహనంపై శనివారం అర్ధరాత్రి అతి వేగంగా వెళుతూ రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బయోడైవర్సిటీ వద్ద అటుగా వస్తున్న ఇద్దరు యువకులను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం పాలవ్వగా, మరొకరు ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందు తున్నాడు. అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెబుతున్నారు. సీఏ చదువుతన్న జెన్నీ జాకబ్ మద్యం సేవించి ద్విచక్రవాహనాన్ని అతివేగంగా నడిపిందని, ఇదే క్రమంలో ఇద్దరు యువ కులను ఢీకొనడం జరిగింది. కాగా, ఈ ఘటనలో చనిపోయిన వ్యక్తిని చిరం జీవి(20)గా, చికిత్స పొందుతున్న వ్యక్తిని సాయికుమార్(22)గా పోలీసులు గుర్తిం చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ఉగాది ఉత్సవాల్లో విషాదం

దోమకొండ, ప్రభ న్యూస్: కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో ఆదివారం ఉగాది సందర్భంగా సాయంత్రం నిర్వహించిన ఎడ్లబండ్ల ప్రదర్శనలో విషాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో దోమకొండకు చెందిన బొరెడ్డి బాల్‌రెడ్డి(42) మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రతీ ఏటా మాదిరిగా దోమకొండలోని శివరామ మందిరాలయం చుట్టూ ఎడ్లబండ్లు తిరుగుతున్న సమయంలో ఒక ఎడ్లబండికి చెందిన రెండు ఎడ్లు బెదిరిపోయి జనం వైపు దూసుకొచ్చాయి. ఎడ్లబండ్లను తిలకించేందుకు వెళ్లిన బొరెడ్డి బాల్‌రెడ్డితో పాటు మరో నలుగురు నర్రగుల్ల భూపతి, ఊల్లె పోచయ్య, నర్రగుల్ల లక్ష్మీ, కామిండ్ల పోచయ్యలపైకి ఎడ్లబండి ఎక్కింది. బాల్‌రెడ్డి ముఖంపై ఎడ్లబండి చక్రం ఎక్కడంతో తీవ్రంగా రక్తస్రావం జరిగింది. మరో నలుగురికి గాయాలయ్యాయి. వెంటనే బాల్‌రెడ్డిని 108లో కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు.

అత్యాచార దోషులను శిక్షించాలి

• గిరిజన విద్యార్థి సమాఖ్య డిమాండ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గిరిజన యువతిపై అత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని గిరిజన విద్యార్థి సమాఖ్య డిమాండ్ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం జానంపేట పంచాయతీలోని అమరారంలో ఈ నెల 11న గిరిజన యువతిపై అత్యాచార ఘటన జరిగిందని సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు భూక్యాచందూనాయక్, మూడ్ శోభన్‌నాయక్ తెలిపారు. గిరిజన యువతిపైన 11 మంది సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. వారందరిపైన నిర్భయ చట్టం, ఎస్సీ, ఎస్టీ వేదింపుల చట్టం, అత్యాచార నిరోధక చట్టం పరిధిలో కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. జానంపేట పంచాయతీలోని పాండురంగాపురానికి చెందిన గిరిజన యువతి ఈ నెల 11న అమరారంలో జాతరకు వెళ్లింది. అమరారం గ్రామానికి చెందిన పోలేబోయిన భరత్, ఏసుబాబుతో పాటు మరో 9 మంది యువకులు గిరిజన యువతిని బలవంతంగా ఆటోలో ఎత్తుకెళ్లారు. అమరారం అడవుల్లో గిరిజన యువతిపై అత్యాచారానికి పాల్పడ్డారు. రెండవ రోజు కూడా భూపాలపల్లి జిల్లా అఖినపల్లి మల్లారం అడవుల్లో మరోమారు అఘాయిత్యానికి పాల్పడ్డారు అని గిరిజన విద్యార్థి సమాఖ్య విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో గిరిజన మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫ లమైందన్నారు. పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యం, రాజకీయ పార్టీల జోక్యంతో నేరస్తులు సులభంగా తప్పించుకుంటున్నారని ఆరోపించింది.

రామ రథయాత్రకు బ్రేక్

• అడ్డుకున్న పోలీసులు • కోఠిలో ఉద్రిక్త పరిస్థితి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అయోధ్యలో రామ మందిర నిర్మాణ పనులు త్వరగా ప్రారంభం కావాలన్న సంకల్పంతో బాసర నుంచి భద్రాచలం వరకు విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి) నిర్వహించతలపెట్టిన రామ రథ యాత్రను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కోఠిలోని విహెచ్‌పి కార్యాలయ పరిసర ప్రాంతాలలో కొంత ఉద్రిక్తత ఏర్పడింది. వందలాది మంది పోలీసులు విహెచ్‌పి కార్యాలయాన్ని చుట్టుముట్టారన్న విషయం తెలుసుకున్న విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు కాషాయ జండాలను చేతబట్టుకుని అక్కడకు చేరుకోవడంతో ఏం జరుగుతుందో అర్ధం కాని పరిస్థితి నెలకొంది. శ్రీరామ రథ యాత్ర బాసరలోని సరస్వతీ దేవాలయం వద్ద సోమవారం మొదలై ఈ నెల 30 వ తేదీ భద్రాచలంలోని రామాలయం వద్ద ముగించాలని గత నెలలో ఉడిపిలో జరిగిన సాధు సంతుల సమావేశం నిర్ణయించింది. ఈ తరహా రథ యాత్రలు దేశ వ్యాప్తంగా నిర్వహించేందుకు సాధుసంతుల సమావేశం పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా రథాన్ని సిద్దం చేయించిన విహెచ్‌పి దాన్ని కోఠిలోని కార్యాలయానికి తరలించారు. రథం కార్యాలయం చేరుకుందన్న విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు దాదాపు 200 మంది సిబ్బందితో అక్కడకు చేరుకుని రథాన్ని కదలనిచ్చేది లేదని అడ్డుకున్నారు. వాస్తవానికి రథ యాత్ర హైదరాబాద్‌లో ప్రారంభం కావడం లేదని, బాసర పుణ్యక్షేత్రం నుంచి సోమవారం మొదలవుతుందని విహెచ్‌పి కార్యాలయంలోని కార్యకకర్తలు చెప్పినా పోలీసులు వినిపించుకోలేదు. దీంతో కార్యకర్తలు, పోలీసులకు మధ్య దాదాపు రెండు గంటల పాటు మాటల యుద్ధం సాగింది. ఏది ఏమైనా ఎన్ని చెప్పినా రథం బాసరకు వెళ్ళేందుకు అను మతించమని పోలీసులు తేల్చి చెప్పారు. చివరకు విహెచ్‌పి కార్యకర్తలు రథాన్ని బాసరకు తరలించే ప్రక్రియను తాత్కాలికంగా నిలిపి వేశారు. సోమవారం ఎట్టి పరిస్థితులలో రథాన్ని బాసరకు తీసుకు వెళ్తామని, అక్కడి నుంచి రథయాత్రను ప్రారంభిస్తామని నేతలు తెలిపారు.

గూడ్స్‌పై పడిన విద్యుత్ తీగలు

• చెల్లాచెదురైన స్తంభాలు • ప్రయాణికుల అప్రమత్తతతో తప్పిన పెనుప్రమాదం • చలమ రైల్వేస్టేషన్ సమీపంలో ఘటన



గిద్దలూరు టౌన్, ప్రభ న్యూస్ : ప్రకాశం జిల్లా గిద్దలూరు - కర్నూలు జిల్లా నంద్యాల మధ్యలో చలమ రైల్వేస్టేషన్ సమీపంలోగల విద్యుత్ స్తంభాలు కూలడంతో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. అందిన సమాచారం మేరకు ఇటీవల రైల్వే విద్యుద్ధీకరణ పనులు చేపట్టారు. అందులో భాగంగా ఏర్పాటుచేసిన విద్యుత్ తీగలు కిందకు జారడంతో విషయం గమనించని గూడ్స్‌రైలు డ్రైవర్ రైలును ముందుకు నడిపారు. దీంతో విద్యుత్ తీగలు గూడ్స్ పైభాగానికి తగులుకుని 6 విద్యుత్ స్తంభాలు నేలను పెకిలించుకుని ట్రాక్‌కు ఇరువైపులా పడ్డాయి. స్థానికుల అరుపులతో అప్రమత్తమైన గూడ్స్ డ్రైవర్ గూడ్స్‌ను నిలిపివేసి సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించారు. వెంటనే అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ తీగలు, స్తంభాలను తొలగించేపనులు చేపట్టారు. దీంతో నంద్యాల వైప ు నుంచి ఉదయం విజయవాడ వెళ్లే రైలును గాజులపల్లి రైల్వేస్టేషన్‌లో, గుంటూరు నుంచి నంద్యాల వైపు వెళ్లే కాచిగూడ ప్యాసింజర్ రైలును దిగువమెట్ట రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. అలాగే పలు గూడ్స్ రైళ్లను మరికొన్ని రైల్వేస్టేషన్‌లలో నిలిపివేసినట్లు తెలిసింది.

ఐదు గంటలపాటు ప్రయాణికుల అవస్థలు

రైల్వే విద్యుద్ధీకరణకు సంబంధించి విద్యుత్ స్తంభాలు రైల్వేట్రాక్‌పై పడటంతో గుంటూరు, విజయవాడ మధ్య రైళ్ల రాకపోకలకు ఆదివారం తీవ్ర అంతరాయం కలిగింది. ఉదయం 10గంటల సమయంలో దిగువమెట్టలో కాచిగూడ ప్యాసింజర్ రైలును నిలిపివేయగా, గాజులపల్లె రైల్వేస్టేషన్‌లో గుంటూరు ప్యాసింజర్ రైలును నిలిపివేశారు. దీంతో రైళ్లలో ప్రయాణిస్తున్న వారు సువూరు 5 గంటలపాటు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. 5 గంటల తర్వాత రైల్వేట్రాక్‌పై విద్యుత్ తీగలు, స్తంభాలను తొలగించడంతో రైళ్ల రాకపోకలు పునరుద్ధరించారు. విద్యుత్ తీగలు రైల్వేట్రాక్‌పై పడటంతో స్థానికులు కేకలు వేయడంతో గమనించిన గూడ్స్ డ్రైవర్ రైలును నిలిపివేశాడు. అయితే ఆ సమయంలో గూడ్స్ రైలు కాకుండా ప్యాసింజర్ రైలు ఉన్నట్లయితే పెను ప్రమాదం సంభవించి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉండేదని పలువురు తెలిపారు. ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవ డంతో రైల్వే ఉన్నతాధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల చేపట్టిన విద్యుద్ధీకరణ పనుల్లో నాణ్యత లేకపోవడం వల్లనే ఇలాంటి సంఘటన చోటుచేసుకుందనే ఆరోపణలు వినబడుతున్నాయి. ఈ విషయంపై రైల్వే ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవాలి

• దీక్షగురు ప్రేమ్‌సింగ్ మహారాజ్




కెరమెరి, ప్రభ న్యూస్: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని పరందోలి గ్రామపంచాయతీ పరిధిలో శంకర్‌లొద్ది శివుని పుణ్యక్షేత్రంలో ప్రతీ ఉగాదికి బంజారుల దీక్ష గురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఆదివారం నిర్వహించిన ఉత్సవాలకు భారీ సంఖ్యలో బంజారాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సింగ్ మహారాజ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ భక్తులు ఆధ్యాత్మిక మార్గంలో నడిచి ఆధ్యాత్మిక భావంతో ముందుకుసాగాలని ఆయన భక్తులను చేడు అలవాట్లకు దూరంగావుండి మంచి అలవాట్లలో నడవాలని భక్తులకు సూచించారు. అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ సేవాలాల్ భక్తులు శివరాత్రి నుండి శ్రీరామనవమీ వరకు 41 రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి శ్రీరామనవమి రోజున దీక్షలను విరమిస్తారని ఆయన అన్నారు.

ఇటీవల ఆదివాసీలు,లంబాడీల మధ్య చేలరేగిన ఘర్షణలో సిర్పూర్ యు,హస్నాపూర్‌లో జరిగిన లంబాడీలపై జరిగిన ఆస్తి నష్టంపై సీఎం దృష్టికి తీసుకవెళ్లి నష్టపరిహారం ఇప్పించాడానికి కృషి చేస్తామన్నారు. బంజారాలు ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాడివల్సిన అవసరం ఉందన్నారు.

భాగ్యనగరంలో డ్రగ్స్ భూతం

• ఇద్దరు నైజీరియన్లు, ముంబై యువతి అరెస్టు
• రూ.4 లక్షల విలువచేసే 80 గ్రాముల కొకైన్ స్వాధీనం





హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లో మళ్లీ డ్రగ్స్ కలకలం చేలరేగింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాజేంద్రనగర్‌లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు నైజీరియన్లు పట్టుబడ్డారు. పుప్పాలగూడ ఫ్రెండ్స్ కాలనీలో సైబరాబాద్ వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నైజీరియాకు చెంది న ఇద్దరు వ్యక్తుల నుంచి 80 గ్రాముల కొకైన్‌ని పోలీసులు స్వాధీనం చేసు కున్నారు. పట్టుబడ్డ కొకైన విలువ రూ.4 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నైజీ రియన్లతో పాటు ముంబైకి చెందిన ఓ యువతిని పోలీసులు అదుపులోకి తీసు కున్నారు.

హైదరాబాద్ డ్రగ్స్ కేసు బయటపడ్డా...

హైదరాబాద్ డ్రగ్స్ కేసు బయటపడిన తర్వాత నుంచి డ్రగ్స్ కేసులు తగ్గుముఖం పట్టగలవని అంతా భావించారు. అందుకు భిన్నంగా నగరంలో డ్రగ్స్ విచ్చలవిడిగా లభ్యం అవుతుండటం గమనార్హం. హైదరాబాద్ డ్రగ్స్ కేసులో ప్రధాన సూత్రధారులు కాల్విన్, మైక్‌కమింగా, గాబ్రియేల్, లేడీ డాన్ సంగీతలు పట్టుబడ్డారు. వారి కాల్‌డేటా ఆధారంగా ఎక్సైజ్ సిట్ సినీ పరిశ్రమకు చెందిన 12 మంది సినీస్టార్స్‌ను సైతం 12 రోజుల పాటు సుదీర్ఘ విచారణ జరిపింది. డ్రగ్స్ మాఫియా ఎంతగా విజృంభించిందో ఆ డ్రగ్స్ కేసును చేధించిన ఎక్సైజ్ సిట్ చెప్పిన విషయాలు ఆశ్చర్యాన్ని, భయాందోళనలను కలుగజేశాయి. కార్పొరేట్ పాఠశాలలో 8,9 తగరతి చదివే భావి భారత పౌరులను సైతం డ్రగ్స్ బానిసలను చేసే శాయి. ఈ క్రమంలో డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితులు ఎక్సైజ్ సిట్‌కు చిక్కడంతో ఇక హైదరాబాద్‌లో డ్రగ్స్ ఆనవాళ్లే ఉండవని అంతా అనుకున్నారు. ఎక్సైజ్ సిట్ కూడా తొలుత దూకుడునే ప్రదర్శించింది. అనంతర కాలంలో ఆశించిన స్థాయిలో ముందడుగు వేయలేకపోయింది. మరోవైపు సే టూ నో డ్రగ్స్ పేరిట చేపట్టిన అవగాహన కార్యక్రమాలు సైతం అటకెక్కాయి. హైదరాబాద్ డ్రగ్స్ కేసు బయటపడిన తర్వాతనే డ్రగ్స్ కేసులు ఎక్కువగా బయట పడుతుండటం గమనార్హం. హైదరాబాద్ డ్రగ్స్ అడ్డాగా నిలుస్తోందన్న వాదనకు మరోమారు బలం చేకూరుతోంది.

మళ్లీ చెలరేగుతున్న నైజీరియన్లు

మరోవైపు నగర శివారు ప్రాంతాల్లో మూతపడ్డ కంపెనీలను లీజుకు తీసుకుని మరీ డ్రగ్స్ మాఫియాలు చెలరేగిపోతున్నాయి. ఇక డ్రగ్స్ దందాలో ఆరితేరిన నైజీరియన్లు సైతం మళ్లీ తమ పాత పంథాలో డ్రగ్స్ దందాకు తెరలేపుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

హత్యలకు నెరవని డ్రగ్స్ మాఫియాలు

ఇక డ్రగ్స్ మాఫియాలు ఇటీవల కేపీహెచ్‌బీలో నేరెళ్ల చంద్రశేఖర్ అనే వ్యక్తిని దారుణంగా హత్య చేసి ఆనవాళ్లు లేకుండా చేసేందుకు ప్రయత్నించాయి. మధ్యప్రదేశ్ ఇండోర్‌కు చెందిన 11 మంది నగరానికి వచ్చి మరీ నేరెళ్ల చంద్రశేఖర్‌ని హత్య చేసి ఉడాయించారు. ఇప్పటివరకూ ఆ కేసులో నిందితులు పోలీసులకు చిక్కలేదని సమాచారం. పోలీసులు ఎంత పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నా డ్రగ్స్ మాఫియాలు మాత్రం చాపకింద నీరులా తమ పని తాము కానిచ్చుకుపోతూనే ఉన్నారు. ఇక పబ్‌లలో తెలిసిన వారికి కోడ్ పద్ధతిలో డ్రగ్స్ లభిస్తూనే ఉన్నాయని చెబుతున్నారు. గడిచిన మూడున్నరేళ్ల కాలంలో పబ్‌ల సంఖ్య విస్తృతంగా పెరి గిందని గణాంకాలే చెబుతున్నాయి. మరోవైపు హైదరాబాద్‌లో డ్రగ్స్ మాఫియాలే జిల్లాలకు తమ దందాను విస్తరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం సాధ్యమేనా? అన్న ప్రశ్న ఉదయించక మానదు. డ్రగ్స్ మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలించాల్సిందేనని అమాత్యులు పైకి చెబు తున్న మాటలకు ఆచరణలో జరిగే పనులకు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందన్నది సామాన్యుడి ఉవాచ. మరోవైపు పబ్‌లు, క్లబ్‌లన్నింటికీ స్లీపింగ్ పార్టనర్స్‌గా రాజకీయనేతలు, సినీస్టార్స్ అన్నది జగమెరిగిన సత్యం. మరి ఈ డ్రగ్స్ దందాకు అడ్డుకట్ట పడేదెన్నడో..!?

ఉగాది పురస్కారాల ప్రదానం



అమరావతి, ఆంధ్రప్రభ : విళంబి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఈ సంవత్సరం వివిధ రంగాల నుంచి కళారత్న, ఉగాది పురస్కారాలకు ఎంపిక చేసిన ప్రముఖులను ప్రభుత్వ పక్షాన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అవార్డులను ప్రదానం చేశారు. కళ, సంగీతం, సాహిత్యం, జానపదం, నృత్యం, గానం తదితర రంగాల్లో విశేష కృషి చేసిన 47 మందికి కళారత్న పురస్కారాలను, 99 మందికి ఉగాది పురస్కారాలను ముఖ్యమంత్రి ప్రదానం చేశారు. 2018 సంవత్సరానికి గాను కళారత్న పురస్కారాలను అందుకున్న ప్రముఖులలో ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, ప్రముఖ రచయిత డాక్టర్ జి.వి.పూర్ణచందు, ప్రముఖ సంగీత గాయకుడు పెమ్మరాజు సూర్యరావు, సామాజిక సేవా రంగం నుంచి అంతర్జాతీయ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు వివిఎల్.ఇందిరాదత్, శాస్త్రీయ సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, పాలపర్తి శ్యామలనంద ప్రసాద్, సీనియర్ పాత్రికేయులు సి.రాఘవాచారి, ఆంధ్రప్రభ విశాఖపట్నం బ్యూరో చీఫ్ గంట్ల శ్రీనుబాబు, ప్రముఖ హరికథకులు వి.సింహాచలశాస్త్రి, చరిత్ర పరిశోధకులు ఈమని శివనాగిరెడ్డి ఉన్నారు.

'మిత్రధర్మం మరిచిన ప్రధాని'

నర్సీపట్నం (విశాఖపట్నం), ప్రభ న్యూస్: మిత్రధర్మాన్ని మరిచి తెలుగు రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర అన్యాయం చేశారని ఏపీ రహదారులు భవనాల శాఖామంత్రి సిహెచ్ అయ్యన్నపాత్రుడు విమర్శించారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రాన్ని సొంత రాష్ట్రంగా పరిగణనలోకి తీసుకొని ప్రత్యేక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని ప్రధాని మోడీ ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కారని, రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని మంత్రి ఘాటుగా విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరచిన అంశాలను తూచా తప్పకుండా అమలు చేస్తామన్న ప్రధాని, పోలవరం బాధ్యత కేంద్రానిదే అంటూ నాలుగేళ్లు కాలయాపన చేశారని ఆరోపించారు. చివరకు ప్రధాని రాష్ట్రా నికి మొండిచేయి చూపించారని ఆయన ఆరోపించారు.

పాత కరెన్సీ నోట్లను ఇలా..

ఇటుకలుగా చేసి వేలం వేయబోతున్న ఆర్‌బీఐ!

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మోదీ ప్రభుత్వం నవంబర్ 8,2016న చలామణిలో ఉన్న రూ.500, రూ.1000 నోట్లను రద్దుచేసింది. అలా రద్దు చేసిన పాత కరెన్సీ తిరిగి భారతీయ రిజర్వు బ్యాంకు(ఆర్‌బీఐ)కు చేరుకుంది. దేశవ్యాప్తంగా పలు ఆర్‌బీఐ శాఖల్లో ఏర్పాటు చేసిన ఆధునాన కరెన్సీ వెరిఫికేషన్ అండ్ ప్రాసెసింగ్(సీవీపీఎస్) యంత్రాల్లో పాత నోట్లను ప్రస్తుతం ప్రాసెస్ చేస్తున్నారు. ప్రాసెసింగ్ తర్వాత ఈ నోట్లను ముక్కలు ముక్కలుగా చేసి ఇటుకల రూపంలోకి మార్చుతారు. చివరగా వాటిని వేలంపాట ద్వారా విక్రయిస్తారు. రద్దు చేసిన రూ.500, రూ.1000 నోట్లు సహా పాత కరెన్సీ నోట్లను సీవీపీఎస్ యంత్రాల్లో లెక్కించి ప్రాసెస్ చేస్తున్నాం. ప్రాసెస్ చేసిన నోట్లను తర్వాత ఆర్‌బీఐ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ష్రెడ్డింగ్ అండ్ బ్రిక్వెటింగ్ వ్యవస్థ ద్వారా ముక్కలుగా చేసి ఇటుకల రూపంలోకి మారుస్తాం అంటూ ఓ పిటీఐ వార్తా సంస్థ ప్రతినిధి సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) ద్వారా అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆర్‌బీఐ ఈ మేరకు వివరణ ఇచ్చింది. ఇలాంటి ప్రాసెస్ చేసిన నోట్లను రీసైకిల్ చేయ బోమని బ్యాంకు స్పష్టం చేసింది. కాగా, గతేడాది జూన్ 30 నాటికి రూ.15.28 లక్షల కోట్ల రద్దయిన పెద్ద నోట్లు తిరిగి బ్యాంకులకు చేరుకున్నాయని ఆర్‌బీఐ ప్రక టించింది.


రానున్న రోజుల్లో వైద్యరంగంలో పెను మార్పులు

సన్‌షైన్ ఆస్పత్రి బ్రాంచ్ చైర్మన్ గురువారెడ్డి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రానున్న రోజుల్లో హెల్త్‌కేర్ సెక్టార్‌లో మార్పులు రాను న్నాయని, కొత్త టెక్నాలజీతో రోగికి మరింత మేలు జరుగుతుందని సన్‌షైన్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ ఏవీ గురువారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సన్‌షైన్ ఆస్పత్రి నూతన బ్రాంచీని గచ్చిబౌలిలో ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో వస్తున్న పెనుమార్పులకు అనుగుణంగా వైద్యరంగంలో మార్పు రావలసిన అవసరం ఉందన్నారు. ఆస్పత్రిని నడపాలంటే చాలా కష్టమని, ఎప్పటికప్పుడు కొత్తకొత్త పరికరాలతో వైద్యరంగం ముందుకు దూసుకెళుతుందన్నారు. తమ ఆస్పత్రుల్లో కూడా అధునాతన పరికరాలను సమకూర్చి నట్టు ఆయన పేర్కొన్నారు. రానున్న కాలంలో రోబోటెక్ కీలకపాత్ర పోషించనుందన్నారు. అతి క్లిష్టమైన, సూక్ష్మమైన వైద్యాన్ని రోబోటెక్‌తో విజయవంతంగా పూర్తి చేయవచ్చన్నారు. కాకపోతే ఇలాంటి వైద్యం ఖర్చుతో క ూడుకున్నదని దీనివల్ల రోగికి చాలా మేలు జరుగుతుం దన్నారు. ఈ ఆస్పత్రిలో రోబోను ప్రవేశపెట్టామని ఇక్కడ వచ్చే రోగులు తమ పేరును తమకు వచ్చిన రోగాన్ని ఇందులో ఫీడ్ చేస్తే మనం వచ్చిన ప్రతిసారి ఆ రోబో మనని గుర్తుపట్టి మనం ఏ వైద్యుడి దగ్గరకు వెళ్లాలే సూచిస్తుందన్నారు. మెడికల్ డైరెక్టర్ నాగార్జున యార్లగడ్డ మాట్లాడుతూ 250 పడకల సామర్థ్యంతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిగా దీనిని తీర్చిదిద్దామన్నారు. భవిష్యత్ అవస రాలకు అనుగుణంగా రూపొందించామన్నారు. అడ్వా న్సుడ్ టెక్నాలజీతో అత్యంత నాణ్యతతో కూడిన పరికరాలు, యంత్రాలను సమకూర్చినట్టు ఆయన తెలిపారు.

విచిత్ర ఆకారంతో జన్మించిన శిశువు




హైదరాబాద్, ఆంధ్రప్రభ : నగరంలోని పేట్ల బురుజు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో శనివారం చిత్రమైన ఆకారంతో జన్మించిన శిశువును చూసి వైద్యులు స్టన్ అయ్యారు. శిశువు శరీరం పై భాగం మాత్రం మనిషి రూపంలోనే ఉన్నప్పటికీ దిగువభాగం మాత్రం చేప తోకను పోలి ఉండటం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇది చాలా అరుదైన పరిస్థితి అని, లక్ష జననాల్లో ఒకకరు ఇలా పుడతారని వైద్యులు అంటున్నారు. వివరాల్లోకి వెళితే.. షాద్‌నగర్‌కి చెందిన 26 ఏళ్ల మహిళ సువర్ణ పేట్ల బురుజు ఆసుపత్రిలో సి-సెక్షన్ ద్వారా కవల పిల్లలకు జన్మనిచ్చింది.

ఇద్దరి పిల్లల్లో ఆడశిశువు దాదాపు 2.4 కిలోల బరువుంది. ఇక 1.2 కిలోల బరువుతో చిత్రమైన ఆకారంతో జన్మించిన మరో శిశువు ఆడా? లేక మగా? అన్న విషయాన్ని వైద్యులు నిర్ధారించలేని పరిస్థితి. అందుకు కారణం, సదరు శిశువు శరీరం ద్వితీయార్థమంతా చేప తోక మాదిరిగా కలిసిపోవడమే. ఇలాంటి పరిస్థితిపై వైద్య పరిభాషలో సిరెనోమిలియా అంటారు. ఇలా విచిత్రంగా పుట్టిన శిశువును ప్రస్తుతం నగరంలోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించామని పేట్ల బురుజు ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగమణి తెలిపారు.

బీజేపీ యుద్ధం ఎవరిపైన.?

● రాష్ట్రంలో అశాంతి సృష్టించేయత్నం ● విభజన హామీలు అమలు చేయాలని అడగడం తప్పా.? ● ప్రత్యేక హోదా-తెలుగు ప్రజల హక్కు ● ఉగాది వేడుకల్లో సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి, ఆంధ్రప్రభ : విభజన చట్టంలోని అంశాలను, హామీలను అమలు చేయాలని తాను పోరాటం చేస్తుంటే, కేంద్రంలోని బీజేపీ పెద్దలు ఇక యుద్ధమే అంటూ మాట్లాడుతున్నారని ఈ యుద్ధం ఎవరిపైనో చెప్పాలంటూ ధ్వజమెత్తారు. తెలుగుజాతిపైన చేస్తారా.? అంటూ ప్రశ్నించారు. చేయని తప్పుకు ప్రజలెందుకు శిక్ష అనుభవించాలని అన్నారు. ఏది లేకపోయినా ఉంటాం.. కానీ ఆత్మగౌరవాన్ని చంపుకునే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. బీజేపీ తమిళనాడు తరహా రాజకీయాలు చేయాలని చూస్తోందని రాష్ట్రంలో అవి చెల్లవన్నారు. ఆదివారం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన విళంబి నామ సంవత్సర ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన అనంతరం పుట్టెడు అప్పుతో అమరావతికి వచ్చామని, హైదరాబాద్‌లో ఉండి పరిపాలించే సాగించకుండా అందరిలో ఆత్మస్థైర్యం నింపాలనే ఉద్దేశంతో ఇక్కడి నుంచి బస్సులో ఉండి ప్రారంభించానని చెప్పారు. నాలుగు సంవత్సరాలలో టెక్నాలజీని ఊతంగా చేసుకొని రాష్ట్రాన్ని రెండంకెల వృద్ధి సాధించేలా కృషి చేశామన్నారు. దేశంలో ఏ రాష్ట్రం సాధించని ప్రగతి ఆంధ్రప్రదేశ్ సాధించిందన్నారు. ఈ అభివృద్ధిలో ప్రజలంతా తమ వంతు తోడ్పాటును అందిస్తే, కేంద్రం మాత్రం ఏమాత్రం సహకరించలేదని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టంలోని 18 అంశాలు, పార్లమెంటులో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేంద్రంతో పోరాటానికి దిగామన్నారు. అయితే బీజేపీ మాత్రం యుద్ధం చేస్తానంటోందని, ఈ యుద్ధం ఎవరిపైనో చెప్పాలన్నారు. మోసం చేస్తున్నారని గట్టిగా ప్రశ్నిస్తే తనపై బీజేపీ ఎదురుదాడి చేయిస్తోందని ముఖ్యమంత్రి మండిపడ్డారు. ఒకపార్టీ కేసుల మాఫీ కోసం మరో పార్టీ నాలుగేళ్లు మౌనంగా ఉండి, ఇప్పుడు తనపై విమర్శలు చేస్తోందని ధ్వజమెత్తారు. కేంద్రంలోని బీజేపీ తనపై కొందరిని ఉసిగొల్పుతోందని పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. రాష్ట్ర సమస్యలను పరిష్కరించమని అడగడమే తాము చేసిన తప్పా..? అంటూ ప్రశ్నించారు. చేయని తప్పుకు తెలుగు ప్రజలు శిక్ష ఎందుకు అనుభవించాలో చెప్పాలన్నారు. కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ తమిళ, తెలుగు గౌరవం అంటూ ఎగతాళిగా మాట్లాడారని చివరికి రక్షణ శాఖకు ఇచ్చే నిధులు కూడా అడుగుతారంటూ ఎద్దేవా చేశారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అశాంతిని సృష్టించేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని, వీరి ఆగడాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

ఉగాది మన వారసత్వ పండుగ ..

ఉగాది పండుగ మన సం ప్రదాయమే కాకుండా.. వారసత్వ సంపద అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ప్రపంచమంతా ఇంగ్లీషు క్యాలెండర్‌ను అనుసరిస్తున్న తెలుగుజాతికి ఉగాది నూతన సంవత్సరమని అన్నారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచులు జీవితంలోని వివిధ కోణాలకు ప్రతిరూపమన్నారు. ఉగాది పచ్చడిలో ఉన్న తీపి, పులుపులా తెలుగువారి ఎదుగుదలలో కూడా ప్రస్తుతం కొన్ని అటుపోట్లు ఎదురౌతున్నాయని, అయినా మొక్కవోని ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్ళాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రపంచంలోనే శక్తివంతమైన జాతిగా తెలుగువారికి గుర్తింపు ఉందని, మారుతున్న పరి స్థితులకునుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని అప్పుడే అభివృద్ధి సాధించగలమనే అభిప్రాయాన్ని సీఎం వ్యక్తం చేశారు.

ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటులో ప్రపంచ రికార్డు సాధించాలి

అమరావతి, ఆంధ్రప్రభ: వచ్చే నవంబర్‌నాటికి రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఎల్‌ఈడీ ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని ఇంధన శాఖను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు ఆదేశించారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 9.19 లక్ష ఎల్‌ఈడి వీధిబల్బులను ఏర్పాటుచేసి మన రాష్ట్రం దేశంలోనె అగ్రస్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు. సమీప భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాలలో మరో 15 లక్షల ఎల్‌ఈడి బల్బులను ఏర్పాటుచేయనున్నట్లు ఉగాది సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం విడుదలచేసిన ఒక ప్రకటనలో వివరించారు. రాష్ట్రం మొత్తం మీద 30 లక్షల ఎల్‌ఈడి బల్బులను ఏర్పాటు చేయడం ద్వారా రూ.500 కోట్ల ఆదా చేయవచ్చని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తిచేసి ప్రపంచంలోనే అతిపెద్ద గ్రామీణ ఎల్‌ఈడీ కార్యక్రమాన్ని పూర్తిచేసిన ఘనతను ఆంధ్రప్రదేశ్ దక్కించుకోవాలని అకాంక్షించారు. ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడటమేకాక గ్రామపంచాయతీలకు వచ్చే పది సంవత్సరాల్లో 333 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని ఆయన అన్నారు.



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న పోరాటానికి సరిగ్గా మూడేళ్ళు నిండాయి. మొట్టమొదటి సారిగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి కార్యక్రమానికి 2015 మార్చి 11న శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా అనంతపురం బిఎస్‌యన్‌ఎల్ కార్యాలయం ముందు పికెటింగ్ నిర్వహించినందుకు సీపీఐ రాష్ట్ర కార్యర్శి కె.

హోదా ఉద్యమానికి మూడేళ్ళు

● మూడేళ్ళ క్రితం మార్చి నెలలో అనంతపురం జైలులో నిర్బంధం ● నేడు విజయవాడలో అఖిలపక్షం, ప్రజాసంఘాల సమావేశం

రామకృష్ణతోపాటు మరో ఎనిమిదిని అరెస్టు చేసి, నాన్‌బెయిలబుల్ కేసులు బనాయించి జిల్లా జైల్లో నిర్బంధించడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టడం, అసెంబ్లీలో ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ వాకౌట్ ప్రకటించడం చర్చనీయాంశమైంది. 2015 మార్చి 19న బెయిల్‌పై విడుదల కావటం జరిగింది.

సరిగ్గా మూడేళ్ళ తరువాత అదే రోజు విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం జరగడం యాదృచ్ఛికం. తదుపరి రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్రలు, పాదయాత్రలు బంద్‌లు నిర్వహించడం పరిపాటిగా మారింది. భారతీయ జనతా పార్టీ మినహా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, మేధావులు, విద్యార్థి, యువజన సంఘాలు రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై రోడ్డెక్కాయి. ఢిల్లీ స్థాయి వరకు ఆందోళనలు నిర్వహించినా నరేంద్రమోడీ ప్రభుత్వం ఇప్పటికి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తోంది. సాక్షాత్తు పార్లమెంటులో ప్రకటించిన హామీలను అమలు చేయకపోవడమే కాకుండా కనీసం చట్టపరంగా రావాల్సిన నిధులను కూడా సమకూర్చడం లేదు. ఈ నేపథ్యంలో ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు మార్చి 19న ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో అఖిలపక్షం, వివిధ ప్రజాసంఘాలు సమావేశం కానున్నాయి. ఈ సమావేశంలో విజయవాడ ఐ.వి.రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐయం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి యన్.తులసిరెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శాసన మండలి ప్రతిపక్షనేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, లోక్‌సత్తా రాష్ట్రఅధ్యక్షులు బీశెట్టి బాజ్జి, ఉత్తరాంధ్ర చర్చా వేదిక అధ్యక్షుడు కొణతాల రామకృష్ణ, ఆప్ అధ్యక్షుడు పోతిని.వెంకటరామారావు, సినీ హీరో శివాజి తదితర ఇతర పార్టీల, ప్రజా సంఘాల నేతలు పాల్గొననున్నారు.

రాష్ట్రంలో మావోయిస్టుల స్లీపర్ సెల్స్?




● మణుగూరులో ఒకరిని అరెస్టు చేసిన పోలీసులు ● ఒకవైపు పోలీసుల అణచివేత ● మరో వైపు రిక్రూట్‌మెంట్‌లకు మావోయిస్టుల ముమ్మర యత్నం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంపై పట్టు సాధించేందుకు మావోయిస్టులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారా? పోలీసుల నుంచి ప్రతిఘటన గట్టిగా ఉన్నప్పటికీ మొక్కవోని దీక్షతో ప్రయత్నాలు సాగుతున్నాయా? ప్రస్తుతం ఈ ప్రశ్నలు రాష్ట్రశాఖను తొలుస్తున్నాయి. ఒకప్పుడు తెలంగాణలో బలమైన ఉద్యమాన్ని నిర్మించిన నేతలంతా ప్రస్తుతం పొరుగు రాష్ట్రమైన ఛత్తీస్‌ఘఢ్‌ను కేంద్రంగా చేసుకుని తెలంగాణపై కన్నేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల ఛత్తీస్‌ఘఢ్ సరిహద్దులలో భద్రతా బలగాలకు పట్టుబడ్డ మావోయిస్టులు, స్థానికుల నుంచి వస్తున్న సమాచారం తెలుసుకున్న అనంతరం భద్రతను మరింత పెంచాల్సిన ఆవశ్యకతను గుర్తించారు. ఇప్పటికే రిక్రూట్‌మెంట్‌ల కోసం మావోయిస్టులు రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాలలో స్లీపర్ సెల్స్‌ను నియమించుకున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలలో స్లీపర్ సెల్స్ కీలకంగా పని చేస్తున్నట్లు గుర్తించారు. వీరంతా రహస్యంగా యువతను చేరదీసి ఉద్యమ లక్ష్యం, సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, వివక్షతలను తెలియజేయడంతో పాటు అమరుల ఆశయ సాధన కోసం చేయాల్సిన కృషిని నూరి పోస్తున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో స్లీపర్ సెల్స్ ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. రాష్ట్ర సరిహద్దులలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకోవడంతో పాటు ఛత్తీస్‌ఘఢ్‌లోని మావోయిస్టుల కదలికలను కట్టడి చేసేందుకు అక్కడి పోలీసులకు సహకరించాలని, సిఆర్‌పిఎఫ్ బలగాలకు కూడా తోడుగా ఉండాలని గ్రేహౌండ్స్ బలగాలకు ఆదేశాలు వెళ్ళాయి. కొద్ది రోజుల క్రితం ఖమ్మం జిల్లా చేర్ల సరిహద్దులలో జరిగిన ఎదురు కాల్పులలో 10 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోవడంతో ప్రతీకారేచ్ఛతో రగిలి పోతున్న మావోయిస్టులు కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. రాష్ట్ర సరిహద్దులలో బస్సులకు నిప్పు పెట్టడం, సెల్‌ఫోన్ టవర్లను కూల్చి వేయడంతో పాటు ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరు పౌరులను కూడా హత్య చేశారు. అంతటితో ఆగకుండా ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రంలో సిఆర్‌పిఎఫ్ క్యాంప్‌ను లక్ష్యంగా చేసుకుని మందు పాతర పేల్చి ఎనిమిదిని హత మార్చారు. ఈ ఘటనతో మరింత అప్రమత్తమైన రెండు రాష్ట్రా ల భద్రతా సిబ్బంది మావోయిస్టుల ఏరివేతను మరింత ముమ్మరం చేశారు.

ఒకవైపు పోలీసుల వేట ముమ్మరమవుతున్న తరుణంలో మరో వైపు మావోయిస్టులు రిక్రూట్‌మెంట్‌లను తీవ్రం చేసినట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఆయా ప్రాంతాలలో నియమితులైన మావోయిస్టు స్లీపర్ సెల్స్ ద్వారా కొత్త వారిని ఉద్యమం వైపు ఆకర్షితులను చేసే పని తీవ్రం చేసినట్లు అనుమానిస్తున్నారు. ఖమ్మం జిల్లా మణుగూరు బస్టాండ్ సమీపంలో తచ్చాడుతున్న ఒక మావోయిస్టును ప్రత్యేక పోలీసు బృందం అదుపులోకి తీసుకుంది. స్లీపర్ సెల్స్‌ను కలిసేందుకు అక్కడకు వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పట్టుబడ్డ మావోయిస్టును రహస్య ప్రాంతంకు తీసుకు వెళ్ళి మరింత సమాచారం తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఎంత మంది స్లీపర్ సెల్స్ పని చేస్తున్నారన్న అంశంపై స్పష్టత కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

కేయూ స్వయంప్రతిపత్తికి బ్రేక్

● వరుస సంఘటనలతో కఠిన నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ● వీసీ అధికారాలకు కత్తెర ● విచక్షణ అధికారాలతో ప్రత్యేక అధికారి నియామకం ● వ్యతిరేకిస్తున్న విద్యావేత్తలు ● ఆందోళనలో సిబ్బంది, అధికారులు



హన్మకొండ, ప్రభ న్యూస్: రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు కలిగిన కాకతీయ యూనివర్సిటీ నేడు అధ్వాన పరిస్థితికి దిగజారిందని చెప్పవచ్చు. యూనవర్సిటీలో జరుగుతున్న వరుస సంఘటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. విద్యా వ్యాప్తికి ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయల నిధులు కేటాయించిన నిధులు దుర్వినియోగం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను దిగజారుస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావించినట్లు సమాచారం.రాష్ట్ర ప్రభుత్వం స్వయంపత్తి కల్పించి విశ్వ విద్యాలయాలకు ప్రత్యేక అధికారాలను ఇవ్వడమే కాకుండా అభివృద్ది చెందిన యూనివర్సిటీలను గుర్తించి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం జరిగింది. ఈ నేపథ్యంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిధులు దుర్వినియోగం చేస్తూ సిబ్బంది ఇష్టా రాజ్యాంగా వ్యవహరిస్తున్న మౌనం వహిస్తూ కాలయాపన చేస్తూ యూనివర్సిటీని పాతాలను దిగజార్చేలా అధికారులు ప్రవర్తించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం వీసీలపై ఎన్నిమార్లు హెచ్చరికలు జారీ చేసిన ఎలాంటి మార్పు లేకపోవడంతో ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకురావాల్సి వచ్చిందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. స్వయంప్రతిపత్తి ద్వారా విశ్వ విద్యాలయాలు పూర్తి స్వేచ్ఛను కలిగి ఉండడమే కాకుండా నచ్చిన కోర్సులను రూప కల్పన చేసుకోవడం, అవసరాల మేరకు అధ్యాపకులను నియమించుకోవడం, ప్రవేశాలు నిర్వహించుకోవడం, పరీక్షలు నిర్వహించడం, అధ్యాపకులను అధికారులను నియమించుకోవడం, సిబ్బంది నియామాకాల్లో పూర్తిగా స్వేచ్ఛను కలిగి ఉంటారు. స్వయంప్రతిపత్తి కోల్పోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి వీసీల పని తీరుపై నమ్మకం లేకపోవడంతోపాటు విశ్వాసం లేకనే విశ్వ విద్యాలయాల నిర్వహణ భాద్యతలను ఉన్నత విద్యా మండలికి అప్పగించినట్లుసమాచారం. అంతేకాకుండా కాకతీయ యూనివర్సిటీ నిర్వహణకు సంబంధించిన అన్ని విషయాల్లో పూర్తి పరిజ్ఞానం ఉన్నపదవి విరమణ పొందిన విశ్రాంత అధికారిణి ఆర్థిక అధికారిగా నియమించి అదుపులేకుండా చేస్తున్న ఖర్చును అదుపుచేయాలని భావిస్తున్నట్లు సమాచారం. స్వయం ప్రతిపత్తిని తొలగి ంచినట్లయితే విద్యావ్యాప్తికి కృషి చేయలేకపోవడమే కాకుండా యూనివర్సిటీలో పనిచేస్తున్న సిబ్బంది, అధికారుల్లో ఆత్మస్థైర్యానికి లోనుకాకుండా రాష్ట్రప్రభుత్వానికివ్యతిరేకపవనాలు వచ్చే అవకాశాలు ఉంటుందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైె ఈవిషయంపై యూనివర్సిటీ ప్రాంగణంలో భిన్నమైన చర్చలు జరగడం విశేషం.

బీజేపీతో పొత్తు దురదృష్టకరం

● మంత్రి గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, ప్రభ న్యూస్: భారతీయ జనతా పార్టీతో పొత్తుని వీడి బయటకు రావడం తెలుగు దేశం పార్టీకి మేలు చేస్తుందని ఆ రాష్ట్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. పొత్తు కారణంగా పార్టీ అనేక విధాలుగా నష్టపోయిందని, ఈ నష్టం కూడా ముందుగా ఊహించిందేనని ఆయన భావించారు. ఈ సందర్భంగా విశాఖ ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ భాజపాతో పొత్తునుంచి బయటకు వచ్చేయడంను సమర్ధించుకున్నారు. కేవలం కేంద్రంలో అధికారంలో ఉన్నందున భారతీయ జనతా పార్టీతో మైత్రీబంధం వల్ల కొత్తగా ఏర్పడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రయోజనాలు సాకారం చేసుకునే అవకాశం ఉంటుందనే 2014 సాధారణ ఎన్నికల్లో పొత్తుకు సిద్ధమైనట్లుగా ఆయన వెల్లడించారు. దీని వల్ల తెలుగు దేశం పార్టీ పూర్తిగా నష్టపోయిందని, రాష్ట్రప్రజల ప్రయోజనాల నేపద్యం ప్రధాన లక్ష్యంగా భావించి మళ్లీ ఆ పొత్తు నుంచి బయటకు వచ్చినట్లుగా ఆయన వెల్లడించారు. పొత్తు విషయం ఎలా ఉన్నా కనీసం మానవ ధర్మంగానైనా ఎన్నికల ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు ఎందుకు ప్రయత్నం చేయడం లేదో తెలీడం లేదన్నారు. ఆది నుంచీ ప్రధాని నరేంద్ర మోదీ తీరుపై అనేక అనుమానాలు ఉన్నప్పటికీ ఎప్పటికప్పుడు అవి నిజాలుగా మారుతున్నప్పటికీ కేవలం రాష్ట్రంకు మేలుజరగాలనే సంకల్పంతోనే ఓర్పుని వహించామని చెప్పారు. రాజధాని నిర్మాణ శంకుస్థాపనలోనూ రాష్ట్రంకు సహాయం చెయ్యబోమనే సంకేతాలను క ూడా ఇవ్వని ప్రధాని నరేంద్ర మోదీ తీరు అప్పటికే పలు అనుమానాలను రేకెత్తించిందన్నారు. నాలుగు ఏళ్ల పాటు పొత్తు కలిగి ఉండి, ఎన్‌డీఎ ప్రభుత్వంలో ఉండి ఇంకా మోదీ యుక్తులతో రాష్ట్రం నష్టపోతుందనే నమ్మకం స్థిరపడ్డాక బయటపడ్డామని చెప్పారు. ఈ యూటర్న్ వల్ల తప్పకుండా మేలే జరుగుతుందన్నారు. భారతీయ జనతా పార్టీ ప్రస్తుతం జగన్ మంత్రం జపిస్తుందని మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. భాజపాకు కొత్త భారతీయ జగన్ పార్టీగా భారతీయ జనతా పార్టీ మారిపోయిందని ఆయన అభివర్ణించారు.

కేసీఆర్‌కు 'బాలకాండ' బహూకరణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్ర వాల్మీకి, కవి సార్వభౌమ వాసుదాస స్వామి అనువదించిన వాల్మీకి రామాయణం బాలకాండను ముఖ్యమంత్రి సీపీఆర్‌వో వనం జ్వాలా నరసింహరావు శిష్ట వ్యవహారిక బాషలో అనువదించారు. శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం పేరుతో రూపొందించిన ఈ బాలాకాండ మందర మకరందం రెండవ ప్రచురణ ప్రతిని ఆదివారం ఆయన కేసీఆర్‌కు అందజేశారు. సామాన్యులకు కూడా రామాయణాన్ని అర్థం చేసుకునే విధంగా ఈ పుస్తకం రూపొందించడం అభినందనీయమని ఈ సందర్భంగా సీఎం అన్నారు.

చెరువులో మునిగి ఐదుగురి దుర్మరణం

(మొదటిపేజీ తరువాయి)

కుమారుడు ఖాజా ఇంతాజ్‌అలీ(42) తన కుటుంబంతో గ్రామానికి ఏడు రోజుల క్రితం వచ్చాడు. ఇంతాజ్‌అలీ హైదరాబాద్‌లోని తలాబ్‌కట్టలో నివాసముంటూ ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గ్రామంలో తన బంధువుల ఇంట్లో పెళ్ళి ఉండడంతో కుటుంబంతో వారం క్రితం చేరుకున్నాడు. కాగా ఆదివారం పండగ రోజున ఇంతాజ్‌అలీ తన ఇద్దరు కుమారులు ఇసాఫలీ(12), హైమదలీ(7)తో కలిసి గ్రామంలో ఉన్న చెరువు కట్ట వద్దకు చేపలు పట్టడానికి వెళ్ళారు. వీరితో పాటు ఆదివారం పెళ్ళి వేడుకలకు వచ్చిన ఇంతాజ్‌అలీ బావమరిది మహ్మద్ ఆసీఫ్(28), వదిన కూతురు హుదా(15) కూడా కలిసి వెళ్ళారు. ఈ ఐదుగురితో పాటు బంధువుల పిల్లలు ఫాతిమా, జియాదుల్లా, ఉబేదుల్లా, సుబాన్ కలిసి చేపలు పట్టడానికి వెళ్ళారు. ముందుగా ఇంతాజ్‌అలీ కుమారులు ఇద్దరు, హుదా నీళ్ళలోకి దిగారు. కాగా చెరువులో జెసీబీ గుంతలను తీయడంతో నీళ్ళలోకి మునిగిపోతున్న తరుణంలో అరుపులు విని ఇంతాజ్‌అలీ బావమరిది మహ్మద్ ఆసీఫ్ నీళ్ళలోకి దిగాడు. అయితే వీరెవరికి ఈత రాకపోవడంతో నలుగురు నీట మునుగు తుండగా ఇంతాజ్‌అలీ గమనించి వారిని రక్షించేందుకు నీటిలోకి దిగగా నలుగురు ఇంతాజ్‌అలీని గట్టిగా పట్టుకోవ డంతో రక్షించే వీలులేక నీట మునిగి పోయారు. గట్టుపైన ఉన్న ఫాతిమా, జియాదుల్లా నీటిలోకి దిగబోతుండగా సుబాన్ వారిని రక్షించాడు. కాగా నీటిలో మునిగిన ఐదుగురు మాత్రం నీటి అడుగున మునిగిపోయారు. దీంతో పిల్లల అరుపులు విని గ్రామస్తులు, బంధువులు చెరువు వద్దకు చేరుకొని ఈతగాళ్ళతో వలల సహాయంతో శవాలను బయటకు తీశారు. దీంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడమే కాకుండా నర్సాపూర్ ఎస్ఐ వెంకట్రావ్‌గౌడ్, కౌడిపల్లి ఎఎస్ఐ ఖలీమొద్దీన్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పంచనామా నిర్వహించి శవాలకు పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పాక్ దాడిలో కుటుంబం బలి

జమ్ము: పాక్ దళాలు భారత సరిహద్దు గ్రామాలును లక్ష్యంగా చేసుకుని జరిపిన బాంబుల దాడిలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు వృతి చెందారు. జమ్మూ కాశ్మీర్లోని పూంచ్ సెక్టార్లో పాక్ దాడికి తెగబడిందని, మృతుల్లో ముగ్గురు మైనర్లైన అన్నదమ్ములు ఉన్నారని అధికారులు తెలిపారు. నియంత్రణ రేఖ వెంబడి సరిహద్దు గ్రామాల్లో జనావాసాలపై పాకిస్థాన్ సైన్యం విచక్షణ రహితంగా మోర్టార్ బాంబులతో దాడికి దిగిందని రక్షణశాఖ అధికారులు తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పాక్ సైన్యం ఆదివారం ఉదయం సుమారు నాలుగు గంటలపాటు నిరంతరంగా దాడికి పాల్పడిందన్నారు. ఈ దాడిలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మరణించగా మరో ఇద్దరు అక్కాచెల్లెలు తీవ్రంగా గాయపడ్డారన్నారు. వీరిని హుటాహుటిన వాయుమార్గంలో జమ్ములోని ఆసుపత్రికి తరలించామన్నారు. భారత దళాలు పాక్ దాడిని సమర్థంగా ఎదుర్కొని తిప్పికొట్టాయని ఆర్మీ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ విలేఖరులకు తెలిపారు. ఈ సందర్భంగా జమ్ము కాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ పాక్ దాడిలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవటంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను కాపాడుకోవాలంటే ముందుగా శాంతిని నెలకొల్పాలన్నారు. కాశ్మీర్ డీజీపీ వాయిద్ ట్విటర్ వేదికగా మాట్లాడుతూ పూంచ్ సెక్టార్లోని బాలాకోట్‌లో పాక్ దాడిలో ఒకే కుటుంబంలో ఐదుగురు మరణించారని, మరో ఇద్దరు గాయపడగా వారిని ఆసుపత్రికి తరలించామని తెలిపారు. స్థానిక అధికారులు బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో సంఘటన ప్రాంతానికి చేరుకోగా అప్పటికే కాల్పులు ఆగిపోయాయని అధికారులు పరిస్థితి సమీక్షించి ప్రజారక్షణకు తగిన చర్యలు తీసుకున్నారన్నారు. పాకిస్థాన్ సైన్యం పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం పిరికిపంద చర్య అని రక్షణశాఖ అధికారులు తెలిపారు.



స్థానిక సంస్థలపై నిర్లక్ష్యం వద్దు

వెంకయ్యనాయుడు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 60 ఏళ్ల తర్వాత కూడా గ్రామీణ వ్యవస్థ బలోపేతం కాక పోవడానికి గల కారణాలను విశ్లేషించుకుని పార్లమెంట్‌తో పాటు అన్ని సంస్థలు ముందుకు సాగాలని ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. పరిపాలనలో మార్పు అనేది ముందుగా ఎంపీ, ఎమ్మెల్యేల ద్వారానే కోరారు. ఉన్నత ప్రమాణాలు నిలబెట్టేందుకు చట్ట సభలు సారథ్యం వహించాలని విజ్ఞప్తిచేశారు. ఆదివారం ఇక్కడ ముచ్చింతలలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో స్వరాజ్యం నుంచి సురాజ్యం వరకు అనే అంశంపై జరిగిన జాతీయ సంప్రదింపుల సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, గ్రామీణ , పట్టణ సంస్థల బలోపేతం కోసం తీవ్రంగా కృషి జరగాల్సిన అవసరం ఉందన్నారు. వాటిని పరిపుష్టం చేసేందుకు పరిపాలనలో రాడికల్ ఛేంజ్ అవసరమని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల బలోపేతం కోసం రాజ్యాంగంలోని 73, 74 ఆర్టికల్స్ సవరణ జరిగిందని చెప్పారు. అధికారాల బదలీల కోసం రాజ్యాంగ సవరణ చేపట్టినప్పటికీ ఆ దిశలో ప్రభుత్వాలు ఆలోచించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మార్పులు అనేవి వ్యవస్థలోనే పొందుపర్చారని, వాటిని వినియోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చున్నారు.

ప్రజాస్వామ్యంలో హింసకు తావేలేదని మహాత్మాగాంధీ చెపిన విషయాలను ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి ఉదహరించారు. హింసను ప్రేరేపించేవిధంగా మాట్లాడడం, కార్యక్రమాలు చేపట్టడం సరికాదని వ్యాఖ్యానించారు. ఆనాడు స్వరాజ్యం దేశం సమరయోధులు త్యాగాలు చేశారని, ఇప్పుడు సురాజ్యం కోసం సమైక్యంగా కదలిరావాలని పిలుపునిచ్చారు. పల్లెలు, పట్టణాల పరిపుష్టి కోసం అధికారాల వికేంద్రీకరణ, పంపణీ, అభివృద్ధి జరగాలని సూచించారు.

గ్రామీణాభివృద్ధికి రూ. 2,00,292 కోట్ల బదలీ – తోమర్

ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో గ్రామీణాభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, 2015 -20 కి సంబంధించి రూ. 2,00, 292 కోట్లను బదలీ చేయడం జరిగిందని కేంద్ర పంచాయతిరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ వెల్లడించారు. గత ఐదేళ్లలో కేవలం రూ. 60,000 కోట్లు మాత్రమే విడుదల చేశారని చెప్పారు. గ్రామ స్థాయిలో నిధులు సక్రమంగా వినియోగించేందుకు పర్యవేక్షణ అవసరమని అన్నారు.



గడచిన కొన్నేళ్లుగా స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులను ఇతర వాటికి మళ్లించినందువల్ల ఈ సంస్థలు బలహీన పడ్డాయని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ ఎస్ పురి విమర్శించారు. స్థానిక పన్నులు ఎక్కడిక్కడే వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపిఎ) అధికారి సమన్వయకర్తగా వ్యవహరించారు. నీతీ అయోగ్ వైస్ చైర్మన్ అశోక్ జైన్, ఎపి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డి, తెలంగాణ పురపాలకశాఖ డైరెక్టర్ టి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ భూముల విక్రయం..!

(మొదటిపేజీ తరువాయి)

పాటు మరో 24 కొత్త పథకాలను ప్రకటించిన సీఎం కేసీఆర్ వాటి అమలుకు నిధులు పెద్ద ఎత్తున అవసరం కాగా, అందుకు ప్రభుత్వ భూములను వేలం వేయాలన్న ప్రతిపాదనకు వచ్చినట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఈ వేలం అంశాన్ని సీఎం కార్యాలయం సంబంధిత అధికారులకు సమాచారం అందించడంతో వారు వేలానికి సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. విక్రయానికి అవసరమైన భూములను గుర్తించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రి-భువనగిరి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు సమాచారం. ఈ జిల్లాల నుంచి వివరాలు అందిన వెంటనే తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక అభివృద్ధి సంస్థ (టీఎస్ఐఐసీ) ద్వారా ఆన్‌లైన్‌లో భూములను ప్రభుత్వం విక్రయించనుంది. ఇప్పటికే వార్షిక బడ్జెట్‌ను శాసనసభకు సమర్పించిన ప్రభుత్వం, ప్రభుత్వ భూముల విక్రయం ద్వారా కనీసం రూ.300 కోట్ల రూపాయలు సమీకరించాలని ప్రతిపాదించింది. హైదరాబాద్ మహానగరం చుట్టూ ఆనుకుని ఉన్న జిల్లాలలో నిరుపయోగం, ప్రభుత్వానికి ఉపయోగపడని భూములను గుర్తించి విక్రయించాలని భావిస్తోంది. అందుకు అనుగుణంగా భూములను గుర్తించాలని ఆదేశించింది. రెవెన్యూశాఖ



ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి భూముల విక్రయానికి సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లకు, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. కలెక్టర్ల నుంచి వివరాలు అందాక ఆ భూముల వివరాలను టీఎస్ఐఐసీ వెబ్‌సైట్‌లో పొందుపర్చి బహిరంగ వేలం ద్వారా వీటిని విక్రయిస్తారు. భూములను విక్రయించి, వాటి ద్వారా వచ్చే ఆదాయంతో కొత్త పథకాల రూపకల్పనకు శ్రీకారం చుట్టడంతో పాటు ఇప్పటికే అమలు చేస్తున్న వాటికి ఈ మొత్తాన్ని ఖర్చు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆదాయార్జన కోసం రాష్ట్ర ప్రభుత్వం 2015వ సంవత్సరంలో భూముల విక్రయానికి అనుమతినిచ్చింది. ప్రభుత్వ ఆదేశానుసారం నిరుపయోగంగా ఉన్న భూములను గుర్తించి వాటిని విక్రయిస్తూ వచ్చారు. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో ఇప్పటివరకూ నాలుగు దఫాలుగా ఈ భూములను విక్రయించారు. ఈ నాలుగు విడతలలో 82 ఎకరాల 12 గుంటల భూమిని విక్రయించినట్లు అధికారులు చెప్పారు. ఈ భూముల విక్రయం ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.1163 కోట్ల 75 లక్షల రూపాయలు ఆదాయం సమకూరింది. వాస్తవానికి భూముల విక్రయం ద్వారా ప్రభుత్వానికి ఇంతకన్నా ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ పెద్ద నోట్ల రద్దు ప్రభావంతో ఆశించినంతగా రాలేదని అధికారులు తెలిపారు. ఈ విడత భూముల వేలానికి కొనుగోలుదారుల నుంచి స్పందన బాగుం టుందని, తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ, తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన పెట్టుబడిదారులు తాజా భూముల కొనుగోలులో పాలుపంచుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం వేలం ద్వారా విక్రయించిన భూముల్లో అత్యధికంగా రాయదుర్గంలో ఎకరా భూమి రూ.29 కోట్ల 28 లక్షల ధర పలికింది. రాయదుర్గంతో పాటు మణికొండ, కోకాపేట, ఖానామెట్, షేక్‌పేట, ఐడీఏ బొల్లారం, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఘట్‌కేసర్ తదితర ప్రాంతాల్లోని భూములు విక్రయించే అవకాశం కనిపిస్తోంది.

నేటినుంచి పద్దులపై చర్చ

మూడు రోజుల విరామం తర్వాత సమావేశాలు

ఆంధ్రప్రభ, హైదరాబాద్ : మూడు రోజుల విరామం, నాటకీయ పరిణామాల తర్వాత శాసనసభ, శాసనమండలి సమావేశాలు నేడు ప్రారంభం కానున్నాయి. ఈనెల 12న గవర్నర్ ఉభయసభల నుద్దేశించి చేసిన ప్రసంగంతో శాసనసభా, మండలిల బడ్జెట్ సమావేశాలు ఆరంభమైన సంగతి తెలిసిందే. 12న ఆయన ప్రసంగం తర్వాత వాయిదా పడిన ఉభయసభలు 13, 14న సమావేశమై గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానంపై చర్చించాయి. అయితే తొలిరోజు జరిగిన రసాభాసలో మండలి చైర్మన్ స్వామీగౌడ్ కంటికి గాయం కావడం, మరుసటి రోజు శాసనసభ ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి ఇద్దరు కాంగ్రెస్ సభ్యుల సభ్యత్వాల రద్దుతోపాటు, మరో 11 మందిపై సమావేశాల మొత్తానికి సస్పెన్షన్ వేటు వేసింది. ఆ తర్వాత ఈనెల15న ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్ శాసనసభలో ఐదో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సభ్యుల పరిశీలన నిమిత్తం ఒక రోజు(16)న సెలవు ఇవ్వడం అనివార్యంకాగా 18న ఉగాది పర్వదినం పురస్కరించుకుని 17, 18 తేదీలలో సమావేశాలకు సెలవులను ప్రకటించారు. బీఏసిలో నిర్ణయించిన మేరకే సెలవుల తర్వాత నేటినుంచి సభ పునః ప్రారంభం కానుంది. నేటినుంచి వరుసగా పద్దులపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఒక్కో రోజు రెండు మూడు పద్దులపై చర్చకు అవకాశం ఇచ్చేందుకు ప్రభుత్వం బీఏసిలో నిర్ణయం తీసుకుంది. అన్ని పక్షాలు, సభ్యులకు అవకాశం ఇవ్వడంతోపాటు, ప్రభుత్వ పథకాలపై సీఎం కేసీఆర్ కీలక ప్రకటనలను కూడా సభా వేదికగా చేసేందుకు అవకాశం ఉంది. ఎన్ని రోజులు సభ నిర్వహించాలనే అంశంపై మరోసారి బీఏసి భేటీ అయి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ఫ్రంట్ కాదు... స్టంట్

కేసీఆర్‌పై మండిపడ్డ తెలంగాణ కాంగ్రెస్ నేతలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఎన్డీయే, యూపీఏ కూటములకు ప్రత్యామ్నాయంగా తెలంగాణ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్రావు తెరపైకి తెచ్చిన థర్డ్ ఫ్రంట్‌పై తెలంగాణ కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. ఏఐసీసీ ప్లీనరీలో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన నేతలు, సమావేశాల చివరి రోజు టీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఈ మధ్యనే కాంగ్రెస్‌లో చేరిన రేవంత్ రెడ్డి, కేసీఆర్ ఫ్రంట్ ప్రయత్నాలను ఒక స్టంట్‌గా అభివర్ణించారు. నిజానికి ప్రధాని మోడీ, సీఎం కేసీఆర్ ఇద్దరూ కవల పిల్లలని, పరస్పర అవగాహనలో భాగంగానే ఈ థర్డ్ ఫ్రంట్ తెరపైకి వచ్చిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఈ ఫ్రంట్ ద్వారా వ్యతిరేక ఓటును చీల్చడమే వారి లక్ష్యమని, తద్వారా ఎన్డీయేకు లాభం చేకూర్చడమే వారి ధ్యేయమని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా, మోడీకి సహకరించే ఎత్తుగడలో ఈ ఫ్రంట్ ఒక భాగమని ఆరోపించారు. ప్రధాని మోడీ కేసీఆర్ వెనకాల ఉండి ఈ థర్డ్ ఫ్రంట్



డ్రామా నడిపిస్తున్నారని ఆరోపించారు. ఈ ఇద్దరికీ ఎం.ఐ.ఎం పార్టీ కూడా సహకరిస్తుందని దుయ్యబట్టారు. తెర ముందు కనిపించేది కేసీఆరే అయినప్పటికీ, తెర వెనుక నడిపించేది మాత్రం మోడీయేనని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ ఇద్దరి నాటకాన్ని ప్రజలు గమనిస్తు న్నారని ఆయనన్నారు. నాలుగేళ్లుగా ప్రజలు ఎంతో ఓపికగా భరిస్తున్నారని, సమయం చూసి తగిన బుద్ధి చెబుతారని రేవంత్ వ్యాఖ్యానించారు. ఎన్డీయే కూటమిలో ఉన్నవారంతా ఒక్కొక్కరుగా బయటికొ స్తున్నారని, నమ్మించి మోసం చేయడంలో మోడీ దిట్ట అని రేవంత్ మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మోడీ ఇలాగే మోసగించారని దుయ్యబట్టారు. ఉగాదితో మొదలైన ఈ ఏడాదిని ఎన్నికల నామ సంవత్సరంగా పేర్కొంటూ, పాదయాత్ర ద్వారా ప్రజలకు దగ్గరవుతామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేసీఆర్‌కు విశ్వసనీయత లేదని రేవంత్ రెడ్డి అన్నారు. మరో సీనియర్ నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చాక ఆయన తీసుకున్న నోట్ల రద్దు, జీఎస్టీ వంటి నిర్ణయాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఓవైపు పెట్రోల్ ధరల పెరుగుదల, మరోవైపు రైతుల పంటకు మద్దతు ధర లేకపోవడంతో సామాన్యుడు అష్టకష్టాలు పడుతున్నాడని ఆయన విమర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ నుంచి 16 ఎంపీ సీట్లు గెలిచి తెలంగాణ రాష్ట్రమిచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకుంటామని కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు.

నియంతలా పాలిస్తున్న కేసీ ఆర్‌ను ఓడించడమే తమ లక్ష్యమని, రాష్ట్రంలో 100 అసెంబ్లీ సీట్లు సాధిస్తామని ప్రకటించారు. థర్డ్ ఫ్రంట్ అంటున్న సీఎం కేసీఆర్, మోడీ ప్రభుత్వంపై అవిశ్వాసానికి ఎందుకు మద్ధతివ్వలేదని నిలదీశారు.

భద్రాద్రిలో ఘనంగా తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు



భద్రాచలం, ప్రభ న్యూస్ : దక్షిణ ఆయోధ్యగా బాసిల్లుతున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 26న స్వామివారి కళ్యాణం, 27న స్వామివారికి వైభవంగా పట్టాభిషేకం నిర్వహించనున్నారు. స్వామివారు అవతరించిన విళంభి నామ సంవత్సరం కావడంతో ఈ ఉత్సవాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఇందులో భాగంగా ఉదయం స్వామివారికి అభిషేక తిరుమంజనం నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకుని రామాలయంలో స్వామివారికి వేప పూత ప్రసాద వినియోగం చేశారు. ఈ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఆదివారం రాత్రి జరిగిన పంచాంగ శ్రవణానికి భక్తులు భారీగా తరలివచ్చారు. వేదపండితులు చెన్నావజ్జల వేంకటేశ్వర ఆవదాని పంచాంగ శ్రవణం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు.

అమరావతిలో ఇంటర్నేషనల్ జూ పార్క్

అమరావతి, ఆంధ్రప్రభ: నవ్యాంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతి ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధానిగా నిర్మించాలన్న నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయిలో జంతు ప్రదర్శన శాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వెయ్యి ఎకరాల సువిశాల విస్తీర్ణంలో జంతు ప్రదర్శన శాల నిర్మించేందుకు అటవీ శాఖ అధికారులు భూ సేకరణ నిమిత్తం అన్వేషణ సాగిస్తున్నారు. భూసేకరణ వేగవంతం చేసి స్థల సేకరణ పూర్తికాగానే జంతు ప్రదర్శన శాల నిర్మాణం చేపట్టాలని ఇటీవల సచివాలయంలోమంత్రి సిద్ధా రాఘవరావు అధ్యక్షతన జరిగిన జూ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) సమావేశంలో చర్చించారు. అలాగే రాష్ట్రంలోని జంతు ప్రదర్శన శాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జంతు ప్రదర్శన శాలలను సందర్శించే సందర్శకుల సౌకర్యార్థం మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడంతోపాటు ప్రతి జూలో జూ ప్రాముఖ్యత, అందులో ఉన్న జంతుజాలాల గురించి వివరించేందుకు ఒక మినీ థియేటర్ ను ఏర్పాటు చేయనున్నారు.

రాష్ట్రంలోని ప్రధానమైన విశాఖపట్నం, తిరుపతిలలో మినీ థియేటర్లను వెంటనే ఏర్పాటుకు అటవీ శాఖ కార్యాచరణ రూపొందించింది.విశాఖ, తిరుపతి జంతు ప్రదర్శనశాల ప్రవేశ టిక్కెట్, బ్యాటరీ వాహనాల ధరలను పెంచేందుకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రూ.10 నుంచి 20కి, బ్యాటరీ ఆపరేటెడ్ వాహనాల్లో జంతు ప్రదర్శనశాల చుట్టు తిరగడానికి చార్జీని రూ.30 నుంచి 60లకు, లైన్, టైగర్ సఫారీ చార్జీ రూ.25 నుంచి 50కి, అలాగే చిన్నపిల్లలకు రూ.20 పెంచుతూ జాప్ నిర్ణయం తీసుకొంది.





లక్నో: త్రిపుల్ తలాక్‌పై వేర్వేరు వేదికలపై జరిగిన చర్చా కార్యక్రమంలో అనుకూల, వ్యతిరేక నినాదాలు చేస్తున్న ముస్లిం మహిళలు

హోదా కోసం మౌనదీక్ష

రాజ్‌ఘాట్ వద్ద ఏపీ కాంగ్రెస్ నేతల నివాళి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా అమలు చేయాలంటూ ఆ రాష్ట్ర కాంగ్రె స్ నేతలు ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద మౌనదీక్ష చేపట్టా రు. పీసీసీ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు డా. కేవీపీ రామచంద్ర రావు, గిడుగు రుద్రరా జు, వట్టి వసంత్ కమార్, కనుమూరి బాపి రాజు, మాజీ మంత్రి కిల్లి కృపారాణితో పాటు ఏఐసీసీప్లీనరీ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన నేతలంతా ఈ దీక్షలో పాల్గొన్నారు. ఉదయం గం. 8.00 నుంచి గం. 9.00 వరకు గంటసేపు మౌనదీక్ష చేసిన అనం తరం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటుందని ఈ సందర్భం గా నేతలంతా చెప్పారు. ప్రత్యేక హెూదా అన్నది కేవలం తమ హామీ కాదని, నిజానికి హెూదా కల్పిస్తూ నాటి తమ యూపీఏ ప్రభుత్వం నిర్ణయం కూడా తీసుకుందని గుర్తు చేశారు. అయితే తర్వాత వచ్చిన ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని అమలు చేయకుండా సాకులు చెబుతోందని దుయ్యబట్టారు. తదుపరి మళ్లీ యూపీఏ సర్కారే అధికారంలోకి వస్తుందని, హెూదా

సహా విభజన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేస్తుందని చెప్పుకొచ్చారు. తమ నేత రాహుల్ గాంధీ తొలి సంతకమే ప్రత్యేక హెూదా ఫైల్ మీద చేస్తానన్న మాటను కాంగ్రెస్ నేతలు గుర్తుచేశారు.

హోదా తీర్మానం తెలుగు ప్రజలకు ఉగాది కానుక: రఘువీరా రెడ్డి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా సహా విభజన హామీలన్నీ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ చేసిన తీర్మానం చేయడం 5 కోట్ల ఆంధ్ర ప్రజలకు ఇచ్చి న ఉగాది కానుక అని పీసీసీ చీఫ్ రఘువీరా రెడ్డి అన్నా రు. మౌనదీక్ష విరమించిన తర్వాత అక్కడే మీడియాతో మాట్లాడుతూ సన్నకారు రైతులందరికీ రుణమాఫీతో పాటు, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం లక్ష్యం గా తమ పార్టీ లక్ష్యాలని తెలిపారు. 2019లో బీజేపీ యేతర శక్తులన్నింటినీ కూడగట్టి, కాంగ్రెస్ ప్రభుత్వంలోని యూపీఏ కూటమి అధికారంలోకి రావాలని తీర్మానం చేసినట్టు ఆయన చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా అమలయ్యే వరకు అవిశ్రాంతంగా పోరాడా లని రాజ్‌ఘాట్ సాక్షిగా ప్రతిజ్ఞ చేశామని ఆయన తెలిపారు.

రాజ్యసభలో పోరాటం కొనసాగిస్తా: కేవీపీ

ప్రత్యేక హెూదాతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని, అసలు హెూదా ఒకటి ఉందనే విషయాన్నే మరచి పోయిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు, ఇప్పుడు ప్రత్యేక హెూదా పోరాటానికి ఛాంపి యన్‌ని అంటూ ముందు కొస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు డా. కేవీపీ రామచంద్ర రావు ఎద్దేవా చేశారు. మౌనదీక్షలో పాల్గొన్న ఆయ న అనంతరం మీడియాతో మాట్లాడుతూ చంద్ర బాబు తీరును తప్పుబట్టారు.

మొదటి నుంచి హెూ దా కావాలన్న తమను ద్రోహులుగా చిత్రీకరించి, గుంటూరు సభకు వచ్చిన రాహుల్ గాంధీ కాన్వాయ్‌పై దాడులు కూడా చేయించారని ఆరోపించారు. హెూదా కోసం పోరాడుతున్న తమను అరెస్టులు కూడా చేశారని గుర్తుచేశారు. ప్రజలేమీ అమాయకులు కాదని, వాస్తవాలన్నీ ప్రజలకు తెలుసునని కేవీపీ అన్నారు.

యువ భారత్‌కు సరికొత్త విజన్ చూపిస్తా!





(మొదటిపేజీ తరువాయి)

వెళ్లా. మేము దేశం కోసం ప్రాణాలిచ్చాం.. మాకు దేశభక్తిదం తెలియదు" అంటూ ఉద్వేగపూరితంగా రాహుల్ గాంధీ ప్రసంగించారు. మోడీపై దేశ ప్రజలకు నమ్మకం పోయిందని అన్నారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులను మార్చే శక్తి యువతకు ఉందని కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. నేతలకు, కార్యకర్తలకు మధ్య ఉన్న గోడల్ని బద్దలుకొట్టడమే తన మొదటి కర్తవ్యమని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు టికెట్ దొరుకుతుందని వారిలో ఆశలు చిగురింపజేశారు. తమ ప్రభుత్వం వస్తే అది రైతు ప్రభుత్వంగా ఉంటుందని అన్నారు. దేశవ్యాప్తంగా రైతుల కోసం ఫుడ్ పార్కులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గతంలో రూ. 70వేల కోట్లు రుణమాఫీ చేసినట్టుగా, రైతులకు అండగా ఉంటాం అని ప్రకటించారు. విద్య అందరి హక్కు అన్న రాహుల్ గాంధీ, దేశంలో ఐఐటీలు, ఐఐఎంలు అవసరాలు తీర్చడం లేదని, వాటి సంఖ్యను పెంచి ఉన్నత విద్యను బలోపేతం చేస్తామని రాహుల్ గాంధీ అన్నారు.

తిరుపతి హుండీ ఉద్యోగులు నయం
మీకంటే వేగంగా నోట్లు లెక్కిస్తారు: చిదంబరం

ఆర్థిక వ్యవహారాలపై మాట్లాడిన మరో సీనియర్ నేత చిదంబరం ఎన్డీయే సర్కారుపై విమర్శనాస్త్రాలు సంధించారు. మోడీ సర్కార్ పెద్ద నోట్ల రద్దు నిర్ణయం ఓ బూటకమని అన్నారు. నల్లధనం ఏమేరకు వెనక్కి వచ్చిందనే విషయంపై ఆర్బీఐ ఇప్పటికీ లెక్కలు చెప్పలేదని, ఇంకా లెక్కిస్తూనే ఉందని ఎద్దేవా చేశారు. "మీరు ఎందుకు తిరుపతి హుండీ ఉద్యోగుల దగ్గరకు వెళ్లకూడదు? మీ కంటే వాళ్లు వేగంగా డబ్బులు లెక్కిస్తారు" అంటూ ఆర్బీఐకి చురకలు వేశారు. తాను ప్లీనరీ ముందుకు వచ్చి మాట్లాడతానని, ఆర్థిక తీర్మానం సమర్పిస్తానని కొందరు అనుకుని ఉండక పోవచ్చని, అయితే తనకు అలాంటి బలం ఇక్కడున్న ప్రతీవారి నుంచి వచ్చిందని చెప్పారు. తనలోని దృఢ సంకల్పానికి కాంగ్రెస్ పార్టీతో ఉన్న 45 ఏళ్ల అనుబంధమే కారణమని అన్నారు.

బెడిసికొట్టిన మోడీ విదేశాంగ విధానం: ఆనంద్ శర్మ

విదేశాంగ విధానంపై తీర్మానం ప్రవేశపెట్టిన సీనియర్ నేత ఆనంద్ శర్మ మాట్లాడుతూ ప్రధాని మోడీ సొంత ప్రచారానికే పరిమితమవుతున్నారని విమర్శించారు. ప్రపంచ దేశాలతో సరైన సంబంధాలు నెరపడం లేదని, ఇది చాలా ఆందోళన కలిగిస్తోంది ఆరోపించారు. ఆదివారం జరిగిన కాంగ్రెస్ ప్లీనరీ రెండవరోజు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మన వ్యూహాత్మక భాగస్వాములు, సరిహద్దు దేశాలతో ఏమాత్రం సంబంధాలు సజావుగా సాగడం లేదని అన్నారు. నాలుగేళ్లుగా భారతదేశ విదేశాంగ విధానానికి మోడీ ప్రభుత్వం విఘాతం కలిగిస్తోందని అన్నారు.

ప్లీనరీ వెనుక ప్రియాంక గాంధీ: యాష్కీ

నూతనోత్సాహం, నూతన విధానాలతో రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా ప్లీనరీ సమావేశాలు జరిగాయి.ప్లీనరీ సమావేశాల్లో తెర వెనుక ప్రియాంకా గాంధీ కీలక పాత్ర పోషించారు. సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు మధ్య దూరాన్ని తగ్గించేలా అడ్డుగోడలను తొలగిస్తామని రాహుల్ తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహం నింపేలా రాహుల్ ప్రసంగం ఉంది. ఇవి పక్కా రాహుల్ మార్క్ కనిపించే విధంగా జరిగిన సమావేశాలు. భవిష్యత్‌లో కాంగ్రెస్ సామాన్య కార్యకర్తలకు పెద్ద పీట వేస్తుంది. కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రావాలంటే ఆలోచనా విధానంలోనూ, సీడబ్ల్యూసీ విధానంలోనూ మార్పు రావాలి. రాహుల్ అనుకున్నది చేసి చూపిస్తారు. మోడీ ప్రభుత్వం అవినీతిపరులకు కొమ్ముకాస్తోంది. రైతాంగానికి, యువతకు భరోసా కల్పించేలా కాంగ్రెస్ విధానం ఉండబోతోంది. భారత విధానాన్ని రూపొందించేందుకు రాహుల్ గాంధీ దేశ యువతను ఆహ్వానించారు.

భవిష్యత్ రాజకీయాల్లో మార్పు: శ్రీధర్ బాబు

కొత్త తరం రాజకీయ భవిష్యత్ దేశానికి అందించేలా ప్లీనరీ సమావేశాలున్నాయి. యువతకు, అట్టడుగు వర్గాలకు, మైనారిటీలకు, అందరికీ దేశ సంపదను సరైన రీతిలో చేర్చేలా, కాంగ్రెస్ భవిష్యత్ ఏవిధంగా ఉండాలనే విధంగా ప్లీనరీ జరిగింది. ఎన్డీఏ వైఫల్యాలను ప్రజలకు తెలియజేసేలా, కాంగ్రెస్‌ను బలపరిచేలా తీర్మానాలు చేశాం. కాంగ్రెస్ భవితవ్యం కోసం రాహుల్ యువతకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

మార్పునకు అంకురార్పణ: రఘువీర

2030 నాటికి భారతదేశం ఏ విధంగా ఉండాలనే దానికి 2019 ఎన్నికల నుండి అంకురార్పణ జరగబోతోంది.దేశాన్ని పట్టి పీడిస్తున్న నిరుద్యోగ సమస్యను తొలగిస్తానని రాహుల్ యువతకు భరోసా ఇచ్చారు.ప్రతీ రైతు తల ఎత్తుకుని లాభసాటి వ్యవసాయం చేసుకునేలా పరిస్థితులు రూపొందిస్తామని చెప్పారు.రాజ్యాంగబద్ధ సంస్థలను కాపాడతానని భరోసా ఇచ్చారు. రాహుల్ పదవుల కోసం ఆశ పడే వ్యక్తి కాదు.2019లో ఎర్రకోటపై రాహుల్ గాంధీ ప్రధానిగా మువ్వన్నెల జెండాను ఎగురవేస్తారు.

అర్థవంతంగా ముగిసిన ప్లీనరీ: కేవీపీ

భారతదేశంలో యువతకు ఉన్న ప్రాధాన్యం గురించి రాహుల్ చాలా స్పష్టంగా చెప్పారు. 2019లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు యువత సిద్ధంగా ఉంది. రాజకీయ తీర్మానంలో ఏపీకి ప్రత్యేక హోదాను చేర్చడం సంతోషం.

ప్రత్యేక వాతావరణంలో ప్లీనరీ: కనుమూరి

నలభయ్యేళ్ళుగా ప్లీనరీలకు హాజరవుతూనే ఉన్నాను. ఈసారి ప్రత్యేక వాతావరణంలో ప్లీనరీ సమావేశాలు అద్భుతంగా జరిగాయి. రాహుల్‌లో ప్రధాని అయ్యే లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నాయకులకు, కార్యకర్తలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు అడ్డుగోడలను తొలగిస్తానని రాహుల్ ప్రకటించడం ఆనందదాయకం.

రాబోయే రోజుల్లో మంచి ఫలితాలు: నాదెండ్ల

దేశాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి యువకులకు కాంగ్రెస్ ప్రాధాన్యతను ఇస్తుంది. ఆర్థిక వ్యవస్థ పరిస్థితులు మార్చేలా, ఉపాధి కల్పించేలా కాంగ్రెస్ భవిష్యత్ కార్యాచరణ ఉండబోతుంది. అన్నిపార్టీలను కలుపుకుని 2019లో విజయం సాధించేలా కాంగ్రెస్ భవిష్యత్తు కార్యాచరణ ఉంటుంది. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలు సాధిస్తుంది

విద్వేషాలు పెరిగాయి: సి. రామచంద్రయ్య

కాంగ్రెస్ ప్లీనరీలో ఆర్థిక వ్యవస్థ, విదేశీ విధానం, రాజకీయ పరిస్థితులపై తీర్మానాలు చేశాం. మోడీ పాలనలో దేశంలో వృద్ధి రేటు పడిపోయింది. ప్రజల తలసరి ఆదాయం తగ్గిపోయింది. దేశంలో నిరుద్యోగం పెరిగింది. ఎన్డీఏ ప్రభుత్వం ప్రజాపాలనలో వైఫల్యం చెందింది. నాలుగేళ్ళలో ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదు. కుల మత విద్వేషాలు పెరిగాయి. లౌకిక వ్యవస్థ దెబ్బ తినేపరిస్థితి నెలకొంది. దేశంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులు మారాలంటే లౌకిక పార్టీలు అధికారంలోకి రావాలి.



ఆర్థికంగా అధోగతి: మన్మోహన్

న్యూఢిల్లీ: ప్లీనరీ వైదికపై మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక పరిస్థితిపై విమర్శల వర్షం కురిపించారు. కాశ్మీర్ సమస్యపై మోడీ సర్కార్ అనుసరిస్తున్న విధానాన్ని సైతం ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. అధోగతికి చేరిన దేశ ఆర్థిక పరిస్థితి మోడీ సర్కార్ వైఫల్యానికి అద్దంపడు తోందని ఘాటుగా విమర్శించారు.

మోడీ ప్రభుత్వం అనుసరించిన జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు నిర్ణయాలతో దేశ ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కోల్పోయారని దుయ్యబట్టారు. పేదరికం, వ్యాధులు, నిరుద్యోగం వంటి సమస్యలను సరిదిద్ది, మళ్లీ పట్టాలెక్కించాలంటే కాంగ్రెస్‌కు పెద్ద సవాలుగా మారుతుందని వ్యాఖ్యానించారు. ఉద్యోగాల కల్పనలో మోడీ సర్కారు ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన మోడీ, కనీసం 2 లక్షల ఉద్యోగాలు కూడా కల్పించలేకపోయారని విమర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వైద్యుల మృతి

మధుర: యమున ఎక్స్‌ప్రెస్ హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎయిమ్స్ (ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)కు చెందిన ముగ్గురు వైద్యులు మరణించగా, మరో నలుగురు వైద్యులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. ఎయిమ్స్ అత్యవసర విభాగానికి చెందిన ఏడుగురు వైద్యుల బృందం వాహనంలో ఢిల్లీ నుంచి ఆగ్రాకు వెళుతుండగా కంటైనర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. డాక్టర్ హర్షద్ వాంఖడ్ పుట్టినరోజు వేడుకలు జరుపుకొనేందుకు వీరు వెళుతుండగా ప్రమాదం జరిగి ముగ్గురు వైద్యులు సంఘటన ప్రాంతంలోనే ప్రాణాలు కోల్పోయారన్నారు. కాగా ప్రమాదంలో డాక్టర్ హర్షద్ కూడా మరణించారన్నారు. ఈ దుర్ఘటనలో గాయపడిన మరో నలుగురు వైద్యులను ఆసుపత్రికి తరలించామని ఎస్పీ ఆదిత్య కుమార్ శుక్లా తెలిపారు. కాగా మరణించిన వైద్యులు యశ్‌ప్రీత్ కాత్వాల్(25), హిమబాల(25), వాంఖడ్ (35)గా గుర్తించామన్నారు. ప్రమాదంలో డాక్టర్లు అభినవ్ సింగ్, ఛత్రీన్ హలామ్, మహేశ్ కుమార్, జితేంద్ర మౌర్య గాయపడగా వీరు ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నారన్నారు. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలకడగానే ఉందన్నారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవరు వాహనాన్ని వదిలేసి పారిపోయాడన్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ శుక్లా తెలిపారు.

విదేశీ విరాళాలపై పరిశీలన అక్కర్లేదు

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలు విదేశాల నుంచి పొందుతున్న ఎన్నికల విరాళాలకు సంబంధించిన కీలక చట్ట సవరణకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఫారిన్ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరిచ్చారు? అనే శూలశోధనకు మినహాయింపు ఇచ్చేలా ప్రతిపాదించిన సవరణకు సభ ఆమోదముద్ర వేసింది. దీంతో 1876 నుంచి రాజకీయ పార్టీలు సేకరించిన విదేశీ విరాళాలపై జవాబు చెప్పాల్సిన పనిలేకుండా అయింది. విపక్షపార్టీల ఆందోళనల నడుమ బుధవారం లోక్‌సభ ఆర్థికబిల్లు-2018కి 21 సవరణలు చేసింది. ఇందులో విదేశీ విరాళాల చట్టం 2010 కూడా ఒకటి. ఈ చట్టం విదేశీ విరాళాలను నిషేధానికి సంబంధించింది. కాగా, బీజేపీ ప్రభుత్వం 2016 ఆర్థిక బిల్లు సవరణ ద్వారా ఎఫ్‌సీఆర్ఏ నిధులు పొందేందుకు మార్గం సుగమం చేసింది. తాజా సవరణతో అలాంటి విరాళాలపై ఎలాంటి పరిశీలనలు, దర్యాప్తులు అవసరం లేకుండా అయింది. బిల్లు ఆమోదం పొందిన విషయాన్ని లోక్‌సభ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు.

అవినీతి, పేదరికం ప్రధాన సవాళ్లు
అమెరికా ఆర్థికవేత్త పాల్ కృగ్‌మన్



న్యూఢిల్లీ: భారత్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, అవినీతి, పేదరికం, నిరుద్యోగం నేటికీ సవాళ్లుగా ఉన్నాయని అమెరికా ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత పాల్ కృగ్‌మన్ పేర్కొన్నారు. బ్రిటన్ 150 ఏళ్లలో సాధించిన ఆర్థిక పురోగతిని భారత్ కేవలం 30 ఏళ్లలో సాధించిందని తెలిపారు. భారత ఆర్థిక పురోగతి బ్రహ్మాండంగా సాగుతున్నా అసమానతలు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉన్నాయన్నారు. గతంతో పోలిస్తే వ్యాపారానికి భారత్ ఎంతో అనువైనదిగా మారిందన్నారు. అయితే అధికారిక అడ్డంకులు మాత్రం అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. భారత్ శరవేగంగా ఆర్థిక పురోగతి సాధిస్తున్నా ఇప్పటికీ పేదరికం ఎందుకు కనిపిస్తుందో తనకు అర్థం కావడం లేదన్నారు. ఢిల్లీలో జరుగుతున్న రైజింగ్ ఇండియా సమ్మిట్‌లో మాట్లాడుతూ ఆయన ఈమేరకు వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక రంగంలో భారత్ విశేషంగా పురోగతి సాధిస్తున్నా సంపద మాత్రం సమానంగా పంపిణీ కావడం లేదు. మధ్యతరగతి ప్రజల ఆదాయం పెరుగుతుండడంతో ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ల విస్తరణ పెరుగుతోంది. చైనాతో భారత్ పోటీపడాలని చాలామంది కోరుకుంటున్నారు. అయితే భారత్ ఇంకా పేద దేశమే అన్న సంగతిని విస్మరించకూడదు. పెరిగిపోతున్న నిరుద్యోగాన్ని తగ్గించేందుకు అత్యవసరంగా ఉద్యోగ కల్పనపై దృష్టిసారించాలి. దేశంలో మౌలిక సదుపాయాల కల్పన ఇంకా కలగానే ఉన్నా, గతంతో పోలిస్తే కొంత వరకు మెరుగుపడింది. ఇక ప్రధాన సమస్య అవినీతి. దేశంలో అవినీతి ఉన్నంత కాలం అభివృద్ధి పరుగులు సాధ్యంకావు అని కృగ్‌మన్ అభిప్రాయపడ్డారు.

కాలిఫోర్నియాలో కాల్పులు.. ఒకరి మృతి



కాలిఫోర్నియా: అమెరికాలోని ఓ మాల్‌లో కాల్పుల కలకలం రేగింది. కాలిఫోర్నియాలోని తౌజండ్ ఓక్స్ మాల్‌లో శనివారం మధ్యాహ్నం 2.15 గంటలకు ఈ సంఘటన చోటుచేసుకుంది. మాల్‌లోకి ప్రవేశించిన ఓ వ్యక్తి 30 ఏళ్ల మహిళపై తుపాకీ గురిపెట్టాడు. కొద్దిసేపు వాగ్వాదం తర్వాత, ఆమెపై కాల్పులు జరిపాడు. అనంతరం తనను తాను పేల్చుకున్నాడు. ఈ ఘటనలో మహిళ మరణించగా, కాల్పులకు పాల్పడ్డ వ్యక్తి తీవ్రగాయాలతో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్నాడు. మృతురాలు అతడి మాజీ భార్యగా పోలీసులు ధృవీకరించారు. అయితే, ఆమె అదేమాల్‌లోని పేపర్ సోర్స్ దుకాణంలో ఉద్యోగినా? కాదా? అన్న విషయంపై స్పష్టత రాలేదు. తుపాకీ పేలుడు శబ్దం విని పించగానే అక్కడి వారు తారెత్తిపోయారు.

మళ్లీ పుతిన్‌కే పగ్గాలు!



మాస్కో: రష్యా అధ్యక్షుడిగా నాలుగోసారి పగ్గాలు స్వీకరించేందుకు వ్లాదమిర్ పుతిన్‌కు మార్గం సుగమం అయింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పుతిన్‌కే విజయం ఖాయమన్న సంకేతాలు వెలువడ్డాయి. దీంతో మరో ఆరేళ్లు (2024 వరకు) అధ్యక్ష పీఠంపై కూర్చునే అవకాశం లభించినట్లు అవుతోంది. దాదాపు 70శాతం ఓట్లు పోలైనట్లు తెలుస్తోంది. బ్రిటన్ గూఢచర్య ఆరోపణలు, అమెరికా ఆంక్షల నేపథ్యంలో జరిగిన ఎన్నికల్లో పుతిన్ చారిత్రక విజయానికి చేరువయ్యాడు. 18 ఏళ్ల కిందట అధికార పగ్గాలు చేపట్టిన పుతిన్ రష్యాపై పట్టు సాధించాడు. ప్రతిపక్షాన్ని మౌనానికే పరిమితం చేశాడు. విదేశాల్లో రష్యా ప్రాధాన్యాన్ని పునరుద్ధరింప జేశాడు. ఈ ఎన్నికలతో ప్రపంచ శక్తిగా రష్యా పాత్రను నొక్కిచెప్పేందుకు పుతిన్ ప్రయత్నిస్తున్నాడు. ఇటీవల కొత్త ఆయుధాలను సృష్టించడం, సిరియా సివిల్ వార్‌కు మద్దతివ్వడం వంటి చర్యలు రష్యా ప్రాధాన్యతను ప్రపంచం గుర్తించేలా చేసింది. బ్రిటన్‌లో మాజీ డబుల్ ఏజెంట్ సెర్గీ స్క్రిపల్ విషప్రయోగంపై పశ్చిమదేశాల్లో ఉద్రిక్తలు పెరిగిన నేపథ్యంలో, అమెరికా ఆంక్షలకు వ్యతిరేకంగా పుతిన్ బలమైన శక్తిగా నిలబడాల్సిన అవసరం ఏర్పడింది. 'అమెరికా, ఐరోపా దేశాలు మమ్మల్ని మోకాళ్లపై నిలబెట్టాలని చూశాయి. కానీ, మేమింకా నిటారుగా నిలబడే ఉన్నాం. మమ్మల్ని సంక్షోభంలోకి నెట్టాలనిచూశారు. కానీ దాన్ని మేం అధిగమించాం. పుతినే మా దేశానికి ప్రధాన శక్తి' అని 55ఏళ్ల ట్రాన్స్‌పోర్టు మేనేజర్ సెర్గీ బబయేవ్ వ్యాఖ్యానించాడు. క్రిమియాను రష్యాలో విలీనంచేసే ఒప్పందంపై పుతిన్ సంతకం చేసి నాలుగేళ్లయింది. దీంతో సోవియట్ మాజీ తూర్పు దేశమైన ఉక్రెయిన్‌తో యుద్ధానికి దారితీసింది. ఈ ఎన్నికల్లో కొత్త ప్రచార అస్త్రాలు పుతిన్‌కు అవసరం లేకుండా పోయింది. 'బలమైన అధ్యక్షుడు-బలమైన రష్యా' నినాదమే పుతిన్ ఎన్నికల నినాదంగా మారింది. చివరిసారిగా 2012లో అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. నాలుగేళ్లు ప్రధానిగా పనిచేసి, మళ్లీ అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేయడం పట్ల అప్పట్లో దేశవ్యాప్తంగా పుతిన్‌పై నిరసనలు వ్యక్తం అయ్యాయి. నాటి ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత పరిస్థితులు మారాయి. ఈసారి మిలియనీర్ కమ్యూనిస్టు పావెల్ గ్రుడినిన్, మాజీ టీవీ వ్యాఖ్యాత సెనియా సోబ్‌చాక్‌తోపాటు మొత్తం ఏడుగురు అభ్యర్థులు పుతిన్‌కు పోటీగా బరిలో నిలిచారు. అయినా వాళ్లెవరికీ 8శాతం మించి ఓట్లు లభించకపోవచ్చని ముందస్తు అంచనాలు వచ్చాయి.

పెరోల్‌కు శశికళ దరఖాస్తు



చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి నిచ్చెలి శశికళ భర్త నటరాజన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు గత శుక్రవారం గుండె నొప్పి రావడంతో అత్యవసరంగా ఆసుపత్రికి తరలించారు. ఆయనకు గుండె సంబంధిత ఇన్‌ఫెక్షన్ రావడంతో గ్లెనగ్లన్ గ్లోబల్ ఆసుపత్రిలో చేర్చినట్లు సమాచారం. ప్రస్తుతం నటరాజన్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. నటరాజన్‌కు ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆయనకు వెంటిలేటర్ సదుపాయంతో శ్వాస అందిస్తున్నట్లు ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ అధికారి షణ్ముగ ప్రియన్ వెల్లడించారు. గత అక్టోబర్‌లో కిడ్నీ ఆపరేషన్ కోసం ఆయనను ఆసుపత్రిలో చేర్పించారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం బాగానే ఉందని పూర్తిగా కోలుకున్నట్లు బంధువులు తెలిపారు. భర్తను చూసుకునేందుకు శశికళ పెరోల్ ఇవ్వాల్సిందిగా కోరినట్లు సమాచారం. గతంలో కూడా ఆమె భర్త అస్వస్థతకు గురైన సమయంలో పెరెల్ మీద బయటకు వచ్చారు.

ఇండో-యూఎస్ టూ ప్లస్ టు చర్చలు వాయిదా



వాషింగ్టన్: అమెరికా నూతన విదేశాంగ శాఖ మంత్రి ఎవరన్న అంశంపై స్పష్టత రానందున ఇండో-అమెరికా దేశాల మధ్య జరగాల్సిన టు ప్లస్ టు చర్చలు వాయిదా వేసినట్లు అధికార వర్గాలువెల్లడించాయి. విదేశాంగ మైక్ పొంపెయో నియాకంపై అధికారిక సమాచారం వెల్లడికావాల్సి వుంది. టు ప్లస్ టు రెండు రోజుల సమావేశంపై గతేడాది ఏప్రిల్‌లో నిర్ణయించారు. భారత ప్రధాని అమెరికా పర్యటన నేపథ్యంలో ఈ చర్చల ప్రతిపాదన తెరపైకి వచ్చింది. తాజా పరిణామం ద్వైపాక్షిక సంబంధాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపబోదని, రక్షణ, విదేశాంగ కార్యదర్శులు ఈవారంలోనే సమావేశం ఎజెండాను ఖరారు చేస్తారని వాషింగ్టన్ అధికారులు వెల్లడించారు. గతేడాది జూన్ తర్వాత అనేకసార్లు సమావేశం తేదీలు మారుతూ వచ్చాయి. తొలుత నవంబర్, డిసెంబర్ మాసాల్లో చర్చల ప్రతిపాదన వచ్చినా, జనవరికి వాయిదా పడింది. ఆ తర్వాత మళ్లీ స్పష్టమైన షెడ్యూల్ నిర్ణయంపై ఇరు దేశాలు అవగాహనకు రాలేకపోయాయి. ఇరుదేశాల విదేశాంగ, రక్షణ మంత్రుల అంగీకారంతో చివరకు ఫిబ్రవరిలో ఒక అవగాహనకు వచ్చినప్పటికీ, ట్రిల్లర్ సన్ తొలగింపు నేపథ్యంలో మళ్లీ బ్రేక్ పడింది.



కోల్‌కతాలోని రవీంద్ర ఠాగూర్ సరోవర్ వద్ద పింక్‌థాన్‌లో పాల్గొన్న బాలీవుడ్ నటుడు మిలింద్ సోమన్

పద్మ పురస్కారాలకు సిఫార్సులు

న్యూఢిల్లీ: ఈ ఏడాది పద్మ అవార్డులకు 8 రాష్ట్రాలు, 7గురు గవర్నర్లు, 14 మంది మంత్రులు సిఫార్సు చేయనున్నట్లు సమాచారం. అయితే అవార్డులు ఎక్కడ ఇవ్వనున్నారు అనేది ఇంకా ప్రదేశం ఖరారు కాలేదని, మార్చి 20న కానీ, ఏప్రిల్ 2న కానీ అవార్డుల పండగ జరగవచ్చునని తెలిసింది. జనవరి 25న కేంద్ర ప్రభుత్వం 2018కి సంబంధించిన పద్మ అవార్డులకు రాష్ట్రాల నుంచి, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల్లోని ఎంపీలు, గతంలో అవార్డు గ్రహీతలు, వ్యక్తిగతంగా అర్హుల నుంచి నామినేషన్లు కోరింది. ఇప్పటివరకు 35,595 సిఫార్సులు లేక నామినేషన్లు దాఖలైనట్లు కేంద్ర హోం మంత్రిత్వ వెల్లడించింది. వీరిలో ప్రముఖులు పంపిన వాటిలో 84 మంది సాధారణ పౌరుల నుంచి అందినట్టు తెలిపారు. అందులో ప్రముఖంగా పేద ప్రజలకు సేవచేసినవారు, వారి వారి శాఖల్లో సేవచేసినవారికి 10మంది సెలక్షన్ కమిటీ అవకాశం ఇచ్చినట్లు హోం మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, న్యాయ నిర్ణేతల కమిటీని తమిళనాడు, హర్యానా, జమ్మూ,కాశ్మీర్, కర్నాటక, ఉత్తరాఖండ్, బీహార్, రాజస్థాన్, ఢిల్లీ ఎనిమిది రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. అయితే, తమిళనాడు నుంచి 6, హర్యానా 5, జమ్మూకాశ్మీర్ 9, కర్నాటక 44, ఉత్తరాఖండ్ 15, బీహార్ 4, రాజస్థాన్ 4, ఢిల్లీ 7గురిని పద్మా అవార్డుకు సిఫార్సు చేశారు. అయితే, పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేసరీనాథ్ త్రిపాఠి 11, హర్యానా గవర్నర్ కాప్టన్ సింగ్



సోలంకి-7, జమ్మూకాశ్మీర్ గవర్నర్ వోహ్రా-4, ఉత్తరప్రదేశ్ రామ్‌నాయక్-10, గుజరాత్ కోహ్లి-2, కేరళ సదాశివం-2, పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడి-1 ఈ 7 రాష్ట్రాల గవర్నర్‌లు సిఫార్సు చేసిన నామినేషన్లు పద్మా అవార్డులకు చోటు దక్కలేదు.

- ఏడుగురు కేంద్ర కేబినెట్ మంత్రులు అరుణ్ జైట్లీ-1, మేనకా గాంధీ-4, ప్రకాష్ జవడేకర్-6, రాంవిలాస్ పాశ్వాన్-4, సురేష్ ప్రభు-12, తవర్‌చాంద్ గెహ్లాట్-16 సిఫార్సు చేసిన నామినేషన్లకు కూడా 2018 అవార్డులకు నోచుకోలేదు. అయితే, గిరిజన శాఖ నుంచి వచ్చిన 10 సిఫార్సుల్లో ఆ శాఖ మంత్రి జాల్ ఓరమ్ నామినేషన్‌ను ఒక్కటే ఆమోదానికి నోచుకున్నదని కమిటీ పేర్కొన్నది.
- ఎనిమిది కేంద్ర మంత్రులు అరుణ్ రామ్ మేఘ్వాల్-4, అశ్వినీ కుమార్ చౌబే-2, సీఆర్ చౌదరి-3, హరిబాయ్ పాతిభాయ్ చౌదరి-2, గిరిరాజ్ సింగ్-2, మహేష్ శర్మ-8, ముక్తా అబ్బాస్ నక్వీ-2, రాంక్రిపాల్ యాదవ్-4 సిఫార్సులను కమిటీ ఆమోదించింది. ఇక అసోం(12లో ఒకటి), ఛత్తీస్‌గఢ్(13లో 1), ఉత్తరప్రదేశ్(7లో 1), మధ్యప్రదేశ్ (9లో 1), కేరళ (41లో 1), మహారాష్ట్ర(84లో 3) రాష్ట్రాలు సిఫార్సులకు చోటుదక్కింది. గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ సిఫార్సు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురవగా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రామన్ సింగ్ సిఫార్సు చేసిన నామినేషన్‌కు పద్మా అవార్డుల్లో చోటుదక్కింది.
- ఈ ఏడాది ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా మొత్తం 84 పద్మా అవార్డులను ఖరారుచేసింది. ఇందులో 3 పద్మ విభూషణ్, 9 పద్మ భూషణ్, 72 పద్మశ్రీ అవార్డులున్నాయి.
- 2018 పద్మా అవార్డుల సెలక్షన్ కమిటీలో కేబినెట్ సెక్రటరీ నిన్న, కేంద్ర హోం సెక్రటరీ రాజీవ్ గౌబా, ప్రధానమంత్రి అదనపు ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా, కేంద్ర మాజీ మంత్రి ఆరిఫ్ మెహమ్మద్ ఖాన్, రాజ్యసభ మెంబర్ స్వప్న దాస్‌గుప్త, క్రికెటర్ అనిల్ కుంబ్లే,రస్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ ఛైర్మపర్సన్ అరుంధతీ భట్టాచార్య, సింగర్ శేఖర్ సేన్, హరివంశ్ ఉన్నారు.


మహేష్‌బాబు

పంచెకట్టులో సూపర్‌స్టార్ అదుర్స్

సూపర్‌స్టార్ మహేష్‌బాబు, దర్శకుడు కొరటాల శివ కలయికలో తెరకెక్కుతున్న చిత్రం భరత్ అనే నేను. డి.పార్వతి సమర్పణలో డి.వి.వి.ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దానయ్య డి.వి.వి. నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్ ఇప్పటికే విడుదలై, రికార్డు స్థాయి వ్యూస్‌ను రాబట్టుకుంది. కాగా ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ చిత్రంలో సంప్రాదయబద్ధంగా పంచె కట్టుతో ఉన్న మహేష్‌బాబు పోస్టర్‌ను విడుదలచేశారు. దీనికి కూడా ప్రేక్షాకాభిమానుల నుంచి విశేషమైన స్పందన లభిస్తోంది.

ఈ నెల 25 నుంచి స్పెయిన్ షెడ్యూల్

మన తెలుగు సంవత్సరాది పండుగ కళ ఉట్టిపడే పంచె కట్టుతో ఉన్న భరత్ అనే నేను చిత్రంలోని మహేష్ పోస్టర్‌ను ఆదివారం విడుదలచేశామని, ఈ లుక్ ప్రేక్షకాభిమానులను కనువిందు చేస్తోందని నిర్మాత దానయ్య పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ఓ ఫాటను రాజు సుందరం నేతృత్వంలో చిత్రీకరిస్తున్నామని ఆయన తెలిపారు. టెంపుల్ సెట్‌లో వందమందికి పైగా డ్యాన్సర్లు, వెయ్యిమందికి పైగా జూనియర్ ఆర్టిస్టులతో భారీ ఎత్తున ఈ పాటను తీస్తున్నామని ఆయన వివరించారు. ఈ నెల 25 నుంచి స్పెయిన్ షెడ్యూల్ ఉంటుందని, మిగిలిన అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి, ఏప్రిల్ 20న సినిమాను విడుదల చేస్తామని చెప్పారు. మహేష్‌బాబు సరసన కైరా అద్వాని నటిస్తున్న ఈ చిత్రంలోని ఇతర ముఖ్యపాత్రల్లో ప్రకాష్‌రాజ్, శరత్‌కుమార్ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, పాటలు: రామజోగయ్యశాస్త్రి, సినిమాటోగ్రఫీ: రవి కె.చంద్రన్, ఎస్.తిరునవుక్కరసు, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్.



రంగస్థలం చరణ్‌ను మరో మెట్టు ఎక్కిస్తుంది

- ప్రీరిలీజ్ వేడుకలో చిరంజీవి



రంగస్థలం నటుడిగా రామ్ చరణ్‌కు తలమానికంగా నిలుస్తుందన్నారు మెగాస్టార్ చిరంజీవి. చరణ్‌ను మరో మెట్టు పైకి తీసుకెళ్లే సినిమా అవుతుందన్నారు. తనకు ఖైదీ చిత్రం ఎలాంటి పేరు తీసుకొచ్చిందో...రంగస్థలం రామ్ చరణ్‌కు అలాంటి గుర్తింపు తెస్తుందని చిరంజీవి చెప్పారు. రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన రంగస్థలం సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమం వైజాగ్ ఆర్కే బీచ్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిత్ర యూనిట్‌ను అభినందించిన చిరు సినిమా గురించి విపులంగా అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ....ఇన్నాళ్లు నా కొడుకుగా చరణ్ గర్వించి ఉంటారు. ఈ సినిమా చూశాక నేను అతని తండ్రిగా సంతోషపడుతున్నాను. రంగస్థలం చరణ్ నటప్రస్థానంలో మైలు రాయిగా నిలుస్తుంది. రేపు ప్రేక్షకులు ఓ గొప్ప చిత్రాన్ని చూడబోతున్నారు. నేను ఇప్పటికే ఈ సినిమాను తిలకించాను. ప్రతి సన్నివేశం అద్భుతంగా ఉంటుంది. కథ చివరిదాకా ఉత్కంఠ కలిగిస్తుంది. చరణ్ వినికిడి లోపమున్న పాత్రలో లీనమై నటించాడు. రంగస్థలం సినిమా చూశాక వాళ్ల అమ్మ చరణ్‌ను పట్టుకుని ఉద్వేగంతో ఏడ్చేసింది. నాదీ అదే పరిస్థితి..అయితే నేను బయటపడలేదు. సినిమా కోసం చాలా కష్టపడ్డాడు చరణ్. నేను ఖైదీ, ఆపద్బాంధవుడు, స్వయంకృషి లాంటి చిత్రాలు చేస్తున్నప్పుడు గొప్ప అనుభూతికి లోనయ్యాను. రంగస్థలం రామ్ చరణ్‌కు అలాంటి అనుభూతినే మిగిల్చి ఉంటుంది. ఎన్ని పురస్కారాలు ఉంటే అవన్నీ రంగస్థలంకు దక్కాలి. జాతీయ పురస్కారానికి కూడా ఈ సినిమాకు అర్హత ఉంది. దర్శకుడిగా సుకుమార్ ప్రతిభావంతంగా పనిచేశారు. నాకు కథ ఎలా చెప్పారో, అలాగే తెరకెక్కించారు. అనవసర వాణిజ్య విలువలు చేర్చి కథను కలుషితం చేయకుండా నిజాయితీగా రూపొందించారు. సమంత రామలక్ష్మి పాత్రలో చూపించిన హావభావాలు చాలా సహజంగా ఉన్నాయి. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం, చంద్రబోస్ సాహిత్యం ఒకదానితో మరొకటి పోటీ పడ్డాయి. కళా దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ లాంటి ఇతర సాంకేతిక నిపుణులంతా మనసుపెట్టి పనిచేశారు. రంగస్థలం ప్రతి ఒక్కరినీ అలరిస్తుందనే నమ్మకముంది. అన్నారు. రామ్ చరణ్ మాట్లాడుతూ....రంగస్థలం నాకు ఒక సినిమా కాదు అనుభవం. ఈ సినిమాతో గ్రామ ప్రజల నిర్మలమైన మనసులు ఎలా ఉన్నాయో తెలుసుకున్నాను. అక్కడి వాతావరణం ఎంత స్వచ్ఛంగా ఉంటుందో తెలిసింది. మా తాత గారు ఉద్యోగం చేసేప్పుడు ఒకసారి నాన్న నెల్లూరు తీసుకెళ్లారు. ఆ తర్వాత ఆపద్బాంధవుడు చిత్రీకరణ సమయంలో పెదపూడి అనే గ్రామానికి వెళ్లాను. ఈ రెండు సందర్భాలు తప్ప గ్రామాలకు వెళ్లే అవకాశం రాలేదు. నగర జీవితానికి పల్లె జీవనానికి ఎంత తేడా ఉంది. రంగస్థలం ఏడాది జరిగినా....అప్పుడే అయిపోయిందా అనిపిస్తోంది. చిట్టిబాబు గడ్డం తీయాలనిపించలేదు. ఇంత మంచి పాత్ర ఇచ్చిన దర్శకుడు సుకుమార్ గారికి కృతజ్ఞతలు చెబుతున్నాను. అన్నారు. సమంత మాట్లాడుతూ.... ప్రేక్షకులు మాపై చాలా అభిమానం చూపిస్తారు. మంచి సినిమాలు చేయడం ద్వారా మాత్రమే వాళ్ల రుణం మేము తీర్చుకునే అవకాశం వస్తుంది. అలాంటి చిత్రమే రంగస్థలం. నేను ఇలాంటి పాత్ర నా ప్రయాణంలో చేయలేదు. సుకుమార్ గారు రామలక్ష్మి పాత్ర గురించి చెబుతున్నప్పుడు ఆయన చెప్పేది వినలేదు, ఆయన కళ్లలో ఆ పాత్ర మీద ఉన్న ప్రేమ మాత్రమే చూశాను. చరణ్ లాంటి సహ నటుడితో నటించడం అదృష్టంగా భావిస్తున్నాను. అని చెప్పింది. దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ....దర్శకుడిగా ఓ సినిమా చేశాక ...ఈ పాత్రకు మరో హీరో అయితే ఎలా ఉంటుంది అనిపిస్తుంది. కానీ రంగస్థలం సినిమాలో చిట్టిబాబు పాత్ర చూశాక...చరణ్ తప్ప మరే హీరో ఈ క్యారెక్టర్‌కు సరిపోరు అనిపించింది. దర్శకుడిగా నేను అలా భావించాను అంటే...విజయవంతం అయినట్లే. ఆ విజయాన్ని చరణ్ నాకు అందించారు. మొదటి షాట్ చేసేప్పుడు చరణ్ నటనకు అంతా క్లాప్స్ కొట్టాం. మేమే కాదు ప్రకాష్ రాజ్ కూడా చాలాసార్లు చప్పట్లు కొడుతూనే ఉన్నారు. సమంతతో జీవితాంతం సినిమాలు చేయాలనే ఉంది. అంత గొప్పగా నటించింది. నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరికీ ఈ చిత్రంతో అనుబంధం ఏర్పడింది. అన్నారు.

ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు దేవీశ్రీ ప్రసాద్, నాయిక పూజా హెగ్డే, నిర్మాతలు నవీన్ ఏర్నేని, సీవీ మోహన్, అల్లు అరవింద్, దానయ్య, ఎన్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


నితిన్, మేఘాఆకాష్

ఛల్ మోహన్‌రంగ పాటలు విడుదల

నితిన్, మేఘాఆకాష్ నాయకానాయికలుగా నటిస్తున్న ఛల్ మోహన్‌రంగ చిత్రం ఆల్బమ్‌ని విడుదలచేశారు. కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నిఖితారెడ్డి సమర్పణలో పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ఠ మూవీస్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన మూడు పాటలు కోవలోనే తాజాగా విడుదలైన మిగతా మూడు పాటలు విభిన్న శైలిలో ఉన్నాయి. ఈ సందర్భంగా చిత్రబృందం మాట్లాడుతూ, ఆల్బమ్‌లో ప్రతీ పాటను కొత్తగా రూపొందించడమే కాకుండా ప్రతీ పాటను హిట్ చేయగల అతి తక్కువమంది సంగీత దర్శకులలో తమన్ ఒకరు. మాస్ నుంచి క్లాస్ వరకు, ప్రేమ నుంచి విరహం వరకు, సంతోషం నుంచి బాధ వరకు..అన్నింటినీ ఎంతోబాగా స్వరపరిచి ఒక పూర్తిస్థాయి ఆల్బమ్ ఇచ్చారని చెప్పారు. యు.ఎస్., ఊటీ, హైదరాబాద్‌లలో ఎన్నో అందమైన ప్రదేశాలలో ఈ చిత్రం షూటింగ్ జరిపామని వివరించారు. నిర్మాత ఎన్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, చిత్రాన్ని ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకుని వస్తున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో కె.వి.నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రా శ్రీను, మధునందన్, ప్రగతి, సత్య, షమ్మి సాయి, రాజశ్రీ నాయర్, అశురెడ్డి, వెన్నెల రామారావు, కిరీటి, రణధీర్, నీలిమ భవాని, బాల తారలు హాసిని, కృతిక, జాయ్, లిఖిత్, స్నేహిత్, స్కందన్ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి కెమెరా: ఎన్.నటరాజ సుబ్రమణియన్, కూర్పు: ఎస్.ఆర్.శేఖర్, నృత్యాలు: శేఖర్ వి.జె., పోరాటాలు: స్టంట్ సిల్వ, రవివర్మ.

నవ్వులు పూయించే నర్తనశాల

నాగశౌర్య కథానాయకుడిగా మరో కొత్త చిత్రం ప్రారంభమైంది. నర్తనశాల పేరుతో నూతన దర్శకుడు శ్రీనివాస్ చక్రవర్తి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఛలో సినిమాతో విజయాన్నందుకున్న ఐరా క్రియేషన్స్ సంస్థ నర్తనశాలను నిర్మిస్తోంది. ఈ చిత్ర ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. దర్శకుడు వంశీ పైడిపల్లి క్లాప్‌నిచ్చారు. ముహూర్తపు సన్నివేశం చిత్రీకరణ అనంతరం నాగశౌర్య మాట్లాడుతూ...మా సంస్థలో నేను కథానాయకుడిగా నటిస్తున్న రెండో చిత్రమిది. ఛలో మంచి విజయాన్ని అందుకుంది. నర్తనశాల అంతకంటే గొప్ప విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంది. నర్తనశాల పేరు వినగానే పౌరాణిక కథ అనుకుంటారు. కానీ ఇది పూర్తిగా వినోదాత్మక చిత్రం. ఆద్యంతం నవ్వించేలా ఉంటుంది. కథకు బాగుంటుందని ఈ పేరు పెట్టాం. సాగర్ మహతి మరోసారి



మా చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. నన్ను ప్రోత్సహిస్తున్న అమ్మకు కృతజ్ఞతలు. అన్నారు. దర్శకుడు శ్రీనివాస్ చక్రవర్తి మాట్లాడుతూ...ఐరా క్రియేషన్స్ మా అందరి కోసం ఓ విజయవంతమైన వేదికను ఇచ్చింది. నర్తనశాలతో ఆ విజయాన్ని కొనసాగించడమే మా బాధ్యత. ఆ బాధ్యత నెరవేరుస్తామనే నమ్మకం ఉంది. మంచి కథ తయారుచేశాం. చెట్లకు చిగురుతొడిగే చైత్రమాసంలో సినిమా ప్రారంభిస్తున్నాం. ఈ గొప్ప సమయంలో ప్రారంభమయ్యే మా సినిమా కూడా గొప్ప విజయాన్ని సాధిస్తుందని నమ్ముతున్నాం. అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు అవసరాల శ్రీనివాస్, నందినీరెడ్డి తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.

నరేష్, జయప్రకాష్ రెడ్డి, అజయ్, పోసాని కృష్ణమురళి, సత్యం రాజేష్, వెన్నెల కిషోర్ తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఫైట్స్ - వెంకట్, ఆర్ట్ - కిరణ్, ఎడిటర్ - కోటగిరి వెంకటేశ్వరరావు, తమ్మిరాజు, సినిమాటోగ్రఫీ - విజయ్ సి.కుమార్, నిర్మాత - ఉషా మూల్పూరి, సమర్పణ - శంకర్ ప్రసాద్ మూల్పూరి.

మిస్టరీ థ్రిల్లర్ సుబ్రహ్మణ్యపురం

సుమంత్ కథానాయకుడిగా నటిస్తున్న 25వ చిత్రం సుబ్రహ్మణ్యపురం ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా ప్రారంభమైంది. టారస్ సినీ కార్ప్ పతాకంపై ధీరజ్ బొగ్గరం, బీరం సుధాకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు సంతోష్ జాగర్లపూడి సుబ్రహ్మణ్యపురం చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈషా రెబ్బా నాయిక. హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో జరిగిన ఈ చిత్ర ప్రారంభోత్సవానికి పలువురు చిత్ర పరిశ్రమ ప్రముఖులు హాజరయ్యారు. నాగచైతన్య క్లాప్‌ఇచ్చారు ముహూర్తపు సన్నివేశం చిత్రీకరణ అనంతరం సుమంత్ మాట్లాడుతూ....సుబ్రహ్మణ్యపురం మిస్టరీ థ్రిల్లర్ తరహా కథ. తొలిసారి ఇలాంటి చిత్రంలో నటిస్తున్నాను. నేను భయస్తుడిని, నాకు థ్రిల్లర్ చిత్రాలు నచ్చవు. అయితే దర్శకుడు చెప్పిన కథ ఆకట్టుకుంది. రెండున్నర గంటలు కథ విన్నప్పుడు సినిమా చూస్తున్నట్లు అనిపించింది. అతీంద్రియ శక్తుల అంశాలు కథలో ఉంటాయి. ప్రతి క్షణం ఉత్కంఠతో సాగే చిత్రమిది. నాయిక ఈషా రెబ్బా మాట్లాడుతూ...నేను కూడా తొలిసారి మిస్టరీ థ్రిల్లర్ కథలో నటిస్తున్నాను. కథ బాగా ఆకట్టుకుంది. ఇలాంటి పాత్ర గతంలో నేను చేయలేదు. అని చెప్పింది. దర్శకుడు సంతోష్ జాగర్లపూడి మాట్లాడుతూ...గతంలో మూడు లఘు చిత్రాలు రూపొందించాను. వాటిలో ఒక చిత్రాన్ని చూసి నిర్మాత పిలిచారు. మంచి కథ చెప్పు సినిమా చేద్దామంటూ అవకాశమిచ్చారు. కథ అక్కడే మొదలైంది. సుమంత్‌కు కథ సంక్షిప్తంగా చెబుదామని వెళ్లాను. పాటలు, ఫైట్లు లేకుండా ప్రతి సన్నివేశం చెప్పమన్నారు. రెండున్నర గంటలు వివరించాను. కథ అందరికీ నచ్చింది. ఏప్రిల్ మూడోవారం నుంచి రెగ్యులర్ చిత్రీకరణకు వెళ్తాము. అన్నారు. నిర్మాత ధీరజ్ బొగ్గరం మాట్లాడుతూ...మా హీరోకు 25వ చిత్రం. మాగ్నస్ సినీ ప్రైమ్ సహకారంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. తప్పకుండా అన్ని వర్గాల వారికి చేరువయ్యే చిత్రమవుతుంది. అన్నారు.



ఈ చిత్రానికి సంగీతం - శేఖర్ చంద్ర, కెమెరా - ఆర్ కే ప్రతాప్, ఎడిటర్ - కార్తీక శ్రీనివాస్, కళ - లక్ష్మీ సింధూజ.



వెంకీ అట్లూరి దర్శకత్వంలో అఖిల్

వర్ధమాన కథానాయకుడు అఖిల్ అక్కినేని తన మూడవ సినిమాను వెల్లడించారు. మొదటి సినిమా అఖిల్, ఈ మధ్యనే వచ్చిన రెండో చిత్రం హలో తర్వాత అఖిల్ ఏం సినిమా చేయబోతున్నారన్న అంశం ఆసక్తిగా మారింది. ఈ నేపథ్యంలో తొలిప్రేమ వంటి విజయవంతమైన చిత్రాన్ని అందించిన వెంకీ అట్లూరి దర్శకత్వంలో అఖిల్ నటించనున్నట్లు ఇటీవల వార్తలు వస్తున్నాయి. కాగా వాటిని నిజం చేస్తూ అఖిల్ సోషల్ మీడియాలో తన మూడవ సినిమాను ప్రకటించేశారు. ఆదివారాలు చాలా లవ్లీగా ఉంటాయి కదూ! ఈ లవ్లీ ఆదివారం నా కొత్త సినిమా విషయాలను ప్రకటించాలనుకున్నాను. వెంకీ అట్లూరి నా కొత్త సినిమాకు దర్శకత్వం వహిస్తారు. మేలో చిత్రీకరణ మొదలవుతుంది. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తారు అంటూ అఖిల్ ట్వీట్ చేశారు.

14 రీల్స్ ప్లస్‌లో వరుణ్‌తేజ్

ఫిదా, తొలిప్రేమ వంటి వరుస విజయాలతో దూసుకుపోతున్న హీరో వరుణ్‌తేజ్ నూతన చిత్రాన్ని అంగీకరించారు. అప్పట్లో ఒకడుండేవాడు ఫేమ్ సాగర్‌చంద్ర దర్శకత్వంలో 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట సంయుక్తంగా 14 రీల్స్ ప్లస్ అనే నూతన సంస్థపై ప్రొడక్షన్ నెం.1గా నిర్మించబోయే చిత్రంలో వరుణ్‌తేజ్ నటించనున్నారు. ఉగాది సందర్భంగా నిర్మాతలు ఈ నూతన చిత్రాన్ని ప్రకటించారు. దీనికి సంబంధించిన ఇతర వివరాలను త్వరలోనే ప్రకటించనున్నట్లు వారు వెల్లడించారు.



మొదలైన శబ్ధం

నారా రోహిత్ ప్రధాన పాత్రలో పి.బి.మంజునాథ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న శబ్ధం (హిజ్ సైలెన్స్..ఈజ్ హిజ్ వెపన్) చిత్రం ఉగాది పర్వదినాన ప్రారంభమైంది. శ్రీ వైష్ణవి క్రియేషన్స్ పతాకంపై నారాయణరావు అట్లూరి నిర్మాణ సారధ్యంలో రూపొందే ఈ చిత్ర ఆరంభ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పలువురు రాజకీయ, సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరిగింది. కథానాయకుడు నారా రోహిత్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి మంత్రి పత్తిపాటి పుల్లారావు క్లాప్ కొట్టగా, పెదకూరపాడు శాసనసభ్యుడు కొమ్మలపాటి శ్రీధర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. అనంతరం ముఖ్యఅతిథులు చిత్రబృందానికి శుభాకాంక్షలు అందజేస్తూ ప్రసంగించారు. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడుతూ, అమరావతిలో నా సినిమా ప్రారంభోత్సవం జరగడం చాలా ఆనందంగా ఉంది. అందరికీ వినోదాన్ని అందించడం కోసం మా టీమ్ అంతా కష్టపడతాం. పెదనాన్నగారు ఎంతో అభివృద్ధి చేస్తున్న ఈ ప్రాంతంలోనే నా సినిమా ఆడియో విడుదల వేడుక కూడా నిర్వహిస్తాం. కథకు సరిగ్గా సరిపోయే టైటిల్ ఇది అన్నారు.


దర్శకుడు పి.బి.మంజునాథ్ మాట్లాడుతూ, నా మొదటి సినిమా లేడీస్ అండ్ జెంటిల్‌మెన్‌కు నంది అవార్డు అందించి, దర్శకుడిగా ప్రోత్సాహాన్ని అందజేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుగారికి ముందుగా నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. కథను నమ్మి విన్న వెంటనే ఓకే చేసిన నారా రోహిత్‌కు ధన్యవాదాలు. రిచర్డ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఏప్రిల్ చివరి వారం నుంచి వైజాగ్, కాకినాడ, హైదరాబాద్‌లలో రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెడతాం అని చెప్పారు. నిర్మాత నారాయణరావు అట్లూరి మాట్లాడుతూ, నారా రోహిత్‌తో ఈ చిత్రాన్ని నిర్మించడం ఆనందంగా ఉంది. చిత్రం అందరినీ అలరింపజేసేవిధంగా ఉంటుంది అన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.

ఈ చిత్రానికి కథ, మాటలు: వంశీ రాజేష్, సంగీతం: వికాస్ కురిమెళ్ళ, సినిమాటోగ్రఫీ: ఎల్.రిచర్డ్‌ప్రసాద్, ఎడిటింగ్: నవీన్ నూలి, సమర్పణ: డా.సౌజన్య అట్లూరి.




ఎం. ఎం. శ్రీలేఖకు కళారత్న పురస్కారం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది పండుగ సందర్భంగా ఇచ్చే ప్రతిష్ఠాత్మక కళారత్న పురస్కారం ఈ ఏడాది ప్రముఖ సంగీత దర్శకురాలు ఎం.ఎం.శ్రీలేఖకు లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా ఈ పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. తన పన్నెండవ ఏటనే సినిమాలకు సంగీత దర్శకత్వం అందించడం మొదలుపెట్టిన ఆమె ఇంతవరకు ఐదు భాషలలో 75 సినిమాలకు సంగీతాన్ని అందించిన ఏకైక మహిళా సంగీత దర్శకురాలిగా రికార్డు సృష్టించారు. దాసరి నారాయణరావు రూపొందించిన నాన్నగారు సినిమాతో మొదలైన ఆమె సంగీత ప్రస్థానం రామానాయుడు నిర్మించిన తాజ్‌మహల్, ధర్మచక్రం వంటి హిట్ చిత్రాలతో పాటు ప్రేమించు లాంటి సందేశాత్మక చిత్రాల ద్వారా మంచి గుర్తింపును సొంతం చేసుకోవడం జరిగింది. తన సంగీత దర్శకత్వంలో మొదటి ఫాట రచన చేసిన సిరివెన్నెల సీతారామశాస్త్రి కూడా ఇదే ఏడాది కళారత్న పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందని శ్రీలేఖ అన్నారు.



క్రీడాప్రభ



పీటర్సన్ కెరీర్ ఫోటోల్లో

పుట్టింది దక్షిణాఫ్రికాలో. కానీ ప్రాతినిధ్యం వహించింది ఇంగ్లాండ్‌కు జట్టులో స్థానం దక్కలేదన్న కారణంగా ఇంగ్లాండ్‌లో తన అదృష్టాన్ని పరిరక్షించుకున్నాడు. కాకపోతే ఇంగ్లాండ్‌కే అదృష్టంగా మారాడు. తాను పుట్టిన గడ్డపై ఆడిన తొలి సిరీస్‌లో మూడు సెంచరీలు బాదిన ఆనందంలో

1

2005.. ఓవల్‌పిచ్‌పై యాషెస్‌లో సెంచరీ. ఈ సెంచరీ వల్లే 18 ఏళ్ల తర్వాత యాషెస్‌ను ఇంగ్లాండ్ నిలబెట్టుకోగలిగింది.





2

అతని దూకుడుకూ, ధైర్యానికి, క్రికెట్ స్వరూపాన్ని మార్చేసిన తెగింపుకూ నిదర్శనం.. స్విచ్ హిట్ కొడుతూ..

3

2010-11.. కెరీర్‌లో అత్యధిక టెస్ట్ స్కోర్ 227 పరుగులు. ఆస్ట్రేలియాలో యాషెస్ సిరీస్ విజయం.. అందిస్తూ..





2012.. కాంట్రవర్సీలను దాటుకుంటూ.. నవ్వుతూ.. ఓ భారీ సెంచరీని బాది.. పుట్టిన గడ్డను మరోసారి గెలిచిన సంతోషంలో...

4



5

దాదాపు 3 దశాబ్దాల తర్వాత భారత్‌లో ఇంగ్లాండ్‌కు టెస్టు సిరీస్ విజయాన్ని అందించిన 186 పరుగుల ఇన్నింగ్స్‌లో ఓ షాట్ ఆడుతూ...



6

2014.. ఆఖరి ముద్దు.. ఆస్ట్రేలియాలో యాషెస్‌ మరోసారి నిలబెట్టి... అక్కడితో అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలుకుతూ..



7

తర్వాత లీగ్ క్రికెట్‌లో బిజీ బిజీ.. ఢిల్లీ డేర్‌డెవిల్స్‌కు నాయకుడిగా..

బంగ్లాను కాటేసిన కార్తీక్

భారత్‌కు ఓటమి ఖాయం అనే దశలో క్రీజులోకి వచ్చాడు కార్తీక్. బౌండరీల మీద బౌండరీలు బాదుతూ విజయం మీద ఆశలు రేపాడు. అక్కడితో పూర్తవ్వలేదు. ఆఖరి బంతికి గెలిపించినా, ఓడినా అది కార్తీకే అనే పరిస్థితి వచ్చింది. విజయానికి 5పరుగులు కావాలి. ఫోర్ సూపర్ ఓవర్. 5 పరుగులకు అవకాశం లేదు. 6 కొడితేనే విజయం. అప్పటిదాకా చేసిన అద్భుతాన్ని కొనసాగిస్తూ కార్తీక్ మరోసారి సిక్స్ బాదాడు. నాగిని డ్యాన్స్ చేయాలని ఆశగా వున్న ఆటగాళ్ల ఆశలపై నీళ్లు చల్లాడు.

● రాణించిన రోహిత్ ● ఫైనల్లో భారత్ గెలుపు



కొలంబో : ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్‌లో భారత్ విజయం సాధించి ట్రైసిరీస్‌ను కైవసం చేసుకుంది. బంగ్లా నిర్దేశించిన 167 పరుగుల లక్ష్యాన్ని ఆఖరి బంతికి చేరుకుని 4 వికెట్ల తేడాతో గెలిచింది. గెలుపుపై ఆశలు లేని దశలో బ్యాటింగ్‌కు దిగిన కార్తీక్(29; 8 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. రోహిత్ శర్మ అర్థసెంచరీతో అలరించాడు. బౌలింగ్‌లో చాహల్ మూడు వికెట్లతో బంగ్లాను దెబ్బ కొట్టినా.. సబ్బీర్ రహ్మాన్ అర్థ సెంచరీతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేయగలిగింది.

గెలిపించిన కార్తీక్

ఆఖరి రెండు ఓవర్లలో విజయానికి 34 పరుగులు కావాలి. కార్తీక్ క్రీజులోకి వచ్చాడు. బ్యాటింగ్‌కు దిగకముందు కాసేపు మైదానంలో కళ్లు మూసుకుని అలా కూర్చుండిపోయాడు. తనలో తాను ఏం మాట్లాడుకున్నాడో గానీ ఏమో వచ్చీ రాగానే

రూబెల్ వేసిన తొలి బంతిని సిక్స్‌గా మలిచాడు. రెండవ బంతి ఫోర్. మూడో బంతి మళ్లీ సిక్స్. రూబెల్ లెంత్ బాల్ వెయ్యడం.. బంతి బౌండరీకి తరలిపోవడం అన్నట్టు తయారైంది పరిస్థితి.. చివరి మూడు బంతుల్లో ఒక బౌండరీ కలుపుకుని ఆరు పరుగులు సాధించి 22 పరుగులు సాధించాడు. దాంతో ఆఖరి ఓవర్‌కు 12 పరుగులు సాధించాల్సిన దశలో భారత్‌కు మళ్లీ విజయం మీద ఆశలు రేపాడు.

అంతే కాదు ఆఖరి బంతికి విజయానికి 5 పరుగులు కావాలి. బంతి ఫోర్ కొడితే సూపర్ ఓవర్ అవుతుంది. సిక్స్ కొడితేనే విజయం. అలాంటి సమయంలో ఆఫ్ సైడ్ ఆవల పడిన బంతిని లాఫ్టెడ్ కవర్‌డ్రైవ్‌తో సిక్స్‌గా మలిచి మరపురాని విజయాన్ని అందించాడు.

ముస్తఫిజుర్ మాయ

18వ ఓవర్. భారత్ విజయానికి 18 బంతుల్లో 35 పరుగులు కావాలి. స్ట్రైకింగ్‌లో శంకర్ వుంటే, అవతలి ఎండ్‌లో మనీశ్ పాండే. ఆ సమయంలో ముస్తఫిజుర్ మాయ చేశాడు. వరసగా నాలుగు బంతుల్ని డాట్ చేయడంతో భారత్ మీద ఒత్తిడి పెరిగిపోయింది. ఆ తర్వాత బంతికి లెగ్‌బై రూపంలో పరుగు వచ్చింది. ఆఖరి బంతికి అప్పటికే తీవ్ర ఒత్తిడిలో వున్న మనీశ్ పాండే సిక్స్ బాదబోయి లాంగ్ ఆన్‌లో మరో క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో 12 బంతులకి 34 పరుగులు చేయాల్సిన దశలో బంగ్లాదేశ్ విజయం ఖాయంగా కనిపించింది. కానీ అక్కడనుంచి కార్తీక్ దాడి ప్రారంభమైంది

రోహిత్ బాధ్యతాయుత ఇన్నింగ్స్

బంగ్లాదేశ్‌పై నాకౌట్ మ్యాచుల్లో అద్భుత రికార్డున్న రోహిత్ శర్మ అదే సంప్రదాయాన్ని కొనసాగించాడు. మరోసారి అర్థ సెంచరీతో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. దురదృష్టవశాత్తూ కీలక సమయంలో, పరుగులు చేయడం ఇబ్బందిగా మారుతున్న దశలో ఓ భారీ షాట్‌కు పోయి బౌండరీ వద్ద క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఒక దశలో పరుగులు చేయడం ఎంత కష్టంగా మారిందంటే 10వ ఓవర్ మూడో బంతికి రాహల్ ఔటయ్యే సమయానికి 83 పరుగులు చేసిన భారత్.. 14వ ఓవర్‌లో రోహిత్ ఔటయ్యే సమయానికి 98 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ మధ్యలో బౌండరీలే కరువవ్వడంతో.. రాహుల్ ఔటయ్యే సమయానికి బంగ్లా మీద ఒత్తిడి వుంటే.. రోహిత్ ఔటయ్యే సమయానకి భారత్ ఒత్తిడిలోకి వెళ్లింది.

స్పిన్నర్లు తిప్పేశారు

టాస్ గెలిచిన రోహిత్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ బ్యాటింగ్ ఎప్పట్లానే సాగింది. వేగంగా పరుగులు చేయాలనే ఆరాటంలో మరోసారి వికెట్లు కోల్పోయింది. తొలి నాలుగు వికెట్లూ స్పిన్నర్లే దక్కించుకోవడం విశేషం. ఒక సిక్స్ బాది ప్రమాదకరంగా కనిపిస్తున్న లిటన్ దాస్‌ను వాషింగ్టన్ బలిగొంటే.. తర్వాత మూడు వికెట్లు చాహల్ ఖాతాలో చేరాయి. చాహల్ వేసిన 5వ ఓవర్‌లో తమీమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్‌లు అనవసర షాట్లకు పోయి వికెట్లు సమర్పించుకోవడంతో బంగ్లాదేశ్ పని అయిపోయినట్టే కనిపించింది.

సబ్బీర్ ఎదురుదాడి

పవర్ ప్లే ముగిసేలోపే మూడు వికెట్లు కోల్పోయినా అవతలి ఎండ్‌లో వున్న సబ్బీర్ రహ్మాన్(77; 50 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) బెదరలేదు. ధాటిగా ఆడుతూ బంగ్లా స్కోరు బోర్డును పరుగులెత్తించాడు. తదనంతరం వచ్చిన ముష్ఫికర్(9), మహ్మదుల్లా(21) ఎక్కువసేపు నిలబడకపోయినా ఒంటి చేత్తో నడిపించిన సబ్బీర్.. 19వ ఓవర్‌లో 147 పరుగుల వద్ద తన పోరాటాన్ని ముగించాడు. కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు రనౌట్ల రూపంలో వెనుదిరిగినా.. చివర్లో మెహిదీ హసన్ 2 సిక్స్‌లు బాది పోరాడే స్కోరును అందించాడు.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ : తమీమ్ ఇక్బాల్ (సి) ఠాకూర్ (బి) చాహల్ 15, లిటన్ దాస్ (సి) రైనా (బి) వాషింగ్టన్ సుందర్ 11, సబ్బీర్ రహ్మాన్ (బి) ఉనద్కత్ 77, సౌమ్య సర్కార్ (సి) ధావన్ (బి) చాహల్ 1, ముష్ఫికర్ రహీమ్ (సి) విజయ్ శంకర్ (బి) చాహల్ 9, మహ్మదుల్లా (రనౌట్-కార్తీక్/విజయ్ శంకర్) 21, షకిబుల్ హసన్ (రనౌట్-రాహుల్/శంకర్) 7, మెహిదీ హసన్ 19(నాటౌట్), రూబెల్ హుసేన్ (బి) ఉనద్కత్ 0, ముస్తఫిజుర్ రహ్మాన్ 0(నాటౌట్), ఎక్స్‌ట్రాలు 6; మొత్తం: నిర్ణీత 20 ఓవర్లలో 166/8

వికెట్ల పతనం : 27-1(లిటన్ దాస్), 27-2(తమీమ్ ఇక్బాల్), 33-3(సౌమ్య సర్కార్), 68-4(ముస్తఫిజుర్ రహీమ్), 104-5(మహ్మదుల్లా), 133-6(షకిబుల్ హసన్), 147-7(సబ్బీర్ రహ్మాన్), 148-8(రూబెల్ హుసేన్)

బౌలింగ్ గణాంకాలు : జయదేవ్ ఉనద్కత్ 4-0-33-2, వాషింగ్టన్ సుందర్ 4-0-18-1, యుజువేంద్ర చాహల్ 4-0-18-3, శార్దుల్ ఠాకూర్ 4-0-45--, విజయ్ శంకర్ 4-0-48-0

భారత్ : శిఖర్ ధావన్ (సి) హక్(సబ్) (బి) షకిబ్ 10, రోహిత్ శర్మ (సి) మహ్మదుల్లా (బి) నజ్ముల్ ఇస్లామ్ (బి) 56, సురేశ్ రైనా (సి) రహీమ్ (బి) రూబెల్ 0, లోకేశ్ రాహుల్ (సి) సబ్బీర్ (సి) రూబెల్ 24, మనీశ్ పాండే (సి) సబ్బీర్ (బి) 28, విజయ్ శంకర్ (సి) మెహిదీ హసన్ (బి) సౌమ్య సర్కార్ 17, దినేశ్ కార్తీక్ 29(నాటౌట్), వాషింగ్టన్ సుందర్ 0(నాటౌట్), ఎక్స్‌ట్రాలు 4; మొత్తం 20 ఓవర్లలో 168/6

వికెట్ల పతనం : 32-1(శిఖర్ ధావన్), 32-2(సురేశ్ రైనా), 83-3(లోకేశ్ రాహుల్), 98-4(రోహిత్ శర్మ), 133-5(మనీశ్ పాండే), 162-6(విజయ్ శంకర్)

బౌలింగ్ గణాంకాలు

షకిబుల్ 4-0-28-1, మెహిదీ హసన్ 1-0-17-0, రూబెల్ 4-0-35-2, నజ్ముల్ ఇస్లామ్ 4-0-32-1, ముస్తఫిజుర్ 4-1-21-1, సౌమ్య సర్కార్ 3-0-33-1

పదకొండు మందీ ఆడితేనే..

● వినోద్ రాయ్



న్యూఢిల్లీ: ఆటగాళ్లకు జీతాలు పెంచడాన్ని బీసీసీఐ సీఓఏ చీఫ్ వినోద్ రాయ్ మరోసారి సమర్థించుకున్నాడు. కేవలం పదకొండు మంది ఆటగాళ్లు మైదానంలో చెమట చిందించడం వల్లే ఈరోజు బీసీసీఐగానీ, దాన్ని నడిపే వ్యక్తులు గానీ బతకగలుగుతున్నారని.. అలాంటి ఆటగాళ్లకు తగిన రీతిలో జీతాలు ఇవ్వాల్సిన అవసరం వుందని వినోద్ రాయ్ వ్యాఖ్యానించారు.

ఏప్లస్ ఆలోచన ధోనీ, విరాట్‌లదే

బీసీసీఐ ఆటగాళ్ల కాంట్రాక్టులో కొత్తగా తెరమీదకొచ్చిన ఏప్లస్ క్యాటగెరీని విరాట్, ధోనీలే తమ ముందుంచారని రాయ్ తెలిపారు. అత్యంత విలువైన ఏప్లస్ క్యాటగెరీలో కాకుండా ఏ క్యాటగెరీలో ధోనీని చేర్చడం అతని విలువను తగ్గించడమే అనే అభిప్రాయం వ్యక్తమవుతున్న దశలో వినోద్ రాయ్ వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. అన్ని ఫార్మాట్‌లలోనూ ఆడుతున్న అత్యున్నత ఆటగాళ్లకు ప్రత్యేక క్యాటగెరీ వుండాలని ఆటగాళ్లే బీసీసీఐ ముందుంచారట! ఈ కొత్త క్యాటగెరీ కూడా ప్రతిభకు అద్దం పట్టేలా, ప్రదర్శనని బట్టి ఎప్పటికప్పుడు మారుతూ వుండాలని వారు కోరినట్టు రాయ్ పేర్కొన్నారు. ఇక ధోనీ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం విరాట్ కోహ్లి, శిఖర్ ధావన్, బుమ్రా, రోహిత్ శర్మ, భువనేశ్వర్‌లు ఏప్లస్ క్యాటగెరీలో వున్నారు. వీరికి ఏడాదికి రూ.7 కోట్ల రూపాయలు బీసీసీఐ చెల్లిస్తుంది. టెస్టులకు దూరంగా వుంటున్న ధోనీ ఏ క్యాటగెరీలో వున్నాడు. అతడికి కాంట్రాక్టు ప్రకారం సంవత్సరానికి 5 కోట్ల రూపాయలు చెల్లించాలి.

క్రికెటర్ల కష్టాలు క్రికెటర్లకే తెలుస్తాయి

ఈరోజు క్రికెటర్లకు ఈ స్థాయిలో డబ్బులొస్తున్నాయి కానీ రెండు పూట్లా నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నవారున్నారు. అలాంటి వారి గురించి బీసీసీఐ కంటే ఆటగాళ్లకే బాగా తెలుసని రాయ్ అంటున్నారు. ఆటగాళ్లే పేద క్రికెటర్లను బీసీసీఐ దృష్టికి తీసుకొస్తున్నారట. అందుకే క్రికెటర్ల బాగోగులు చూడటంలో రాజీపడబోమనీ... అందులో భాగంగానే దేశవాళీ క్రికెటర్లకు ఏడాదికి 20 లక్షలపైనే అందేలా చేశామన్నారు.. దీంతో వారు మరో ఉద్యోగం గురించి ఆలోచించాల్సిన అవసరం వుండదని అభిప్రాయపడ్డారు.

వారి స్నేహం అసాధారణం

పనిలో పనిగా కోహ్లి, ధోనీల స్నేహబంధంపై ప్రశంసల జల్లు కురిపించాడు రాయ్. వారిద్దరి మధ్య ఒకరికొకరికి అమితమైన అభిమానం వున్నట్టుగా చెప్పుకొచ్చారు. ''పొట్టి ఫార్మాట్‌లో ధోనీకి ప్రత్యామ్నాయం లేదని కోహ్లి అభిప్రాయం. అతని క్రికెట్ పరిజ్ఞానం మీద కూడా కోహ్లికి అంతే గౌరవం వుంది. ఇక కోహ్లి సాధిస్తున్న విజయాలను ధోనీ అంతే స్థాయిలో గౌరవిస్తాడు'' అని రాయ్ తెలిపాడు. సాధారణంగా ఇద్దరు సూపర్ స్టార్‌ల మధ్య అంత గొప్ప స్నేహం వుండకపోవడం కనిపిస్తుంటుంది, అందుకు ధోనీ, కోహ్లిలు అతీతం అనే అభిప్రాయం రాయ్ వెలిబుచ్చారు. రాయ్ చెప్పినా చెప్పకపోయినా క్రికెట్ ప్రేక్షకులకు ఈ విషయం తెలుసనే చెప్పాలి. గతంలో సచిన్, ద్రావిడ్ లాంటి ఆటగాళ్లకు ధోనీ, సచిన్‌లు ఎంత గౌరవించారో క్రికెట్ అభిమానులు చూశారు. ఇప్పుడు మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు కూడా ధోనీ అభిప్రాయాలకు కోహ్లి విలువివ్వడం కూడా చూస్తూనే వున్నారు. ముఖ్యంగా డీఆరెస్ నిర్ణయాలలో ఇప్పటికే ధోనీ నిర్ణయాన్ని కోహ్లి శిలాశాసనంలా భావిస్తుండటం తెలిసిందే. నిర్ణయాలు కొన్నిసార్లు వ్యతిరేకంగా వచ్చినా నవ్వుకుంటూ స్వీకరించడం వారి మధ్య అనుబంధాన్ని కళ్లకు కట్టినట్టు తెలుపుతూనే వుంది.

క్లీన్ స్వీప్ అయ్యారు

వదోదర: కనీసం ఆఖరి వన్డేలో అయినా గెలిచి పరువు నిలుపుకోవాలనుకున్న భారత్ ఆశలు తీరలేదు. పైగా గత మ్యాచ్‌ల కంటే దారుణంగా 97 పరుగుల తేడాతో పరాజయాన్ని మూటగట్టుకుని ఆతిథ్య జట్టు నిరాశపరిచింది. ఆసీస్ నిర్దేశించిన 333 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించలేక చేతులెత్తేసింది. 44.4 ఓవర్లలో 235 పరుగులకే చతికిలపడింది. ఓపెనర్లు వేగంగా పరుగులు సాధిస్తూ మంచి ఆరంభం అందించినా అదే స్థాయి ప్రదర్శన మ్యాచ్ ఆద్యంతం కొనసాగించడంలో భారత జట్టు విఫలమైంది. స్మృతి మంధన 42 పరుగుల్లోనే 52 పరుగులు చేయగా.. మరో ఓపెనర్ రోడ్రిగ్స్ 41 బంతుల్లో 42 పరుగులు చేసింది. తర్వాత వచ్చిన బ్యాట్స్‌వుమెన్ బంతులు వృథా చేయడం తప్ప వేగంగా పరుగులు చేయలేకపోవడంతో కనీసం పోటీ ఇచ్చేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఇక ఆస్ట్రేలియా తరపున అలీసా హీలీ(133; 115 బంతుల్లో 17 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారీ సెంచరీతో చెలరేగింది. చివరి పది ఓవర్లలో 90కి పైగా పరుగులు సాధించిన పర్యాటక జట్టు 7 వికెట్ల నష్టానికి 332 పరుగులు చేయగలిగింది. సెంచరీ రాణి హీలీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. తొలి రెండు వన్డేల్లో అదరగొట్టిన నికోల్ బోల్టన్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌కు ఎంపికైంది.

ఫెదరర్ వర్సెస్ డెల్‌పోట్రో

ఇండియన్‌వెల్స్: ఎడారి ఓపెన్‌లో ఫెదరర్ మరోసారి ఫైనల్‌కు చేరుకున్నాడు. సెమీస్‌లో ఓటమి కోరల్లోంచి తప్పించుకుని ఫైనల్‌లో డెల్‌పోట్రోతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యాడు. సెమీఫైనల్‌లో బోర్నా సోరిచ్‌పై 5-7, 6-4, 6-4తో విజయం సాధించడం ద్వారా సీజన్‌లో ఓటమి లేకుండా వరసగా 17వ విజయాన్ని కైవసం చేసుకోవడంతో పాటూ ప్రతిష్ఠాత్మక టోర్నీ సొంతం చేసుకునేందుకు అడుగుదూరంలో నిలిచాడు. తొలి సెట్ కోల్పోయి, రెండో సెట్‌లో 2-4తో వెనకబడివున్న దశనుంచీ పుంజుకుని ఫెదరర్ విజయం సాధించడం విశేషం. ఇక ఫైనల్‌లో డెల్‌పోట్రోతో మ్యాచ్ అంత ఈజీగా వుండకపోవచ్చు. గతంలో ఫెదరర్ మీద గెలిచి యుఎస్ ఓపెన్ గెలిచి చరిత్ర సృష్టించిన ఘనత డెల్‌పోట్రోది. బ్యాక్ హ్యాండ్ విషయంలో కొంత బలహీనంగా కనిపించినా.. కీలక సమయాల్లో తన ఆటతీరును గణనీయంగా మెరుగుపరుచుకోగల సమర్థుడు అర్జెంటీనా స్టార్. గాయాల కారణంగా కెరీర్‌లో సింహభాగాన్ని కోల్పోయినా, ఎప్పటికప్పుడు తన సత్తా చాటుతూనే వున్నాడు. ఈ మధ్యే క్లే కోర్టు టోర్నీ అకాపుల్కోను టాప్ 8 ఆటగాళ్లను వరసగా ముగ్గురిని ఓడించడం ద్వారా గెలుచుకున్నాడు. డెల్‌పోట్రో, ఫెదరర్ మధ్య జరిగిన చివరి రెండు మ్యాచులూ మూడు సెట్లపాటూ జరగడం విశేషం. గ్రాండ్‌స్లామ్‌లలో విజేతలు ఐదింట మూడు సెట్లు గెలవాల్సి వుండగా.. ఏటీపీ టూర్‌లో కేవలం మూడింట రెండు గెలవాల్సి వుంటుంది.

రబాడాకు ఛాన్స్!

కేప్‌టౌన్ : దురుసు ప్రవర్తన కారణంగా ఆస్ట్రేలియాతో సిరీస్‌లో మిగిలిన రెండు టెస్టులకు దూరమైన సఫారీ సెన్సేషన్ రబాడా తిరిగి జట్టులోకి వచ్చేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి. కనీసం దక్షిణాఫ్రికా జట్టు ఆరకంగా ఆశలు పెట్టుకుంది చెప్పొచ్చు. మూడో టెస్టుకు ప్రకటించిన జట్టులో రబాడాను చేర్చడమే అందుకు నిదర్శనం. మొత్తం 17 మందితో కూడిన జట్టులో రబాడాను కూడా చేర్చి ఒక రకంగా ఆశ్చర్యపరిచింది సౌతాఫ్రికా. రబాడా తన నిషేధంపై అప్పీలు చేసుకోవడంతో ఎందుకైనా మంచిది అనే నిర్ణయానికి ఆ జట్టు వచ్చినట్టు తెలుస్తోంది. అందునా సిరీస్‌ను సమం చేయడంలో రబాడా కీలక పాత్ర పోషించాడు. రెండో టెస్టులో ఏకంగా 11 వికెట్లు తీసి ఆసీస్ పతనాన్ని శాసించాడు. తొలి టెస్టులో గెలిపించలేకపోయినా కీలక వికెట్లు తీయడంలో ముందుంటున్నాడు. రబాడా బౌలింగ్ శైలి కూడా ప్రత్యర్థి జట్లను బాగా ఇబ్బంది పెట్టేవిధంగా వుంటోంది. అప్పటిదాకా ఒకలా బౌలింగ్ చేస్తూ కనిపించే రబాడా.. ఉన్నట్టుండి అదేదో ప్రత్యర్థి మీద గొరిల్లా దాడి చేసినట్టు ఉక్కిరిబిక్కిరి చేసి వరస వరసగా వికెట్లు తీస్తూ... పటిష్ట స్థితిలో కనిపించే ఉన్న జట్లను కూడా ఎదురీదే స్థాయికి తీసుకువచ్చేలా ప్రదర్శన చేస్తున్నాడు. అందుకే రబాడా మళ్లీ రావాలని ప్రొటీస్ జట్టు కోరుకుంటోంది. సమమైన సిరీస్ గెలవాలంటే జట్టులో అతనుండాలని భావిస్తోంది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.